'యువికా'కు రేపటిలోగా దరఖాస్తు చేసుకోండి

నెల్లూరు (విద్య), మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : యువ విజ్ఞాన కార్యక్రమానికి జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలకు చెందిన 9వతరగతి విద్యార్థులు ఈ నెల 23వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సైన్స్ అధికారి కరుణాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక చేసిన విద్యార్థుల జాబితాను ఇస్రో అధికారులు ఏప్రిల్ 7వ తేదీన విడుదల చేసి, మే 18వ తేదీన ఆహ్వానిస్తారని పేర్కొన్నారు. మే 19 నుంచి 30వ తేదీ వరకు యువికా కార్యక్రమం జరిపి 31వతేదీన ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందచేస్తారన్నారు.



'ఆంధ్రజ్యోతి' లక్కీడ్రా నేడే!

సాయంత్రం నెల్లూరులో విజేతల ఎంపిక

3 ప్రధాన బహుమతులతోపాటు వంద కన్సొలేషన్ గిఫ్టులు

అతిథులుగా ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి, 'శుభమస్తు' అధినేత రవి



నెల్లూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : పాఠకులు ఎప్పుడెప్పుడా అని ఆత్రుతగా ఎదురుచూస్తున్న 'ఆంధ్రజ్యోతి లక్కీ డ్రా' శనివారం జరగనుంది. నెల్లూరు నగరంలోని ఉడ్‌కాంప్లెక్స్‌లో ఉన్న ఆంధ్రజ్యోతి కార్యాలయం వేదికగా 'కార్ అండ్ బైక్ రేస్'లో అదృష్ట పాఠకులు ఎవరన్నది తేలనుంది. సాయంత్రం జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కోవూరు ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, శుభమస్తు షాపింగ్ మాల్ యజమాని భయ్యా రవి హాజరుకానున్నారు. పాఠకుల నుంచి వచ్చిన వేలాది కూపన్లలో విజేతలను ఎంపిక చేయనున్నారు. ప్రథమ బహుమతి కింద మోటార్ బైక్, రెండో బహుమతి రెఫ్రిజిరేటర్, మూడో బహుమతి టీవీని విజేతలకు అందజేయనున్నారు. అలాగే మరో 100 కన్సొలేషన్ బహుమతుల కింద ఒక్కొక్కరికి రూ.2 వేలు విలువచేసే గృహోపకరణాలను అందజేయనున్నారు. 'ఆంధ్రజ్యోతి' 22వ వార్షికోత్సవం సందర్భంగా పాఠకులకు రూ.కోటి విలువైన బహుమతులను అందజేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. 2024 నవంబరు 1 నుంచి 2025 ఫిబ్రవరి 28వ తేదీ మధ్య 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కూపన్లను పాఠకులు ఇప్పటికే 'ఆంధ్రజ్యోతి' కార్యాలయానికి పంపారు. జిల్లాలో వేల సంఖ్యలో ఈ కూపన్లు అందగా, వీరిలో అదృష్టవంతులు ఎవరన్నది శనివారం తెలుస్తుంది. విజేతలకు ఫోన్ ద్వారా సమాచారం అందించడం జరుగుతుంది.



సమయం : శనివారం సాయంత్రం 5 గంటలకు | **వేదిక : నెల్లూరులోని ఆంధ్రజ్యోతి ప్రధాన కార్యాలయం**

'సోమశిల'లో నీరు నిల్వ

అనంతసాగరం (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా శుక్రవారం 54.630 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 500, ఉత్తర కాలువకు 400, దక్షిణ కాలువకు 350, కండలేరుకు 200 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

పోలీసులకు ఉగాది పురస్కారాలు

నెల్లూరు(క్రైం), మార్చి 21 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించిన పోలీసు అధికారులు, సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉగాది పురస్కారాలను ప్రకటించింది. ఉత్తమ సేవాపతకానికి సీసీఎస్ ఎఎస్ఐ డి హరీంద్రబాబు, నెల్లూరు ఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ (హెచ్‌సీ) టి ప్రభాకర్‌రావు, సీఐడీ హెచ్‌సి ఎం వెంకటేశ్వర్లు ఎంపికయ్యారు. సేవా పతకా నికి చిన్నబజారు పోలీసుస్టేషన్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ కోటేశ్వరరావు, హోంగార్డ్సు ఆర్ఐ వై పాల్‌రాజు, ఏఆర్ హెచ్‌సీ ఎస్ పాండురంగారెడ్డి, ఏఆర్ ఏఎస్ఐ ఎం శంకరయ్య, కావలి రూరల్ పీసీ కె పూర్ణచంద్రబాబు, బాలాజీనగర్ ఏఎస్ఐ పి శ్రీనివాసరావు, కోవూరు హెచ్‌సీ షేక్ నజీర్‌బాషా, ఏఆర్ హెచ్‌సీ ఎస్ కోటేశ్వర రావు, వెంకటాచలం సత్రం హెచ్‌సీ ఎస్‌డి నజ్మల్‌హుసేన్, సీఐడీ హెచ్‌సీ కె దయానిధి, సీఐడి హెచ్‌సి మాలరెళ్ల రవిలు ఎంపికయ్యారు. సేవాపతకం స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఫైర్ సర్వీసెస్‌కు పొదలకూరుకు ఎస్ఎఫ్ఓ టి విజయకుమార్, నెల్లూరు ఫైర్‌మన్ కె రామకృష్ణ ఎంపికయ్యారు.

పెన్నా ప్యాకేజీలో ఎన్నెన్నో సిత్రాలు..!

- ప్రీక్లోజ్ అయ్యాక పార్ట్ బిల్లుకు విజ్ఞప్తి
- ఆ తర్వాత అదే పేరుతో మళ్లీ ఫైనల్ బిల్లుకు క్యూసీసీ
- ఏడాది తర్వాత మళ్లీ కొట్టేసి రూ.4 కోట్లు పెంపు

6

మెడికల్ షాపుల్లో 'ఆపరేషన్ గరుడ'

- డ్రగ్స్ దుర్వినియోగంపై సోదాలు



మెడికల్ షాపులో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

నెల్లూరు (క్రైం), మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : 'ఆపరేషన్ గరుడ'లో భాగంగా ఐజీ ఈగల్ టీమ్, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, పోలీసులు, డ్రగ్స్ కంట్రోల్ అధికారులు సంయుక్తంగా శుక్రవారం జిల్లావ్యాప్తంగా మెడికల్ షాపుల్లో దాడులు నిర్వహించారు. మూడు ప్రత్యేక బృందాలుగా అధికారులు విడిపోయి నగరంలోని స్టోన్‌హౌస్‌పేట, శ్రీనివాస అగ్రహారం, ఆచారవీధి, బోసుబొమ్మ ప్రాంతాలతోపాటు ఆత్మ కూరులో ఆకస్మిక తనిఖీలు చేశారు. కొన్ని రకాల మందులకు సంబంధించిన విక్రయాలపై పరిశీలిస్తున్నారు. ఎంతమొత్తంలో మాత్రలు కొనుగోలు చేశారు.. ఎవరికి విక్రయించారు... వాటి తాలుకు బిల్లులు, వైద్యుల చీటీల మేరకు విక్రయాలు సాగించారా!? తదితర వివరాలు సేకరి స్తున్నారు. తనిఖీలు పూర్తయిన తర్వాత పూర్తి నివేదికను ప్రభుత్వానికి అంది స్తామని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ తెలిపారు. ఔషధ నియంత్రణ శాఖ ఏడీ వీరకుమార్ మాట్లాడుతూ డాక్టర్ల ప్రిస్క్రిప్షన్ లేకుండా మ త్తుమాత్రలను విక్రయించకూడదన్నారు. యువత మత్తు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్లు కె నరసింహరావు, ఎ శ్రీహరిరావు, షేక్ సుభాని, విష్ణురావు, డీసీటీవో పి వేణుగోపాల్‌రావు, ఏవో వెంకటరెడ్డి, ఔషధ నియంత్రణ శాఖ ఇన్‌స్పెక్టర్లు కీర్తి పవిత్ర, టి వెంకటకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.



కలువాయి : రాజుపాళెం సమీపంలో పెన్నానదిలో నిర్మించిన రోడ్డు

ఇంత బరితెగింపా!?

రాజుపాళెంలో ఇసుకాసురుల దోపిడీ

పెన్నానదిలో ర్యాంపు, మట్టిరోడ్డు నిర్మాణం

ప్రభుత్వ భూముల నుంచి గ్రావెల్ తరలింపు

గ్రామస్థుల ఫిర్యాదుతో టిప్పర్లను పట్టుకున్న అధికారులు

తెల్లవారేసరికల్లా వదిలేయడంపై విమర్శలు

కలువాయి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : పెన్నమ్మను ఇసుకాసురులు వదలడం లేదు. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ నదిని కుళ్లబొడుస్తున్నారు. కలువాయి మండలం రాజుపాళెం సమీపంలో ఏకంగా ర్యాంప్ ఏర్పాటు చేసి రాత్రివేళల్లో యంత్రాలతో ఇసుకను తవ్వి అక్రమంగా తరలిస్తున్నారు. అయితే, మరింత నాణ్యమైన ఇసుక కోసం అక్రమార్కులు నది లోపలికి అక్రమంగా కిలోమీటరు పొడవున మట్టి రోడ్డు నిర్మించారు. నదిలో నీటి ప్రవాహం ఉన్న చోట సిమెంటు పైపులు వేసి మరీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. అనధికార ఇసుక ర్యాంప్‌నకు ఏకంగా నదికి అడ్డంగా లక్షలాది రూపాయలు వెచ్చించి రోడ్డు వేయడంపై పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా నీటిపారుదలశాఖ అధికారులు అటువైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. రోడ్డు నిర్మాణానికి అవసరమైన గ్రావెల్‌ను కుల్లూరు సమీపంలోని ప్రభుత్వ భూముల నుంచి టిప్పర్లతో తరలిస్తున్నారు. అయితే, ఈ గ్రావెల్ అక్రమ తరలింపుపై గ్రామస్థులు వ్యతిరేకత వ్యక్తం చేశారు. దీంతో గురువారం అర్ధరాత్రి రెవెన్యూ అధికారులు దాడి చేసి గ్రావెల్ కోసం వచ్చిన టిప్పర్లను స్వాధీనం చేసుకుని తహసీల్దారు కార్యాలయానికి తరలించారు. అయితే, తెల్లవారేసరికల్లా ఆ టిప్పర్లను వదిలేయడంపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం ఆత్మకూరు ఆర్డీవో పావని ఆదేశాల మేరకు తహసీల్దారు శ్యామ్‌సుందరరాజు తన సిబ్బందితో రాజుపాళెం వద్ద ఉన్న అక్రమ ఇసుక ర్యాంపును, నదిలో వేసిన రోడ్డును పరిశీలించారు. రోడ్డు నిర్మాణానికి గ్రావెల్ తరలించిన కుల్లూరులోని ప్రభుత్వ భూమిని కూడా వారు పరిశీలించారు.

చర్యలు తీసుకుంటాము

రాజుపాళెం వద్ద ఉన్న అక్రమ ఇసుక రీచ్‌ను, నదిలోకి వేసిన రోడ్డును పరిశీలించి చర్యలు తీసుకుంటాము. కుల్లూరు సమీపం నుంచి గ్రావెల్ అక్రమంగా తరలిస్తున్న వారిపై కేసులు పెట్టాలని తహసీల్దారుకు ఆదేశాలు జారీ చేశాము.

- పావని, ఆత్మకూరు ఆర్డీవో



కుల్లూరు వద్ద నుంచి గ్రావెల్ తరలించేందుకు వచ్చిన యంత్రాలను అడ్డుకుంటున్న రెవెన్యూ సిబ్బంది

బెట్టింగ్.. యువతే టార్గెట్!!

- మొదలైన ఐపీఎల్ కొత్త సీజన్
- క్రికెట్ బెట్టింగ్ కోసం ప్రత్యేక యాప్‌లు
- లావాదేవీలన్నీ ఆన్‌లైన్‌లోనే..
- ఈజీ మనీ కోసం బానిసలవుతున్న యూత్
- అధిక వడ్డీలు, తనఖా, తండల్‌కు అప్పులు
- రోడ్డున పడుతున్న కుటుంబాలు

- వివరాలు 8

అటవీ శాఖ అత్యుత్సాహం

ఎటువంటి సమాచారం లేకుండా అటవీ శాఖ ఏర్పాటు చేసిన హద్దుల దిమ్మెలు



భూముల్లో ఇష్టానుసారం హద్దురాళ్లు

రెవెన్యూ అధికారుల ఆదేశాలూ బేఖాతరు

24న సర్వే చేస్తాం : తహసీల్దారు

ఇటీవల కడప జిల్లా బద్వేలు నియోజక వర్గంలో కాశీనాయన ఆశ్రమం వద్ద అటవీ శాఖ అధికారులు చేసిన పనులకు రాష్ట్ర ప్రభుత్వం క్షమాపణ చెప్పుకో వాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయినా, ఆ శాఖ అధికారుల్లో మాత్రం మార్పు ఉండటం లేదు. చేజర్ల మండలంలో గతంలో అటవీ శాఖకు చెందిన అధికారులు తీసిన ట్రెంచ్ (గాడులు) కాదంటూ ఇష్టానుసారంగా హద్దులు ఏర్పాటు చేస్తుండటంపై గ్రామస్థులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

చేజర్ల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : చేజర్ల మండంలోని ఆదురుపల్లి, చిత్తలూరు గ్రామాల సమీపంలో ఉన్న అటవీ భూముల్లో అటవీ శాఖ సిబ్బంది ఇటీవల హద్దులు ఏర్పాటు చేస్తుండటంపై చిత్తలూరు గ్రామస్థులు గమనించి తహసీల్దారుకు ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన తహసీల్దారు గ్రామస్థులు, రైతులు, రెవెన్యూ అధికారుల సమక్షంలో సర్వే చేయాలని అప్పటివరకు పనులు ఆపాలని ఫారెస్టు డీఆర్‌వోకు తెలియజేశారు. ఆ తర్వాత 17వ తేదీన అటవీ శాఖకు చెందిన డీఆర్‌వో, సిబ్బంది వీరితోపాటు రెవెన్యూకు చెందిన చిత్తలూరు వీఆర్‌వో, ఇద్దరు సర్వేలు కొంతమంది గ్రామస్థులు సర్వే చేపట్టారు. ఈ క్రమంలో హద్దురాళ్ళు కనపడకపోవడంతో సర్వే ఆలస్యం అవుతుందని అటవీ అధికారులు, సర్వేయర్లు చెప్పడంతో అప్పటివరకు హద్దులు ఏర్పాటు చేయవద్దని పూర్తి సర్వే చేసిన తర్వాతే హద్దులు ఏర్పాటు చేయాలని అటవీశాఖ అధికారులను ఆదేశించారు. అయితే శుక్రవారం అటుగా వెళ్ళిన రైతులు హద్దులు ఏర్పాటు చేసి ఉన్న దిమ్మెలకు పెయింట్ కూడా పూర్తి చేసి ఉండడంతో వీఆర్‌వోకు సమాచారం ఇచ్చారు. అక్కడకు వెళ్ళి పరిశీలించిన వీఆర్‌వో పలుమార్లు అటవీ శాఖ డీఆర్‌వోకు ఫోన్ చేసినా స్పందించలేదు. ఆదురుపల్లి అటవీశాఖలో పని చేస్తున్న ఓ ఉద్యోగి అత్యుత్సాహంతోనే ఇదంతా జరుగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పుడు హద్దులు ఏర్పాటు చేస్తే త్వరలో జరిగే రీసర్వేలో కూడా ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని, అధికారులు స్పందించి రెవెన్యూ భూములకు రక్షణ కల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు. కాగా, ఈ వ్యవహారంపై తహసీల్దారు మురళి మాట్లాడుతూ గ్రామస్థుల ఫిర్యాదు మేరకు సోమవారం రెవెన్యూ అధికారుల సమక్షంలో సర్వే చేస్తామని చెప్పారు. సర్వే అయిన తర్వాత బాధ్యులపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

మొక్కలోనే మింగేశారు!

వరికుంటపాడు మండలం కొత్తపేట బీట్ పరిధిలో ఎండుముఖం పట్టిన మొక్క



అటవీ శాఖలో మరో అవినీతి బాగోతం

వరికుంటపాడు మండలంలో నిధుల స్వాహా!

మొక్కలు నాటడం, నిర్వహణ పేరుతో దోపిడీ

అన్నీ తెలిసినా మౌనం వీడని అధికారులు

ఉదయగిరి రూరల్, (ఆంధ్రజ్యోతి): ఎవరు ఏమనుకున్నా మాకేం.. అనుకు న్నారో, ఉన్నతాధికారుల అండ ఉందనుకున్నారో ఏమోగానీ ఉదయగిరి అటవీ శాఖలో కొంత మంది అవినీతి బాగోతం కొనసాగుతూనే ఉంది. ప్లాంటేషన్ పనులతో మొదలు ఏపుగా పెరిగిన జామాయిల్ కర్ర అక్రమ తరలింపు వరకు యథేచ్ఛగా అక్రమ దందా సాగుతున్నా కన్నెత్తి చూసే నాథులే కరువయ్యారు. వరికుంటపాడు మండలంలోని కనియం పాడు సమీపంలోని కొత్తపేట బీట్, విరువూరు గ్రామాల్లో మొక్కలు నాటే క్రమంలో చోటు చేసుకున్న అవినీతిని మరువకముందే మరొకటి వెలుగులోకి వచ్చింది. కొత్తపేట బీట్ పరిధిలోని 116 హెక్టార్లలో క్యాంపా (అటవీ ప్రత్యామ్నాయ వనీకరణ) పథకం పేరుతో మంజూరైన రూ.1.20 కోట్లతో ఎర్రచందనం, తెల్లమద్ది, మర్రి, వేప, రాగి, నేరేడు మొక్కలు నాటే పనులకు శ్రీకారం చుట్టారు. వీఎస్ఎస్ చేయాల్సిన ఆ పనులను అధికారులు ఉదయగిరికి చెందిన కూలీలతో చేయించి రికార్డుల్లో మాత్రం వీఎస్ఎస్ సభ్యుల పేర్లు నమోదు చేశారు. తొలుత ఆ భూమి కొనుగోలు విషయంలోను అవినీతికి పాల్పడినట్లు విమర్శలు ఉన్నాయి.

● నిబంధనలకు తూట్లు

మొక్కలు నాటే క్రమంలో నిబంధనలు పాటించక పోవడంతో తక్కువ సమయంలోనే ఏపుగా పెరగాల్సిన మొక్కలు ఎండుముఖం మాడిపోతున్నాయి. కొలతల ప్రకారం గుంతలు తీయకుండానే మొక్కలు నాటడం, రసాయనిక ఎరువులను సైతం వినియోగించలేదు. ఈ ప్రాంతంలో సవుడు (ఇసుక తెర) నేల అధికంగా ఉన్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించి నామమాత్రంగానే మొక్కలు నాటి చేతులు దులుపుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కానీ రికార్డుల్లో మాత్రం అంతా సవ్యంగా ఉన్నట్లు, నేల సైతం గట్టిగానే ఉన్నట్లు నమోదు చేసుకొని అధిక మొత్తంలోనే నిధుల స్వాహాకు పాల్పడినట్లు తెలిసింది.

● ఈ ఏడాదీ అదే తంతు

ఈ ఏడాది చేపట్టాల్సిన నిర్వహణ పనులకు సైతం సుమారు రూ.కోటి నిధులు మంజూరయినట్లు తెలుస్తోంది. ఆ నిధులతో మొక్కల నడుమ అంతర సేద్యం చేయాల్సి ఉండగా అరకొరగా పనులు చేపట్టి నిధులు డ్రా చేయడం గమనార్హం. అందులోను కొంతమేర పనులను కూలీల ద్వారా చేయించాలనే నిబంధనలకు తూట్లు పొడిచి తూతూమంత్రంగానే కొనసాగించారు. ఎరువుల వినియోగంలోను చేతివాటం చూపించారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. వీటికితోడు ఆ భూమిలోని మూడు బీట్‌ల పరిధిలో కేవలం ముగ్గురిని మాత్రమే కాపలాదారులుగా నియమించి ఒక్కొక్కరికి రూ.6వేలు నగదు అందించారు. రికార్డుల్లో మాత్రం ఒక్కో బీటుకు ముగ్గురు చొప్పున నియమించి ఒక్కక్కరికి రూ.13వేలు చెల్లించినట్లు నమోదు చేశారు. జిల్లా ఉన్నతాధికారులు, విజిలెన్స్ అధికారులు సమగ్ర దర్యాప్తు చేపడితే అవినీతి బాగోతం మరింత వెలుగు చూసే అవకాశం ఉంది. ఈ వ్యవహారంపై సెక్షన్ అధికారి శ్రీరాములు మాట్లాడుతూ సమగ్రంగా పరిశీలించి ఎలాంటి లోపాలు లేకుండా నిబంధనల మేరకు సమగ్రంగా పనులు జరిగేలా చర్యలు తీసుకుంటామని అన్నారు.

కేజీబీవీల్లో అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (విద్య), మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా 12 కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో (కేజీబీవీ) 2025-26 విద్యాసంవత్సరానికి ఆరో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం కోర్సుల ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సమగ్రశిక్ష ఏపీసీ వెంకట సుబ్బయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోతరగతిలో 480 సీట్లు, ఇంటర్ ప్రవేశాలకు 480 సీట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. అలాగే అన్ని కేజీబీవీల్లో 7, 8, 9, 10, 12వ తరగతుల్లో ప్రవేశాలకు మిగిలిన సీట్లను భర్తీ చేసేందుకు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. apkgbv.apcfss.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయని, ఏప్రిల్ 11వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనాథ, బడిబయట పిల్లలు, బడిమానేసినవారు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దారిద్ర్యరేఖకు దిగువన జీవిస్తున్న బాలికలు మాత్రమే అర్హులుగా పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు, సందేహాలను నివృత్తి చేసుకు నేందుకు సమీపంలోని కేజీబీవీ విద్యాలయాల్లో సంప్రదించాలని ఆయన ఆ ప్రకటనలో తెలిపారు.

హౌస్ హోల్డ్ సర్వేకు సహకరించాలి

ఉదయగిరి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో జరుగుతున్న హౌస్ హోల్డ్ సర్వే సిబ్బందికి వివరాలు తెలియజేయని కుటుంబాలు ఈనెలాఖరి నాటికి వివరాలు చెప్పి నమోదు చేయించుకోవాలని ఎంపీడీవో అప్పాజీ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలో 98 శాతం సర్వే పూర్తయిందని, మిగిలిన రెండు శాతం త్వరగా పూర్తిచేయాలన్నారు. సర్వే బృందానికి సహకరించాలని కోరారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.8494
వెండి కిలో ధర	రూ. 100300
వెండి ఒక గ్రాము	రూ.103.30

అర్ధాంతరంగా ఆగిన ప్రభుత్వ భవనాల నిర్మాణం

మందుబాబులకు అడ్డాగా మారుతున్న వైనం
వైసీపీ పాలనలో ప్రజాధనం దుర్వినియోగం



సీతారామపురంలో నిర్మాణ పనులు నిలిచిపోయిన పాలవెల్లి కేంద్రం

సీతారామపురం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో గత వైసీపీ ప్రభుత్వంలో చేపట్టిన భవనాల నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోవడంతో మందుబాబులకు అడ్డాగా మారాయని స్థానికుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రజల వద్దకే పాలనంటూ ఊదరగొట్టిన గత ప్రభుత్వం ప్రజాధనాన్ని ఇష్టారీతిగా దుర్వినియోగం చేసింది. ఈక్రమంలోనే కాంట్రాక్టర్లకు ఆశచూపి భవనాల పనులు ప్రారంభించే విధంగా ఆదేశాలు జారీ చేసింది. అయితే వైసీపీ పాలకుల మాటలు నమ్మిన కంట్రాక్టర్లు వడ్డీలకు అప్పులు తెచ్చి మరీ భవనాల నిర్మాణాలు ప్రారంభించారు. కొందరు దాదాపుగా భవనాలను పూర్తిచేశారు. మరికొందరు మధ్యలోనే అర్ధాంతరంగా భవన నిర్మాణ పనులు నిలిపివేశారు. అయితే కొందరికి ఐదు దశల్లో బిల్లులు రావాల్సి ఉండగా, రెండు దశల్లోనే ఆగిపోయాయి. దీంతో దాదాపుగా పూర్తయిన సచివాలయాలు, రైతు సేవా కేంద్రాలు నిరుపయోగంగా ఉన్నాయి. కొన్ని పాలవెల్లి కేంద్రాలు, హెల్త్‌క్లినిక్ సెంటర్లు, రైతు సేవా కేంద్రాలు అరకొర పనుల పెండింగ్‌తో నిలిచిపోయాయి. దీంతో భవనాల చుట్టూ చిల్లచెట్లు, పిచ్చిమొక్కలు పెరిగి మందుబాబులకు, అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాలుగా మారాయి. టీడీపీ ప్రభుత్వమైనా భవనాలను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

విధుల పట్ల నిర్లక్ష్యం తగదు : ఈవోపీఆర్డీ



రిజిస్టర్లు పరిశీలిస్తున్న ఈవోపీఆర్డీ భార్గవి

సీతారామపురం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని ఈవోపీఆర్డీ భార్గవి సూచించారు. మండల కేంద్రంలోని బిట్-1 సచివాలయాన్ని భార్గవి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేసి సిబ్బంది హాజరు, రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా సచివాలయంలో అందాల్సిన సేవలను మరింత విస్తృతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇంటి పన్ను వంద శాతం కట్టించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.

అర్హులందరూ ఓటు హక్కు పొందాలి



బీఎల్వోలతో మాట్లాడుతున్న తహసీల్దార్ కృష్ణారెడ్డి

సీతారామపురం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటుహక్కు పొందాలని తహసీల్దార్ కృష్ణారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని స్త్రీశక్తి భవనంలో శుక్రవారం బూత్‌స్థాయి అధికారులతో తహసీల్దార్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించడంలో బీఎల్వోల పాత్ర కీలకమన్నారు. ఫారం-8, సవరణలు, చిరునామా మార్పులు, మృతిచెందిన వారి ఓట్లను స్థానికంగా విచారణ చేసి తొలగించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాసులు, బీఎల్వోలు పాల్గొన్నారు.

యూటీఎఫ్ నేత అప్పారికి ఘన నివాళి



అప్పారి వెంకటస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు

ఉదయగిరి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): స్థానిక యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో శుక్రవారం ఐక్య ఉపాధ్యాయ సంఘ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి అప్పారి వెంకటస్వామి వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు కంభాల చంద్రశేఖర్, ఎడమ తిరుపతయ్య, బాలగురవయ్య, ఫణిరాజ్, సుబ్బారెడ్డి, శ్రీనివాసులు, వెంకటరెడ్డి, షరీఫ్, దుర్గాప్రసాద్, భాస్కర్‌రెడ్డి, రమణారెడ్డి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాస్ పథకంపై అవగాహన

సీతారామపురం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఉల్లాస్ పథకంపై ప్రతి వెలుగు మహిళ అవగాహన పెంచుకోవాలని వెలుగు కార్యాలయం ఏపీఎం వైనారుత్ సూచించారు. స్థానిక స్త్రీ శక్తి భవనంలో శుక్రవారం ఉల్లాస్ పథకంపై వీవోఏలకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ఉల్లాస్ పథకం లక్ష్యమన్నారు. ప్రతి పొదుపు సంఘం ఏగ్రేడ్‌లోకి రావాలన్నారు. మండలంలో నిరక్షరాస్యులను 316 మందిని గుర్తించి వారికి రాత్రి బడులు నిర్వహించినట్లు, వారికి మండలంలోని అంగన్వాడీ కేంద్రాల్లో ఆదివారం పరీక్ష నిర్వహిస్తామన్నారు.

మరమ్మతులకు నోచుకోని మినీ వాటర్‌ప్లాంట్

● తాగునీటి కోసం విద్యార్థుల అవస్థలు



విద్యార్థుల కోసం పెట్టిన వాటర్ క్యాన్

సంగం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పడమటిపాళెం పాఠశాలలో విద్యార్థులకు శుద్ధజలం అందించాలని గత ప్రభుత్వంలో నాడు-నేడు పథకంలో మినీ వాటర్ ప్లాంట్ మంజూరు చేశారు. కాంట్రాక్ట్ దక్కించుకున్న ఏజెన్సీ నాసిరకం పరికరాలతో ఏర్పాటుచేయడంతో ఏడాదికే మరమ్మతులకు గురైంది. కాగా, మరమ్మతులు చేయించేందుకు నిధులు లేక వీధి కుళాయి నీటినే వాడుతున్నారు. దీంతో ఆ నీటిని తాగలేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.

వాటర్‌ప్లాంటు నిర్మాణ పనులకు శ్రీకారం



పూజలు నిర్వహిస్తున్న కన్వీనర్ మధుసూదనరావు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దక్కనూరు ఎస్సీ కాలనీలో శుక్రవారం వాటర్‌ప్లాంటు నిర్మాణ పనులకు టీడీపీ మండల కన్వీనర్ చంద్ర మధుసూదనరావు శ్రీకారం చుట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ప్రత్యేక చొరవతో ప్లాంటు మంజూరైందన్నారు. వేసవి దృష్ట్యా కాలనీలో నెలకొన్న అత్యవసర పరిస్థితిని తెలుసుకొని ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని ఆయనతో పాటు కాలనీవాసులు కొనియాడారు. అనంతరం బోరుబండి వద్ద ప్రత్యేక పూజలు చేపట్టి బోరు వేయించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ రావిళ్ల నాగేంద్ర, మాజీ మండల కన్వీనర్ చంద్ర వెంకయ్య, తెలుగు యువత అధ్యక్షుడు ముజ్జి లక్ష్మీనారాయణ, సందిరెడ్డి హరిశ్చంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తరుణవాయిలో ఆధార్ ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేయాలి

సంగం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తరుణవాయి సచివాలయం పరిధిలో ఆధార్ ప్రత్యేక శిబిరం ఏర్పాటుచేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. మండలంలో 0-6 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన పిల్లలకు కొత్తగా ఆధార్ నమోదు, 5 నుంచి 15 ఏళ్ల పైబడిన వారికి బయోమెట్రిక్ అప్‌డేషన్ చేయించుకునేందుకు సచివాలయాల్లో ఆధార్ ప్రత్యేక శిబిరాల నిర్వహణకు షెడ్యూల్ ఖరారు చేశారు. అందులో భాగంగా తొలి విడత ఈనెల 19వ తేదీ నుంచి 22 వరకు, రెండవ విడత 25 నుంచి 28 వరకు షెడ్యూల్ ఖరారు చేసి ఏ తేదీల్లో ఏ సచివాలయంలో ఆధార్ ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తారో షెడ్యూల్‌లో పేర్కొన్నారు. మండలంలో 13 సచివాలయాలు ఉంటే అందులో 12 సచివాలయాలకు షెడ్యూల్ ఖరారు చేశారు. కానీ తరుణవాయి సచివాలయాన్ని అధికారులు విస్మరించారు. ఈ సచివాలయం పరిధిలో తరుణవాయి, దాసరిపాళెం, చెన్నవరపాడు, ఉడ్‌హౌస్ పేట, అమరపు నాయుడు కండ్రిక గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల్లో చాలా మంది 0-6 లోపు చిన్నారులకు ఆధార్ లేదు. అదేవిధంగా ఆధార్ అప్‌డేషన్ చేయించుకోవలసిన 5-15 ఏళ్ల మధ్య పైబడిన వారు చాలా మంది ఉన్నారు. అధికారులు స్పందించి తరుణవాయిలో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేయాలని సచివాలయ పరిధిలోని ఐదు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వయోజనుల్లో అక్షరాస్యతను పెంపొందించాలి



వీవోఏలకు సామగ్రి అందజేస్తున్న ఎంపీడీవో మల్లికార్జున

దుత్తలూరు(ఉదయగిరి), మార్చి 21(ఆంధ్రజ్యోతి): వయోజనుల్లో అక్షరాస్యతను పెంపొందించాలని ఎంపీడీవో మల్లికార్జున్ సూచించారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఆదివారం వయోజనులకు నిర్వహించే పరీక్షకు సంబంధించి అంగన్‌వాడీ కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించి సామగ్రిని పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో వయోజనులకు డిసెంబరు నెల నుంచి శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. అందుకు సంబంధించి ఆదివారం 10 నుంచి 5 గంటల్లోపు వారికి పరీక్ష నిర్వహించాలన్నారు. మండలంలో 252 మంది వయోజనులు ఉన్నారని, వారంతా పరీక్షకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కావలి డివిజన్ వయోజన విద్యా సూపర్‌వైజర్ షేక్ బాదుల్లా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్ షాను, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్షయవ్యాధి నిర్మూలన ప్రతిఒక్కరి బాధ్యత



ఉదయగిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యఆరోగ్య సిబ్బంది

ఉదయగిరి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలో శుక్రవారం టీబీ యూనిట్, గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది విద్యార్థులతో కలిసి క్షయవ్యాధి నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి ఎం శివకల్పన మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, సాయంత్రం సమయంలో జ్వరం, ఆకలి లేకపోవడం వంటి లక్షణాలుంటే సమీప వైద్యశాలలో గల్ల పరీక్ష చేయించుకోవాలన్నారు. క్షయవ్యాధిని మందులతో పూర్తిగా నయం చేయవచ్చన్నారు. క్షయవ్యాధి నిర్మూలన ప్రతిఒక్కరి బాధ్యత అని, క్షయరహిత సమాజంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలన్నారు. అనంతరం పంచాయతీ బస్టాండ్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వీ వెంకటసుబ్బయ్య, టీబీ పర్యవేక్షకుడు భోగ్యం వెంకటేశ్వర్లు, మలేరియా సబ్ యూనిట్ అధికారి నౌషాద్‌బాబు, సిబ్బంది సీహెచ్ సుధాకర్, వీ.మురళి, నౌషాద్, నవాజ్ తదితరులు పాల్గొన్నారు.

రహదారికిరువైపులా ముళ్లచెట్ల తొలగింపు



ముళ్లచెట్ల తొలగింపు వద్ద నాయకులు

ఉదయగిరి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎంజీఆర్ ప్రభుత్వ వ్యవసాయ కళాశాల నుంచి జాతీయ రహదారి వరకు ఇరువైపులా ఏపుగా పెరిగిన ముళ్లచెట్లను శుక్రవారం ఎక్స్‌కవేటర్ సహాయంతో తొలగించారు. ఆ మార్గంలో ముళ్లచెట్లు ఏపుగా పెరిగి రహదారి కనిపించకపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. దీంతో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ రోడ్లకిరువైపులా జంగిల్ క్లియరెన్స్ చేపట్టి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని హైవే అధికారులను ఆదేశించారు. టీడీపీ నాయకుల పర్యవేక్షణలో ఎక్స్‌కవేటర్ సహాయంతో రోడ్డుకిరువైపులా జంగిల్ క్లియరెన్స్ చేపట్టారు. అలాగే గ్రామాలకు వెళ్లే రహదారుల్లో సైతం జంగిల్ క్లియరెన్స్ చేపట్టి రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ చింతనబోయిన బయ్యన్న, టీడీపీ నాయకులు బొజ్జా నరసింహులు, ఉప్పుటూరి పెద వెంకటయ్య, సీహెచ్ బాలకృష్ణ, రామ్మోహన్, ఈర్ల రమణయ్య, హైవే అధికారులు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

చిన్నారులకు ఆధార్ నమోదు చేయాలి



ఆధార్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్

అనంతసాగరం మార్చి 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక సచివాలయం-2లో ఏర్పాటుచేసిన ఆధార్ నమోదు కేంద్రాన్ని మండల ఇన్‌చార్జి ఎంపీడీవో ఐజాక్ ప్రవీణ్ శుక్రవారం తనిఖీ చేశారు. 6 సంవత్సరాలు లోపు పిల్లలకు ఆధార్ నమోదు చేయడంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని సిబ్బందికి సూచించారు.

టెన్త్ పరీక్షా కేంద్రాల తనిఖీ

అనంతసాగరం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేవూరు, అనంతసాగరం పదవ తరగతి పరీక్ష కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు శుక్రవారం తనిఖీ చేశారు. ఈమేరకు వారు పలు సూచనలు చేశారు. పక్కాగా పరీక్షలు నిర్వహించాలని సూచించారు.

బుడగ జంగం కులాన్ని ఎస్సీలో చేర్చడంపై హర్షం

అనంతసాగరం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): బేడ బుడగ జంగం కులాన్ని ప్రభుత్వం కేబినెట్లో ఎస్సీ వర్గీకరణ ఏ-కేటగిరిలో చేర్చడంపై ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జే నాగేశ్వరావు శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. టీడీపీ ఇచ్చిన హామీ మేరకు నిర్ణయం తీసుకోవడంతో ప్రభుత్వానికి రుణపడి ఉంటామన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పక చేయించుకోవాలి

సీతారామపురం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులు రైతు సేవా కేంద్రంలో వీఏఏలను కలసి ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి చెన్నారెడ్డి సూచించారు. శుక్రవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు 1300 రిజిస్ట్రేషన్ పూర్తిచేసినట్లు తెలిపారు. రీసర్వే జరిగిన గ్రామాలలో అన్ని సర్వే నెంబర్లను రిజిస్ట్రేషన్ చేయడం జరుగుతుందని, మిగతా గ్రామాల్లో పట్టా భూములు, కొన్ని రకాల భూములకు రిజిస్ట్రేషన్ జరుగుతుందని తెలిపారు.

26న కర్రకంప చెట్ల వేలం

మర్రిపాడు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బూదవాడ పంచాయతీ తిమ్మాయిపాలెం చెరువులోని కర్రకంప చెట్లు కొట్టుకునేందుకు ఈనెల 26న వేలం పాట నిర్వహిస్తున్నట్లు జలవనరుల శాఖ ఏఇ రాజేశ్వరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనేవారు ముందుగా రూ. 5వేలు డిపాజిట్ చేసి తిమ్మాపాలెం రామాలయం వద్ద ఉదయం 11 గంటలకు జరుగు వేలంలో పాల్గొనాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉదయగిరి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా శనివారం సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఇన్‌చార్జి ఏఈ ఖుద్దూస్‌బాషా శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సబ్‌స్టేషన్ పరిధిలోని సీతారామపురం, ఉదయగిరి, వరికుంటపాడు, దుత్తలూరు మండలాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు ముందు భాగం

సంగం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన సంఘటన మండల పరిధిలోని సంగం - నెల్లూరు జాతీయ రహదారి మలుపు వద్ద శుక్రవారం సాయంత్రం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. కడప నుంచి మినీ ట్రక్ వ్యాను పుచ్చకాయల లోడుతో నెల్లూరు వైపు వెళ్తుండగా సంగం దాటిన తరువాత రాంపు సమీపంలో మలుపు వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108 వాహనంలో వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

C.R.I.M.E N.E.W.S

నిమ్మతోట కంచె దగ్ధం

● రూ.3 లక్షల ఆస్తి నష్టం

పొదలకూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ పరిధిలోని లింగంపల్లికి చెందిన అనుమాల వెంకట్రామిరెడ్డికి చెందిన నిమ్మతోట కంచెకు శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తులు తగలబెట్టారు. మంటలు దట్టంగా వ్యాప్తి చెందడంతో కంచె దాదాపుగా దగ్ధం అయ్యింది. సమాచారం అందుకున్న పొదలకూరు అగ్నిమాపక సిబ్బంది వాహనంతో వచ్చి మంటలు నిమ్మ చెట్లకు రాకుండా అదుపు చేశారు. పొరపాటున ఎవరైనా సిగరెట్ తాగి పడేయడంతో ఈ ప్రమాదం జరిగిందా లేక ఎవరైనా ఉద్దేశపూర్వకంగా తగలబెట్టారా అనే విషయమై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని యజమాని తెలిపారు. ఈ అగ్నిప్రమాదంలో సుమారు రూ.3లక్షల వరకు నష్టం వాటిల్లిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

లైంగిక వేధింపులు, హత్యాయత్నం కేసులో ఐదేళ్ల జైలు శిక్ష

నెల్లూరు(లీగల్), మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఓ బాలికపై లైంగిక వేధింపు, హత్యాయత్నం చేశాడన్న కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్షతోపాటు రూ.1000 జరిమానా విధిస్తూ నెల్లూరు పోక్సో కోర్టు స్పెషల్ జడ్జి సిరిపిరెడ్డి సుమ శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు... వింజమూరు మండలం వెంకటాద్రిపాళెంకు చెందిన ఓ బాలిక 2013 మే 6వ తేదీన కాలకృత్యాలు తీర్చుకునేందుకు చిల్లచెట్ల మధ్యకు వెళ్లగా అదేగ్రామానికి చెందిన ఆర్.కృష్ణ ఆమెపై లైంగిక దాడికి పాల్పడేందుకు ప్రయత్నించగా అందుకు ఆమె వ్యతిరేకించడంతో ఆమెను లాక్కునిపోయి పక్కనే ఉన్న బావిలో తోసివేసి హత్యాయత్నానికి పాల్పడ్డాడని పోలీసులకు ఫిర్యాదు అందింది. ఈ మేరకు వింజమూరు పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విచారణలో అతనిపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డి.చంద్రశేఖర్ వాదించారు.

పెన్నా ప్యాకేజీలో ఎన్నెన్నో సిత్రాలు!

- ప్రీక్లోజ్ అయ్యాక పార్ట్ బిల్లుకు విజ్ఞప్తి
- ఆ తర్వాత అదే పేరుతో మళ్లీ ఫైనల్ బిల్లుకు క్యూసీసీ
- ఏడాది తర్వాత మళ్లీ కొట్టేసి రూ.4 కోట్లు పెంపు
- బిల్లు కోసం కోర్టుకెక్కిన కాంట్రాక్టర్
- విజిలెన్స్‌కు ఫిర్యాదు చేసిన రూరల్ ఎమ్మెల్యే

నెల్లూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : బయట వారెవరికీ టెక్నికల్ సబ్జెక్ట్ అర్థం కాదులే అన్న ధైర్యమో.. లేక మళ్లీ వచ్చేది వైసీపీ ప్రభుత్వమే కదా, మనల్ని అడిగేదెవరులే అన్న బరితెగింపో తెలియదు కానీ పెన్నా డెల్టా ఆధునికీకరణ పనుల ప్యాకేజీ-1 బిల్లుల్లో అనేక మాయలు చేశారు. ఒకసారి ఫైనల్ బిల్లుకు ఇచ్చిన క్వాలిటీ కంట్రోల్ సర్టిఫికెట్‌లో ఏడాది తర్వాత కొట్టివేసి రూ.4.12 కోట్లు మొత్తం పెంచడమే పెద్ద తప్పుగా ఇప్పటి వరకూ బయటపడింది. అయితే ప్రభుత్వం వర్కును ప్రీక్లోజ్ చేశాక పార్ట్ బిల్లు పేరుతో మరో రిక్విజిషన్ పంపి క్యూసీ సర్టిఫికెట్ పొందారు. దీని విలువ రూ.4.40 కోట్లుగా ఉంది. ప్రభుత్వం ప్రీక్లోజ్ చేస్తూ జీవో ఇచ్చిన ఐదు రోజులకే ఈ తంతు జరగడం గమనార్హం. అదే సమయంలో ప్రీక్లోజ్ అయిపోయి బిల్లులు రికార్డు జరిగిపోయాక తిరుపతి చీఫ్ ఇంజనీర్ రివైజ్ ఎస్టిమేషన్‌కు అనుమతి ఇచ్చినట్లు కూడా బిల్లుల్లో చూపిస్తూ మరికొంత మొత్తాన్ని పెంచారు. ఇటువంటి అనేక సిత్రాలు తాజాగా వెలుగులోకి వచ్చాయి.



రూ.14.67 కోట్లను రూ.18.79 కోట్లుగా దిద్దిన క్యూసీ సర్టిఫికెట్

ఎవరి కోసం చేశారు..?

ప్రీక్లోజ్ అంటే కాంట్రాక్టర్ ఇక తాను పని చేయలేనని ప్రభుత్వానికి లేఖ రాసి అనుమతి తెచ్చుకోవడం. ఒక్కసారి వర్కు ప్రీక్లోజ్‌కు ప్రతిపాదించాక ఇక ఆ తర్వాత ఒక్క రూపాయి పని కూడా చేసేందుకు వీల్లేదు. ప్రీక్లోజ్ సమయంలోనే ఆ వర్కు ఎంత వర కూ జరిగిందన్న పూర్తి వివరాలను ప్రభుత్వానికి అందజేస్తారు. ఆ తర్వాతనే ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది. 2020 జూలై 8వ తేదీన ప్యాకేజీ-1 వర్కును ప్రీక్లోజ్ చేస్తూ ప్రభుత్వం జీవో ఇచ్చింది. అయితే ఆ వెంటనే ఐదు రోజులకే అంటే జూలై 13న నెల్లూరు సెంట్రల్ డివిజన్ నుంచి క్వాలిటీ కంట్రోల్‌కు 48వ బిల్లుకు సర్టిఫికెట్ ఇవ్వాలం టూ రిక్విజిషన్ అందింది. అసలు ప్రీక్లోజ్ చేశాక పార్ట్ బిల్లుకు ఎందుకు రిక్విజిషన్ పంపారన్నది ఇక్కడ తేలాల్సిన విషయం. ఇది అటుంచితే సెంట్రల్ డివిజన్ నుంచి రిక్విజిషన్ అందిన మూడు రోజులకే అంటే జూలై 16నే 48వ బిల్లుకు రూ.4.40 కోట్లతో క్యూసీ సర్టిఫికెట్ జారీ అయ్యింది. అంటే రెండు రోజుల్లోనే క్యూసీ అధికారులు అన్ని కోట్ల విలువైన పనులను పరిశీలించి, ల్యాబ్ టెస్ట్‌లను పరీక్షించి సర్టిఫికెట్ ఇచ్చార న్నమాట..! ఇదంతా ఒక ఎత్తయితే మళ్లీ 2021 ఫిబ్రవరి 27న సెంట్రల్ డివిజన్ నుంచి 48వ బిల్లు, ఫైనల్ బిల్లుకు సర్టిఫికెట్ ఇవ్వాలంటూ క్యూసీకి రిక్విజిషన్ వెళ్లింది. దీనికి అదే ఏడాది మే 1న రూ.14.67 కోట్లకు క్యూసీ సర్టిఫికెట్ జారీ అయ్యింది. అంటే ముందుగా 48వ బిల్లు పేరుతో రూ.4.40 కోట్లకు క్యూసీ సర్టిఫికెట్ ఇష్యూ చేసి, మళ్లీ ఆరు నెలల తర్వాత 48వ బిల్లు, ఫైనల్ బిల్లు అంటూ రూ.14.67 కోట్లకు మరో సర్టిఫికెట్ ఇష్యూ చేశారు. దీని వెనుక మతలబు ఏంటన్నది ఇరిగేషన్ ఉన్నతాధికారులే తేల్చాలి. ఇక ఏడాది తర్వాత అంటే 2022 జూన్ 20వ తేదీన క్యూసీ సర్టిఫికెట్‌లో రూ.14.67 కోట్లను కొట్టేసి దానిని రూ.18.79 కోట్లుగా దిద్దారు. అయితే ఇన్ని అవకతవకలు జరిగాక చివరగా 2022 ఆగస్టు 11న ప్యాకేజీ-1 వర్కుకు తిరుపతి సీఈ రివైజ్డ్ ఎస్టిమేషన్‌కు అనుమతి ఇచ్చినట్లు రికార్డుల్లో చూపిస్తుండడం గమనార్హం. ఇవన్నీ ఎవరి కోసం చేశారన్న ప్రశ్న ఉత్పన్న మవుతోంది. అప్పట్లో వైసీపీ ప్రజాప్రతినిధిగా కీలక స్థానంలో ఉన్న వ్యక్తి కాంట్రాక్టర్ కావడంతో ఆయన ఒత్తిడితో ఇదంతా చేశారా..? లేక మరేదైనా ఆశించి చేశారా..? అన్నది తేలాల్సి ఉంది.

● **వారు కోర్టుకు.. వీరు విజిలెన్స్‌కు..!**

ప్రభుత్వం మారగానే ప్యాకేజీ-1 బిల్లును గతేడాది ఇరిగేషన్ అధికారులే భయపడి వెనక్కు తెప్పించారు. అయితే ఇప్పుడు సదరు వైసీపీ నేత, కాంట్రాక్టర్ ఈ బిల్లు కోసం కోర్టుకెళ్లినట్లు తెలుస్తోంది. ఇరిగేషన్ అధికారులు కూడా తమకేమీ తెలియదన్నట్లు వ్యవహరిస్తుండడం విమర్శలకు తావిస్తోంది. ఇంత పెద్ద ఎత్తున అవకతవకలు బయటపడితే ఇరిగేషన్ ఉన్నతాధికారులు మౌనం దాల్చడంపై కూడా అనేక అను మానాలు వ్యక్తమవుతున్నాయి. కనీసం ఏం జరిగిందో తెలుసుకునే ప్రయత్నం కూడా చేయడం లేదని ఆ శాఖ వర్గాలు చర్చించుకుంటున్నాయి. కాగా, పెన్నా డెల్టా ఆధునికీకరణ పనుల ప్యాకేజీ-1లో జరిగిన అక్రమాలపై రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి విజిలెన్స్‌కు ఫిర్యాదు చేశారు. పూర్తి విచారణ జరిపి ప్రజాధనాన్ని కాపాడాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై నెల్లూరు సెంట్రల్ డివిజన్ ఈఈ నాగరాజును వివరణ కోరగా.. తాము క్యూసీ సర్టిఫికెట్ జారీ చేశాక వర్క్‌స్లిప్ అప్రూవల్ అయ్యిందని, అందుకోసమే సర్టిఫికెట్‌లో కరెక్షన్స్ చేశామని చెప్పుకొచ్చారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	104
స్కిన్ చికెన్	192
స్కిన్‌లెస్	212
కోడిగుడ్ల ధర (100): 425	




24న శ్రీనివాస కల్యాణోత్సవం

కావలి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి సరస్వతి బాలస్వామిజీతో ఈ నెల 24వ తేదీ సాయంత్రం స్థానిక బృందావన హౌసింగ్ కాలనీ కల్యాణ మండపంలో శ్రీనివాస కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు మండల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు తటవర్తి రమేష్ తెలిపారు. శుక్రవారం సంఘం కార్యాలయంలో నేతలతో కలిసి రమేష్ కల్యాణమహోత్సవ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. పట్టణ ప్రజలు స్వామి వారి భక్తులు మహోత్సవంలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ తటవర్తి వాసు, సంఘం నేతలు ఓరుగంటి రామక్రిష్ణ, మొగళ్లపల్లి రాజా, కంచర్ల కల్యాణ చక్రవర్తి, ఓరుగంటి సురేష్ పాల్గొన్నారు.

మాకొద్దీ నగర పంచాయతీ?

- ఎన్నికల హామీ ఏమైందని ప్రశ్నిస్తున్న జనం
- పంచాయతీగా మార్పునకు ఎదురుచూపు
- పన్నులు వసూళ్లు కాక మల్లగుల్లాలు పడుతున్న అధికారులు

అల్లూరు, మార్చి 21: తాను ఎన్నికల్లో గెలిస్తే నగర పంచాయతీని రద్దుపరచి పంచాయతీగా మార్చు చేస్తామని కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి ఇచ్చిన హామీ ఏమైందంటూ నగర పంచాయతీ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇష్టంలేని కాపురం చేసినట్టు అటు అధికారులు, ఇటు ప్రజలు నగర పంచాయతీపై అంతగా ఆసక్తి కనపరచడం లేదు. అల్లూరు, నార్తుమోపూరు, సింగపేటలను కలుపుతూ వైసీపీ పాలనలోని నాయకులు 2020లో అల్లూరును నగర పంచాయతీగా చేసి చైర్మన్ పదవి గద్దెనెక్కి పెత్తనం చలాయించాలనుకున్నారు. ఈ క్రమంలో గవర్నర్ ఆర్డినెన్స్‌ను తీసుకొచ్చారు. కానీ నార్తుమోపూరుకు చెందిన టీడీపీ నాయకుడు తమ గ్రామాన్ని పంచాయతీగా మార్పు చేయాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించడంతో ఎన్నికలు జరుపకుండా నిలిపివేసింది. అప్పటి నుండి ఈ మూడు గ్రామాలు అభివృద్ధికి నోచుకోవడం లేదు.



● మంజూరు కాని నిధులు

నగర పంచాయతీ అభివృద్ధిని పాలకులు మరిచారంటూ స్థానికులు మండిపడుతున్నారు. గ్రామ పంచాయతీలుగా కొనసాగి ఉంటే ఆర్థిక నిధులు మంజూరై అభివృద్ధి పనులు జరిగేవని ఇపుడు రెండిండికి చెడ్డ మండలంగా అల్లూరు మారిందని వాపోతున్నారు.

● బకాయిలు చెల్లించని జనం

నగర పంచాయతీలో ఇప్పటివరకు అల్లూరులో రూ2.60కోట్లు పన్నులు చెల్లించాల్సి ఉంది. ప్రజలు అందుకు సమ్మతించక పోవండంతో పారిశుధ్య సిబ్బందికి కూడా జీతాలు ఇచ్చే పరిస్థితి లేని పరిస్థితి ఉంది. నార్తుమోపూరు ప్రజానీకం అసలు తాము పన్నులు కట్టే పరిస్థితే లేదని గ్రామపంచాయతీ మార్పు జరిగితేనే పన్నులు చెల్లిస్తామంటూ అధికారులకు కరాఖండీగా తేల్చి చెబుతున్నారు.

ఇంకెప్పుడు మారుస్తారు



నగర పంచాయతీగా మార్చినప్పటి నుంచి అల్లూరు అభివృద్ధికి ఆమడదూరంలో ఉంది. కనీసం తాగునీటి సమస్యను కూడా తీర్చలేదు. ఎన్నికలు జరిగి టీడీపీ ప్రభుత్వం ఏర్పడితేనైనా మళ్లీ పంచాయతీగా మారుతుందని భావించాం. కానీ ఆ ఊసే కనపడడం లేదు. ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

- దుత్తా శ్రీకాంత్, అల్లూరు

పన్నులు వసూలు కావడం లేదు

నగర పంచాయతీ ప్రజలు పన్నులు చెల్లించడం లేదు. పలుమార్లు టాంటాం వేయించినా ఎవరూ స్పందించడం లేదు. అరకొరగా జరిగే పన్నుల వసూలుతో సిబ్బందికి జీతాలు ఇవ్వడమే సరిపోతుంది. ఇంకా 5 నెలల జీతాలు పెండింగ్‌లో ఉన్నాయి.

- ఉమామహేశ్వరరావు, కమిషనర్, అల్లూరు

ఇకనైనా సోమశిల ఆయకట్టు స్థిరీకరిస్తారా..?

● అసెంబ్లీలో గళమెత్తిన కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి



జలదంకి, మార్చి21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సోమశిల ప్రాజెక్ట్ ఆయకట్టు పరిధిలోని వ్యవసాయభూములు నేడు వ్యవసాయేతర (ల్యాండ్ కన్వర్షన్) భూములుగా మారిపోయాయి అధ్యక్షా అని కావలి ఎమ్మెల్యే కావ్యా క్రిష్ణారెడ్డి బుధవారం శాసనసభలో తన గళం విప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ భూముల్లో పరిశ్రమలు, రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మారిపోయినా ఆ భూములన్నీ సోమశిల జలాశయం ఆయకట్టులో చూపిస్తూ ప్రతిఏడాది సాగునీటి కేటాయింపులు చేస్తున్నారు. ఇకనైనా సోమశిల ఆయకట్టు స్థిరీకరణ చేపట్టి బీడుభూములుగా ఉన్న మెట్ట ప్రాంతం అయిన కావలి, ఉదయగిరి తదితర నియోకవర్గాలకు చెందిన వాటిని ఆయకట్టులో చేర్చి సాగునీటి సౌకర్యం కల్పించి, ఈ ప్రాంత వలసలను నివారించాలని జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడును కోరారు. అసెంబ్లీలో ఎమ్మెల్యే మాట్లాడిన మాటలు రైతుల్లో చర్చనీయాంశంగా మారింది.

మహిళల జోలికెళ్తే ఉపేక్షించొద్దు

● కలిగిరి సీఐ, జలదంకి ఎస్ఐకు ఎమ్మెల్యే కాకర్ల ఆదేశం

జలదంకి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మవారిపాలెం మహిళలపై యువకుడు గొడ్డలితో దాడి చేసిన ఘటనపై ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ శుక్రవారం ఓ ప్రకటనలో తీవ్రంగా స్పందించారు. దాడిచేసిన యువకుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని కలిగిరి సీఐ వెంకటనారాయణ, జలదంకి ఎస్ఐ లతీఫున్నీసాతో మాట్లాడినట్లు పేర్కొన్నారు. ఆడపడుచులు, అక్కాచెల్లమ్మల జోలికి వెళ్తే ఉపేక్షించవద్దని ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు.

ఎన్నాళ్లీ ట్రాఫిక్ కష్టాలు

కలిగిరి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కలిగిరమ్మ కూడలి ప్రాంతం ఉదయం, సాయంత్రం వేళలో రద్దీ ఎక్కువగా ఉంటుంది. వాణిజ్య సముదాయం కావడంతో పలు రకాల దుకాణాదారులు రోడ్డుపైకి చొచ్చుకురావడంతో ప్రధాన రహదారి కుచించుకుపోయింది. దీనికితోడు ఆటోవాలాలు రోడ్డుపైనే నిలిపి ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు. క్రమబద్ధీకరించాల్సిన సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



న్యూస్ బాక్స్

క్రమబద్ధీకరణ చార్జీలపై 50 శాతం రాయితీ

కొండాపురం, మార్చి21 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ అధికలోడు వాడకంపై క్రమబద్ధీకరణ చార్జీలపై వినియోగదారులకు ప్రభుత్వం 50శాతం రాయితీ కల్పించిందని శ్రువారం ఇన్‌చార్జి ఏఈ దినేష్‌కుమార్ తెలిపారు. కిలోవాట్ ప్రస్తుతం రూ.2,250 చెల్లిస్తుండగా రాయితీతో కేవలం రూ.1,250 చెల్లించవచ్చన్నారు. అలాగే 2కిలోవాట్లకు రూ.4,450లో రూ.2,450, 3కిలోవాట్లకు రూ.6,650లో రూ.3,650, 4కిలోవాట్లకు రూ.8,850లకు రూ.4,850, 5కిలోవాట్లకు రూ.11,050 ఉండగా తగ్గింపుతో రూ.6,050 చెల్లించాల్సి ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

పట్టపగలే ఇంట్లో చోరీ

కొండాపురం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): గుడవళ్లూరులోని చిమ్మిలి మహేష్ ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు శుక్రవారం పట్టపగలే చోరీకి పాల్పడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మధ్యాహ్న సమయంలో ఇంటి తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లి అలమారల్లో ఉన్న దుస్తాలను చిందరవందరగా పారవేశారు. అక్కడున్న రూ.3వేలను అపహరించారు. ఈ విషయమై ఎస్ఐ ఎమ్ వెంకటరావును వివరణ కోరగా స్థానికుల సమాచారం మేరకు సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తామన్నారు.

ఇఫ్తార్ విందు

కావలిటౌన్, మార్చి21 (ఆంధ్రజ్యోతి) మాజీ కౌన్సిలర్ టీడీపీ లీగల్‌సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు గుంటుపల్లి రాజ్‌కుమార్ చౌదరి మాజీ ఐసీడీఎస్ రీజనల్ చైర్‌పర్సన్ శ్రీదేవి దంపతులు శుక్రవారం ముసునూరు రాఘవేంద్ర కాలనీలోని మసీదులో ఉపవాస దీక్షాధారులకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఉపవాస దీక్షలు పాటించి వారి వారి శక్తిమేరకు దానధర్మాలు చేయడం మంచి సేవా కార్యక్రమమని వారు ఇఫ్తార్ విందు స్వీకరించడం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు.

లింగసముద్రం ఎస్సైగా నారాయణ

లింగసముద్రం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీ లింగసముద్రం ఎస్సైగా ఎం నారాయణను నియమించారు. ఇక్కడ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న ఎస్సై షేక్ మహబూబ్ సుభానీని బదిలీ చేశారు. దీంతో ఎస్సైగా నియమితులైన నారాయణ శుక్రవారం ఉదయం విధుల్లో చేరారు.

పదో తరగతి పరీక్షా కేంద్రం తనిఖీ

లింగసముద్రం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): లింగసముద్రంలోని కేఆర్ జడ్పీ హైస్కూల్‌లోని పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని రాష్ట్ర పరిశీలకుడు, జిల్లా అదనపు ప్రత్యేక ప్రాజెక్టు డైరెక్టర్ రవీంద్రనాథ్‌రెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. ఉదయం 9.30 గంటలకు ఇంగ్లీషు పరీక్ష ప్రారంభమైన వెంటనే ఆయన పరీక్ష రాస్తున్న విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన విద్యార్థుల బాతురూంలు, మరుగుదొడ్లను పరిశీలించారు. అలాగే ఇన్విజిలేటర్లకు పలు సూచనలు చేశారు. ఎవరైనా కాపీయింగ్‌కు పాల్పడినా, సహకరించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే పెదపవనిలోని పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని లింగసముద్రం తహసీల్దార్ ఎస్ సీతామహాలక్ష్మి సందర్శించి విద్యార్థులను తనిఖీ చేశారు.

నేటి నుంచి కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

వలేటివారిపాలెం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జమీన్ ఉప్పలపాడు కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో 6వ తరగతి నుంచి ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు శనివారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ప్రత్యేకాధికారిణి గోవర్ధిని తెలిపారు. 6 నుంచి ఇంటర్ మొదటి సంవత్సరం వరకూ 40 సీట్లు ఖాళీలు ఉన్నాయని, ఈ అవకాశాన్ని అర్హత కలిగిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గోవర్ధిని తెలియజేశారు.

వాహనాలకు తుప్పు



వలేటివారిపాలెం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పోలీసులు తనిఖీల్లో స్వాధీనం చేసుకున్న కార్లు, ద్విచక్ర వాహనాలు ఆటోలు పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఏళ్ల తరబడి ఉండడంతో తుప్పుపట్టిపోతున్నాయి. వాహనాలను వేలం వేసినా కనీసం ప్రభుత్వానికి ఆదాయం అయినా సమకూరుతుందని పలువురు పేర్కొంటున్నారు. పోలీస్‌స్టేషన్ బయట వాహనాలు ఉండడంతో గుర్తుతెలియని దుండగులు విడి భాబాగాలను తీసుకెళ్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సీజ్ చేసిన వాహనాలు ఎందుకు పనికిరాకుండా పోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాహనాలను వేలం వేస్తే ప్రభుత్వానికి ఆదాయం చేకూరుతుందని ప్రజలు పేర్కొంటున్నారు.

92 మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

కావలి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం సాయంత్ర జరిగిన కార్యక్రమంలో కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి 92మంది లబ్ధిదారులకు రూ.80.80లక్షల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 487మంది సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకుంటే వారిలో 327మంది ఆర్థికసాయం అందినట్లు చెప్పారు. రాజకీయాలు, కులమతాలకఅతీతంగా దళారులు లేకుండా అర్హులకు న్యాయం చేశామన్నారు.

కాగా, రైతులు పండించిన ధాన్యంకు గిట్టుబాటు ధర కల్పించేందుకు స్థానిక టీడీపీ కార్యాలయంలో ఒక సెల్ ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఇప్పటివరకు నియోజకవర్గంలో 51 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ-క్రాప్ నమోదులో కొన్ని ఇబ్బందులు రావటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని అధికారులతో మాట్లాడి ఆ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు గుత్తికొండ కిషోర్, మలిశెట్టి వెంకటేశ్వర్లు, పమిడి రవికుమార్ చౌదరి, మాలేపాటి నాగేశ్వరరావు, జ్యోతి బాబూరావు , పోట్లూరు శ్రీనివాసులు, తటవర్తి వాసు, తిరువీధిప్రసాద్, మొగిలి కల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారుడికి సీఎం సహాయనిధి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి, టీడీపీ నేతలు

క్షయ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

కావలిటౌన్, మార్చి21 (ఆంధ్రజ్యోతి): క్షయవ్యాధిపై ప్రజలు అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు మేఘనాథ్, మహేష్‌లు తెలిపారు. శుక్రవారం స్థానిక రాజీవ్‌నగర్ పట్టణ ఆరోగ్య కేంద్ర, వెంగళరావునగర్ పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఈవ్యాధి పట్ల అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించా రు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రెండు వారాలు తగ్గకుండా దగ్గు వస్తుండడం, గళ్ల పడడం, తరచూ జ్వరం రావడం, బరువు క్షీణించడం లాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ప్రభుత్వ వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలన్నారు. వ్యాధి నిర్ధారణ అయితే మందులతో పాటు ప్రధానమంత్రి టీబి ముక్త్ భారత్ పథకంలో భాగంగా వ్యాధిగ్రస్తులకు పప్పుదినుసులు, ప్రతి నెలా రూ.1000ల నగదును బ్యాంక్ ఖాతాలో జమ చేస్తారన్నారు. కార్యక్రమంలో సిబ్బంది కృష్ణయ్య, ఆసిఫ్‌షరీఫ్, శివప్రసాద్, ప్రసన్న పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది

మర్రిచెట్టు కాలనీలో అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

● హర్షం వ్యక్తంచేస్తున్న కాలనీ వాసులు

కావలి రూరల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక ముసునూరులోని మర్రిచెట్టు కాలనీలో స్థానికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన అదనపు ట్రాన్స్‌ఫారంను శుక్రవారం విద్యుత్ శాఖ రూరల్ ఏఈ శ్రీనివాసులు రెడ్డి స్థానిక నేతలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక టీడీపీ నాయకులు మాట్లాడారు. కాలనీలోని గిరిజనులు, గిరిజనేతరులు విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులతో గత కొన్ని సంవత్సరాలుగా ఇబ్బందులు పడుతున్నట్లు ఈ విషయాన్ని ఎమ్మెల్యే కావ్యక్రిష్ణారెడ్డి దృష్టికి తీసుకెళ్లామ న్నారు. ఆయన స్పందించి రూ.10లక్షల వ్యయంతో అదనపు ట్రాన్స్‌ఫారం ఏర్పాటు చే యించి సమస్య పరిష్కరించినట్లు తెలిపారు. మా కాలనీలో విద్యుత్ వోల్టేజీతో గృహోప కరణాలు సైతం కాలి పోతుండటంతో తీవ్ర ఇబ్బందలు పడుతున్నట్లు చెప్పారు. ఈ విషయాన్ని గత వైసీపీ ప్రభుత్వంలో నేతల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదన్నారు. ఎమ్మెల్యే కావ్యక్రిష్ణారెడ్డి స్పందించి చర్యలు తీసుకోవడంతో ఆయనకు రుణపడి ఉంటా మంటూ స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్రావ్, లింగం మాళి, కాలనీవాసులు పాల్గొన్నారు.



అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభిస్తున్న విద్యుత్ శాఖ ఏఈ తదితరులు

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

వలేటివారిపాలెం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : స్థానిక వెలుగు కార్యాలయంలో శుక్రవారం భారతీయ రిజర్వు బ్యాంక్, స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీడీఓ నరేంద్రదేవ్ హాజరై మాట్లాడుతూ ప్రతిఒక్కరూ బ్యాంక్ సేవలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ మల్లిఖార్జునరావు, ఏపీజీవీ రిటైర్డు మేనేజర్ సూర్యప్రకాష్, వెలుగు సీసీలు తిరుమల, మేరి, కుమారి డ్వాక్రా మహిళలు, ఫీల్డ్‌అసిస్టెంట్‌లు, రైతులు పాల్గొన్నారు.



ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో నరేంద్రదేవ్



విష ప్రయోగంతో మూగ జీవాలు మృత్యువాత

ఉలవపాడు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): విష ప్రయోగంతో మూగ జీవాలు మృత్యువాత పడిన సంఘటన శుక్రవారం జరిగింది. ఎస్సై అంకమ్మ తెలిపిన వివరాల వేరకు... కరేడు గ్రామానికి చెందిన వాకా శ్రీనివాసులు గొర్రెలను మేపుతుంటాడు. స్థానిక గొర్రెల దొడ్డిలోని నీళ్ల తొట్టిలో రోజు మాదిరిగానే మూగ జీవాలకు నీళ్లు పెట్టగా తాగిన వెంటనే 25 గొర్రెలు మరణించాయి. పరిస్థితిని గమనించిన శ్రీనివాసులు మిగిలిన జీవాలు నీళ్ల తొట్టి వద్దకు వెళ్లకుండా జాగ్రత్త పడ్డాడు. అనంతరం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్సై అంకమ్మ తన సిబ్బందితో సంఘటనా సలానికి చేరుకుని విచారణ చేపట్టారు. తమ్ముడి కుటుంబంతో గత కొంతకాలంగా గొడవలు ఉన్నాయని, దీంతో వారిపై అనుమానం వ్యక్తంచేస్తూ శ్రీనివాసులు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. నీటి తొట్టె నుంచి శాంపిల్ కోసం నీటిని సేకరించి పరీక్షల నిమిత్తం భద్రపరిచినట్లు ఎస్సై తెలి పారు. పశు సంవర్ధక శాఖ ఏడీ సురేష్‌నాయుడు తన సిబ్బందితో మృతి చెందిన జీవాలకు పోస్టుమార్టం నిర్వహించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. సుమారు రూ.2 లక్షల నష్టం జరిగిందని ఇన్సురెన్స్ కూడా లేదని బాధిత కుటుంబం వాపోతోంది.



మూగ జీవాల కళేబరాలు

ప్రాణాలు తీస్తున్న హైవే జంక్షన్లు

● రోడ్డు నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనదారులు

వలేటివారిపాలెం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా శింగరాయికొండ నుంచి నెల్లూరు జిల్లా మాలకొండ వరకూ ఇటీవల నూతనంగా నిర్మించిన జాతీయ రహదారిపై పలు జంక్షన్‌లు ప్రమాదాలకు నిలయంగా మారాయి. స్టాపర్ బోర్డులు లేకపోవడం, బ్లింకర్లు ఏర్పాటు చేయకపోవడంతో వాహనచోదకులు వేగాన్ని నియంత్రించడంలేదు. దీంతో ఆయా జంక్షన్‌ల వద్ద రోడ్డు దాటుతున్న పాదచారులు, వాహనచోదకులు తరచుగా ప్రమాదాలకు గురవుతున్నారు. కందుకూరు నుంచి మాలకొండ వరకూ ఈ ఆరు నెలల వ్యవధిలో సుమారు 10 యాక్సిండెంట్లు జరిగాయి. అందులో ఆరుగురు దుర్మరణం చెందారు. 10 మందికి పైగా క్షతగాత్రులయ్యారు. పోకూరు సమీపం లో ఇద్దరు, వలేటివారిపాలెం కాకర్లవా రిపాలెం గ్రామాల మధ్య హైవేలో ఇద్దరు, అయ్యవారిపల్లె గ్రామంలోని జంక్షన్ వద్ద ఇద్దరు మృతి చెందారు. 10 మందికి పైగానే క్షతగాత్రులయ్యారు. ప్రతిరోజూ స్థానిక పోలీసులు వాహనచోదకులకు రోడ్డు నిబంధనల పై అవగాహన కల్పిస్తున్నారు. నిబంధ నలను ఉల్లఘించిన వారిపై చర్యలు చేపడుతున్నారు. అయినప్పటికీ వాహనచోదకులు వేగంగా వెళ్తూ ప్రమాదాలకు గురై మృతిచెందుతున్నారు.



పోకూరు వద్ద హైవేపై జరిగిన పమాదంలో మృతిచెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి దినేష్ (ఫైల్)

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు విచారణ

గుడ్లూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని స్వర్ణాజిపురం ఎస్సీ కాలనీకి చెందిన ఎండ్లూరి బాలసుందరం అదే గ్రామానికి చెందిన ఓ బీసీ సంఘ నాయకుడిపై ఇటీవల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కందుకూరు డీఎస్పీ బాలసుబ్రమణ్యం శుక్రవారం విచారణ జరిపారు. కేసుకు సంబంధించి వివరాలు తెలుసుకునేందుకు డీఎస్పీ స్వర్ణాజిపురం చేరుకొని అక్కడ కొందరిని విచారించారు. మరిన్ని వివరాలు సేకరించిన అనంతరం మీడియాకు వివరాలు తెలియజేస్తామని ఈ సందర్భంగా పోలీసులు తెలియజేశారు.

నేటి నుంచి ఉపాధి పనుల తనిఖీ

ఉలవపాడు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఉపాధి పనుల ఆడిట్ శనివారం నుంచి గ్రామాల్లో ప్రారంభించనున్నట్లు ఏపీవో అబ్దుల్లా తెలిపారు. మండలానికి విచ్చేసిన సామాజిక బృందం సభ్యులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టీఏలతో శుక్రవారం సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేసినట్లు చెప్పారు. మండలంలో 12 గ్రామ పంచాయతీల్లో గత ఏడాది జరిగిన ఉపాధి పనులకు సంబంధించిన రికార్డులు ఆడిట్ బృందం సభ్యులకు అందచేశామన్నారు. ఎస్ఆర్‌డీఎస్ నిబంధనల ప్రకారం గ్రామాల్లో ప్రజా వేదికలు నిర్వహించి ఆడిట్ జరపాలని లోపభూయిష్టంగా నివేదికలు సమర్పించినట్లు ఫిర్యాదులు అందితే ఆడిట్ సభ్యులపై చర్యలు తీసుకుంటామని ఈసందర్భంగా అధికారులు హెచ్చరించారు. ఈనెలాఖరుకి సామాజిక తనిఖీ పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో బహిరంగ ప్రజా వేదిక నిర్వహించి గ్రామాల వారీగా నివేదికను సమర్పించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కందుకూరు ఏపీడీ బాబురావు, ఎంపీడీవో విజయ, ఎస్ఆర్‌పీ నీలకంఠం, టెక్నికల్ అసిస్టెంట్లు, ఎఫ్ఏలు, తనిఖీ బృందం సభ్యులు పాల్గొన్నారు.



సామాజిక తనిఖీ బృందం సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఆర్‌పీ నీలకంఠం

ఎమ్మెల్యే ఇంటూరికి సత్కారం

కందుకూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణకు రాష్ట్రప్రభుత్వం చర్యలు తీసుకుంటుండటాన్ని హర్షిస్తూ మాదిగ సామాజికవర్గ నేతలు శుక్రవారం కందుకూరులో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును సత్కరించారు. రాష్ట్ర శాసనసభ, శాసనమండలిలో వర్గీకరణకు అనుకూలంగా ఏకగ్రీవంగా తీర్మానం చేసే కార్యక్రమంలో సహకారం అందించినందుకు ఎమ్మెల్యేను సత్కరిస్తున్నట్లు మాదిగ నేతలు తెలిపారు. కార్యక్రమంలో గోచిపాతల మోషే, రాయపాటి శ్రీనివాసరావు, చదలవాడ కొండయ్య, రెబ్బవరపు మాల్యాద్రి, బద్ధిపూడి శిఖామణి, తాటిపర్తి రామకృష్ణ, దువ్వూరి రమేష్‌చంద్ర, గడ్డం నవీన్, గొడపేరు ప్రసాదరావు, జడ రవీంద్రబాబు, ఎండ్లూరి పుల్లయ్య, మందా పరిశుద్ధరావు, ఉచ్చులూరి నిరంజన్, ఉచ్చు లూరి సుబ్బారావు, బొక్కా మాధవరావు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే నాగేశ్వరరావును సత్కరిస్తున్న మాదిగ సామాజికవర్గ నాయకులు

ఘనంగా గ్రామదేవతలకు పూజలు

కందుకూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): కందుకూరులో గ్రామదేవతలు పోలేరమ్మ, మహాలక్ష్మమ్మలకు శుక్రవారం ఘనంగా పూజలు నిర్వహించారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల ప్రజలు కుటుంబసమేతంగా తరలివచ్చి అమ్మవార్లకు చద్దులు సమర్పించి పూజలు చేశారు. ధర్మకర్త దివి లింగయ్యానాయుడు మాట్లాడుతూ ఆదివారం అంకమ్మకు జరిగే పాలపొంగళ్ల కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలని కోరారు.



ఘాట్ ఏదీ?

● స్వర్ణాల తీరాన్ని కమ్మేసిన గుర్రపు డెక్కాకు

నెల్లూరులోని బారాషహీద్ దర్గా వెనుక స్వర్ణాల చెరువులో ప్రస్తుతం ఘాట్ కనిపించడం లేదు. మెట్లతో సహా ఘాట్ మొత్తాన్ని గుర్రపు డెక్కాకు కమ్మేసింది. చూడటానికి పచ్చగా అందంగా కనిపిస్తున్నప్పటికీ చెరువు నీరు రంగుమారి కలుషితమైంది. అంతేకాదు, రూ.కోట్లు ఖర్చు పెట్టి ప్రజలకు ఆహ్లాదాన్ని ఇచ్చేందుకు స్వర్ణాల ఘాట్ ముందు గ్రీనరీ ఏర్పాటు చేశారు. దానిని సక్రమంగా నిర్వహించడంలో నగర పాలక సంస్థ నిర్లక్ష్యం కారణంగా ఘాట్ పరిసరాలు అధ్వానంగా మారాయి. దీనికితోడు ఆ ప్రాంతమంతా వ్యర్థాలతో నిండి చెత్తకుండీలా మారి దుర్వాసన వ్యాపిస్తోంది. పాలకులు, అధికారులు స్పందించి ఘాట్‌ను ఆహ్లాదకరంగా మారిస్తే ఈ వేసవిలో సాయంత్రం వేళ నగర వాసులు సేదతీరేందుకు అనువుగా ఉంటుంది.

- నెల్లూరు (సాంస్కృతికం,ఆంధ్రజ్యోతి)

రాజరాజేశ్వరి ఆలయంలో
ఆవు నెయ్యి పథకానికి రూ.1,00,116 విరాళం

నెల్లూరు (సాంస్కృతికం) మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని రాజరాజేశ్వరి ఆలయంలో అమ్మవారి దీపానికి ఆవు నెయ్యి విరాళ పథకం ప్రారంభించారు. దీనికి భక్తుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. శుక్రవారం వేమసాని సూర్య నారాయణ, గిరిజావతి, గౌతమ్‌కుమార్ కుటుంబం రూ.1,00,116 విరాళం అందజేసింది. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్, ఆలయ ఈవో కోవూరు జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ భక్తులు ఆలయంలో దీపారాధనకు ఆవు నెయ్యి విరాళంగా ఇవ్వొచ్చన్నారు. ఒకరోజుకి రూ.2వేలు (3 లీటర్లు) చొప్పున, ఒకరోజు శాశ్వత చందాగా రూ.30వేలు చెల్లించవచ్చునని తెలిపారు. ఒకనెలకు రూ.60వేలు విరాళంగా ఇవ్వవచ్చన్నారు. దాతల పేరున గోత్రనామాలతో ఖడ్గమాల పూజ చేస్తారని చెప్పారు.

నేటినుంచి జాతీయస్థాయి ఇన్విటేషన్ టెన్నిస్ టోర్నీ

కావలి టౌన్, మార్చి21 (ఆంధ్రజ్యోతి): అఫీషియల్ క్లబ్, కావలి టెన్నిస్ అసోసియేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో కావలిలో శనివారం నుంచి డాక్టర్ సీఎల్ఎన్ రెడ్డి, సుజనమ్మ ట్రస్ట్ జాతీయ స్థాయి ఇన్విటేషన్ డబుల్స్ టెన్నిస్ టోర్నీ నిర్వహించనున్నట్లు శుక్రవారం అఫీషియల్ క్లబ్‌లో టోర్నీ ఆర్గనైజింగ్ కమిటీ అధ్యక్షుడు అనుమలశెట్టి రామకృష్ణ, కార్యదర్శి వంశీమోహన్ తెలిపారు. ఈ నెల 22, 23 తేదీల్లో జరుగనున్న పోటీల్లో జాతీయస్థాయిలో వివిధ రాష్ట్రాల నుంచి దాదాపు 70జట్ల వరకు ఈ టోర్నీలో పాల్గొంటాయని చెప్పారు. పట్టణంలోని అఫీషియల్ క్లబ్ కోర్టు, జేబీ కళాశాలలోని టెన్నిస్ కోర్టు, తుమ్మల పెంట రోడ్డు వద్దనున్న ఎస్ఆర్ క్లబ్ కోర్టులలో ఈ పోటీలో 40ప్లస్, 50ప్లస్, 60ప్లస్, 70ప్లస్ నాలుగు విభాగాల ఏజ్ గ్రూపులు తలపడతాయన్నారు. కావలి రోటరీక్లబ్ వ్యవస్థాపకులు ప్రముఖ సీనియర్ టెన్నిస్ క్రీడాకారుడు, విశ్రాంత జిల్లా వైద్యాధికారి డాక్టర్ లక్ష్మీనరసారెడ్డి సహాయ సహకారాలతో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

28,122 టన్నుల ధాన్యం కొనుగోలు

నెల్లూరు (హరనాథపురం), మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 28122 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు జేసీ కార్తీక్ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం 3306 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, 24 నుంచి 48 గంటల్లోగా రైతుల ఖాతాలకు నగదు జమ చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు రూ.60.36కోట్లు రైతులకు చెల్లించినట్లు పేర్కొన్నారు. దళారుల మాటలు విని తక్కువ ధరకు అమ్ముకోవద్దని రైతులను కోరారు.

రేపు దస్తావేజు లేఖర్ల సంఘం సమావేశం

నెల్లూరు(హరనాథపురం), మార్చి 21(ఆంధ్రజ్యోతి): జిల్లా దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘం సమావేశం ఆదివారం ఉదయం 10 గంటలకు నగరంలోని మహేశ్వరి పరమేశ్వరి కల్యాణ మండపంలో జరుగుతుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పట్నం దుర్గేష్ బాబు ఓ ప్రకటనలో తెలిపారు. డాక్యుమెంట్స్ రిజిస్ట్రేషన్ ప్రక్రియలో సాంకేతిక సమస్యల వల్ల రైటర్స్ ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చిస్తామని పేర్కొన్నారు. దస్తావేజు లేఖరులు, స్టాంప్ వెండర్లు తప్పక హాజరుకావాలని కోరారు.

ఓపెన్ బెట్టింగ్.. యువతే టార్గెట్!

- మొదలైన ఐపీఎల్ కొత్త సీజన్
- క్రికెట్ బెట్టింగ్ కోసం ప్రత్యేక యాప్‌లు
- లావాదేవీలన్నీ ఆన్‌లైన్‌లోనే...
- ఈజీ మనీ కోసం బానిసలవుతున్న యూత్
- అధిక వడ్డీలు, తనఖా, తండల్‌కు అప్పులు
- రోడ్డున పడుతున్న ఎన్నో కుటుంబాలు
- ఆర్థికంగా చితికిపోయి ఆత్మహత్యలు
- తల్లిదండ్రులు గమనిస్తుండాలి
- హెచ్చరిస్తున్న నిపుణులు

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) క్రికెట్ సీజన్ వచ్చిందంటే అభిమానుల సంగతి పక్కనపెడితే బెట్టింగ్ రాయుళ్లు, బెట్టింగ్ మాఫియాలు మాత్రం చెలరేగిపోతుంటాయి. మ్యాచ్ మ్యాచ్‌కు కాదు... బాల్ బాల్‌కి పందెం కట్టి ఓపెన్‌గానే రూ.వేల కోట్లలో వ్యాపారం చేస్తున్నారు. పందెం నడిపేవారు.. పందెం కాసేవారు ఎవరూ ఒకరినొకరు చూసుకునేది లేదు, చేతికి డబ్బులిచ్చేదీ లేదు. అంతా ఆన్‌లైన్‌లోనే!. సులభంగా డబ్బు సంపాదించేందుకు ఎక్కువ మంది యువత ఈ బెట్టింగ్‌కు ఆకర్షితులవుతున్నారు. ముందు ఒకటి.. రెండు సార్లే! అంటూ మొదలుపెట్టి ఆ తర్వాత దానికి బానిసలవుతున్నారు. సంపాదించే సంగతి ఎలా ఉన్నా బెట్టింగ్ మాయలో పడి దాచుకున్న డబ్బులేకాదు... అందిన చోటల్లా అప్పులు చేసి నిండా మునిగిపోతున్నారు. ఉన్నదంతాపోయి రోడ్డున పడేవాళ్లు కొందరైతే, ఆర్థికంగా చితికిపోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్న వారు మరికొందరు. ఏటా ఇలాంటి వార్తలు, సంఘటనలు కళ్లముందే కనబడుతున్నప్పటికీ మళ్లీ.. మళ్లీ ఎంతో మంది ఆ కూపంలో కూరుకుపోతూనే ఉన్నారు. ఈ ఏడాది ఐపీఎల్ కొత్త సీజన్ శుక్రవారం మొదలైంది. సుమారు రెండు నెలలు కొనసాగే ఈ టోర్నమెంటు ఎలాంటి అనుభవాలు మిగులుస్తుందో చూడాలి.



నెల్లూరు(క్రైం), మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఐపీఎల్ క్రికెట్ టోర్నీ మొదలవడంతో జిల్లా వ్యాప్తంగా బెట్టింగ్ బాబులు సిద్ధమయ్యారు. ప్రస్తుతం బెట్టింగ్ కొత్త రంగు పులుముకుంది. గతంలో ఒక ప్రదేశంలో అందరూ చేరి పందెం కాసి డబ్బులు ఇచ్చిపుచ్చుకునే వారు. కొందరు జూదగాళ్లు హోటళ్లలోని గదులను అద్దెకు తీసుకొని ఈ మ్యాచ్‌కు ఇంత... ఈ ఓవర్‌కు ఇన్ని రన్స్, ఈ బాల్‌కు ఇంత స్కోర్ అంటూ నేరుగా నగదు లావాదేవీలు చేసేవారు. కానీ కొన్నేళ్లుగా పరిస్థితి మారిపోయింది. కొందరు జూదగాళ్లు ఇప్పటికీ పాత పద్ధతినే అవలంబిస్తున్నప్పటికీ చాలామటుకు యాప్‌లలోనే అన్నీ నడిచిపోతున్నాయి. టెక్నాలజీ పరుగులు తీస్తుండటంతో క్రికెట్ బెట్టింగ్ కోసం ప్రత్యేకంగా యాప్‌లు అందుబాటులోకి వచ్చాయి. స్మార్ట్ ఫోన్ చేతిలో ఉంటే చాలు, ఎక్కడి నుంచైనా బెట్టింగ్ పెట్టేయొచ్చనే పరిస్థితులు నెలకొన్నాయి.

● యాప్‌లు.. ఫ్యాన్సీలు.. రేటింగ్

బెట్టింగ్ నిర్వహించే వారు యాప్‌ల వివరాలు తెలిపి అడ్వాన్స్‌గా రూ.5వేల నుంచి లక్షలు వరకు వసూలు చేస్తారు. ఆ నగదును ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా పంపాలని నెంబర్లు ఇస్తారు. డబ్బు వారికి చేరాక బెట్టింగ్ కాసుకునే అవకాశం కల్పిస్తారు. మ్యాచ్ ప్రారంభం కాకముందే ఆ రోజు ఆడే టీమ్‌లను బట్టి రేటింగ్ ఇస్తారు. మ్యాచ్ ప్రారంభం నుంచి చివరి వరకు బెట్టింగ్ ఆడే అవకాశం ఉంటుంది. ఇవి కాకుండా ఫ్యాన్సీలని కొన్ని ఉంటాయి. ఒక ఓవర్‌కు ఇన్ని రన్స్ కొట్టలేరు... కొడుతారు!, ఆ బ్యాట్స్‌మెన్ ఇన్ని రన్స్ కొడుతాడు... కొట్టలేడు!, మొదటి 10 ఓవర్లలో ఇంత స్కోర్ చేస్తారు.. చేయలేరు!.. ఇలా ఫ్యాన్సీల పేరుతో కూడా బెట్టింగ్ నిర్వహిస్తున్నారు. కొన్ని యాప్‌లలో అయితే ఎవరు బెట్టింగ్ నడుపుతున్నారు?, ఎవరికి ఆన్‌లైన్‌లో డబ్బులు పంపుతున్నామన్న వివరాలు కూడా తెలియవు. ఈ క్రమంలో ఎన్నో నకిలీ యాప్‌లు, దొంగ బెట్టింగ్ మాఫియాలు కూడా చేతివాటం చూపుతున్నాయి. అలాంటి వారి ఉచ్చులో పడి ఎంతో మంది నష్టపోతున్నారు.

● ఈజీ మనీ కోసమే....

క్రికెట్ బెట్టింగ్‌పై యువతే ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. కాలేజీ కుర్రాళ్లయితే ఈజీ మనీ కోసం మ్యాచ్‌లు, బెట్టింగే జీవితం అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇందుకు అవసరమైన డబ్బు కోసం సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, బంగారు గొలుసులు, బైక్‌లు, కార్లు... ఇలా ఏది అవకాశం ఉంటే దాన్ని తాకట్టు పెట్టేస్తున్నారు. అవీ చాలక వడ్డీలకు, తండలకు అప్పులు తెచ్చి మరీ ఈ ఆన్‌లైన్ జూదం ఆడి చివరికి అన్నీ పోగొట్టుకుంటు న్నారు. కొందరు ఆర్థిక సమస్యల నుంచి బయటపడేందుకు బెట్టింగ్‌లను మార్గంగా ఎంచుకుంటున్నారు. ఇందు కోసం కష్టపడి సంపాదించినదానితోపాటు భార్యాబిడ్డల బంగారం, ఆఖరికి తాళిబొట్టును కూడా తనఖాపెట్టి సర్వం కోల్పోతున్నారు. బెట్టింగ్ ఆడే వారి బలహీనతను అవకాశంగా మలుచుకుని ఈ సీజన్‌లో ఎంతో మంది వడ్డీ వ్యాపారులు పుట్టుకొస్తున్నారు. తక్కువ వడ్డీ ఆశ చూపి వస్తువులను తాకట్టు పెట్టుకుని అప్పులిస్తున్నారు. ఆ తర్వాత భారీ మొత్తంలో వడ్డీలను ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. కొందరైతే అప్పుమొత్తం చెల్లించినా వారి వస్తువులు తిరిగి ఇవ్వకుండా వేధిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. బాధితులు అటు పోలీసులకు ఫిర్యాదు చేయలేక, ఇటు కుటుంబ సభ్యులకు చెప్పుకోలేక సతమతమవుతున్నారు.

● తల్లిదండ్రుల పర్యవేక్షణ అవసరం

బెట్టింగ్ భూతానికి యువత బలికాకుండా తల్లిదండ్రులు నిరంతరం పర్యవేక్షించాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. క్రికెట్ మ్యాచ్ జరుగుతున్న సమయంలో పిల్లలు ఏమి చేస్తున్నారో గమనించాలంటున్నారు. యుక్త వయసులో ఉన్న పిల్లలు క్రికెట్ మ్యాచ్ పూర్తయ్యే వరకు ఇంటికి రాకపోయినా, ఇంట్లోనే మ్యాచ్ చూస్తూ టెన్షన్‌తో అటూ.. ఇటూ తిరుగుతున్నా బెట్టింగ్ పెట్టాడేమోనని అనుమానించాలంటున్నారు. సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, బైక్‌లు కనిపించకుండాపోతే మరింత జాగ్రత్తపడాలని హెచ్చరిస్తున్నారు. బెట్టింగ్ భూతం గురించి అర్థమయ్యేలా వివరించి, అవసరమైతే వైద్యులతో కౌన్సెలింగ్ ఇప్పించి వారిని ఆ వ్యసనం నుంచి బయటపడేయాలని సూచిస్తున్నారు.

27 నుంచి గుంటూరులో సాంకేతిక పరిజ్ఞానంపై సదస్సులు

నెల్లూరు(వ్యవసాయం), మార్చి 21(ఆంధ్రజ్యోతి): చిన్న కమతాల్లో సుస్థిరమైన నికర ఆదాయం పొందగలిగే సాంకేతిక పరిజ్ఞానంపై కేంద్ర వ్యవసాయశాఖ, ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 27 నుంచి గుంటూరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం లాంఫాంలో ప్రాంతీయ వ్యవసాయ ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు నెల్లూరు కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ జి.లలితశివజ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్, కేరళ, కర్ణాటక, పుదుచ్చేరి, లక్షద్వీప్, అండమాన్ రాష్ట్రాల రైతులకు ఉపయోగపడేలా ఈ కార్యక్రమం చేపట్టారని పేర్కొన్నారు. రైతు సదస్సుతోపాటు వ్యవసాయ అనుబంధ శాఖల సాంకేతికను ప్రదర్శించేందుకు దాదాపు 300 స్టాళ్లు ఏర్పాటు చేస్తారని తెలిపారు. 27 నుంచి 29వ తేదీ వరకు జరిగే ఈ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

విద్యుత్ వినియోగదారులకు వాట్సాప్ సేవలు : ఎస్ఈ

నెల్లూరు (జడ్పీ), మార్చి 21 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సేవలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా వాట్సాప్ సేవలు ప్రవేశపెట్టిందని, దీనిని వినియోగదారులంతా సద్వినియోగం చేసుకోవాలని ఆ శాఖ ఎస్ఈ విజయన్ కోరారు. శుక్రవారం విద్యుత్ భవన్‌లో టౌన్, డివిజన్ అధికారులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 10గంటల వరకు పీక్ అవర్స్‌లో సిబ్బందిని సబ్‌స్టేషన్‌లో అందుబాటులో ఉంచాలన్నారు. శనివారం రాత్రి 8.30నుంచి 9.30 వరకు స్వచ్ఛందంగా లైట్లు ఆపి ప్రజలంతా ఎర్త్ అవర్‌ను పాటించాలని కోరారు. ప్రభుత్వ కార్యాలయాలకు విద్యుత్ సర్‌చార్జిని రద్దు చేసినందున బకాయిలను పూర్తిగా వసూలు చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ సిబ్బంది సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా జాగ్రత్త వహించాలన్నారు. అదనపు లోడ్ క్రమబద్ధీకరణకు 50 శాతం రాయితీపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎక్కడైనాలో ఓల్టేజి సమస్య ఉంటే అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను అమర్చాలన్నారు. రెవెన్యూ వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ సమావేశంలో సీనియర్ అకౌంట్ అధికారి మురళి, ఈఈ శ్రీధర్, డిఈఈలు కిరణ్, అశోక్, సునీల్, ఏఈలు పాల్గొన్నారు.

మెట్టలో మాణిక్యం!

తాము ఏదో సాధించాలని అందరూ కలలుకంటారు. కొద్దిమంది మాత్రమే తమ కలలను నిజం చేసుకోవడానికి కృషి చేస్తారు. ఆ కృషి సరిపడేంతలా ఉంటేనే కలలు నెరవేరుతాయి. ఒక రంగంలోనే కాక పలురంగాల్లో తనదైన శైలితో ముందుకెళుతున్న భారత రక్షణ శాఖ శాస్త్రీయ సలహాదారు, డీఆర్డీవో మాజీ చైర్మన్, ఇండియన్ ఏరోనాటికల్ ఇంజనీర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు నెల్లూరు జిల్లాకు చెందిన డాక్టర్ గుండ్రా సతీష్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారుగా నియమితులయ్యారు. దీంతో ఆయన స్వగ్రామం ఆత్మకూరు మండలంలోని మహిమలూరులో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

- ఆత్మకూరు, (ఆంధ్రజ్యోతి)



- ప్రముఖ శాస్త్రవేత్తగా సతీష్‌రెడ్డి రాష్ట్రప్రభుత్వ సలహాదారుగా నియామకం
- స్వగ్రామమైన మహిమలూరులో ఆనందోత్సాహం

మెట్టప్రాంతమైన మహిమలూరు గ్రామంలో గుండ్రా సీతారామిరెడ్డి, రంగమ్మ దంపతుల రెండవ సంతానం సతీష్‌రెడ్డి. ఓ సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన సతీష్‌రెడ్డి ఆత్మవిశ్వాసంతో అడుగులు వేస్తే అద్భుతాలు ఆవిష్కృతమవుతాయని నిజం చేసి చూపారు. మహిమలూరులోని ప్రభుత్వ పాఠశాలలో ఒకటి నుంచి పదవ తరగతి వరకు చదివారు. అనంతరం నెల్లూరులోని వీఆర్ కాలేజీలో ఇంటర్ పూర్తి చేశారు. ఆ తర్వాత అనంతపురం జేఎన్‌టీయులో ఇంజనీరింగ్ చేరి ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ కోర్సును పూర్తి చేశారు. జేఎన్‌టీయూలో ఎంఎస్ పట్టా పుచ్చుకున్న సతీష్‌రెడ్డి 1985కు ముందు మూడు నెలలపాటు ప్రకాశం జిల్లా ఖమ్మం పాలిటెక్నిక్ కాలేజీలో లెక్చరర్‌గా పని చేశారు. 1985లో డీఆర్‌డీవోలో ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. అంచెలంచెలుగా ఎదుగుతూ 2013లో ఆర్‌సీఐ డైరెక్టర్‌గా నియమితులై నేవిగేషన్, ఏవియానిక్స్ పరిజ్ఞానాల్లో నిపుణులుగా రాణించారు. ఆర్‌సీఐ సంచాలకులుగా బాధ్యతలు చేపట్టిన అనంతరం పృథ్వీ, ఆకాశ్, అస్త్ర, బ్రహ్మోస్, ధనుస్, నిర్భయ్, నాగ్, హెలీనా, అగ్ని1, 2, 3, 4, 5, వంటి క్షిపణుల్లోని ముఖ్యవ్యవస్థల అభివృద్ధికి నేతృత్వం వహించిన ఘనత సతీష్ రెడ్డికే దక్కింది. ఉపగ్రహ ఆధారిత దిక్సూచీ గ్రహాలు, హైబ్రిడ్ నేవిగేషన్, తదితర వ్యవస్థల అభివృద్ధిలో తనవంతు ప్రాత పోషించారు.

● అందుకున్న సత్కారాలు

ఈ క్రమంలో సతీష్‌రెడ్డి ప్రతిభను గుర్తించిన ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకమైన ఇండియన్ సైన్సు కాంగ్రెస్ అసోసియేషన్ హోమీ జెబాబా స్మారక అవార్డు, డీఆర్‌డీవో యువశాస్త్రవేత్త పురస్కారంతోపాటు పలు అవార్డులను అందించింది. 2017లో ఉగాదిని పురస్కరించుకుని సైన్సురంగంలో ఏరోస్పేస్ సైంటిస్ట్ డాక్టర్ జి.సతీష్‌రెడ్డి ప్రభుత్వం ప్రకటించిన కళారత్నం పురస్కారం అందుకున్నారు. డీఆర్డీవో చైర్మన్‌గా బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారు. కేంద్రంలో ప్రతిష్ఠాత్మకమైన రక్షణ శాఖ సలహాదారుగా నియమితులయ్యారు. నూతనంగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా బాధ్యతలు చేపట్టనుండటంతో ఆయన స్వగ్రామమైన మహిమలూరులో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి.



డీఎంహెచ్‌వో సుజాతకు వినతిపత్రం ఇస్తున్న ఆశా నాయకులు

ఆశా కార్యకర్తలను రెగ్యులర్ చేయాలి

● డీఎంహెచ్‌వోకు ఆశావర్కర్స్ యూనియన్ వినతి

నెల్లూరు(వైద్యం), మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకు ఆరోగ్యసేవలు అందిస్తున్న ఆశా కార్యకర్తలను రెగ్యులర్ చేయాలని, కనీస వేతనం ఇవ్వాలని ఏపీ ఆశావర్కర్స్ యూనియన్ నేతలు కోరారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాతకు వినతిపత్రం అందజేశారు. అనంతరం యూనియన్ జిల్లా కార్యదర్శి దుగ్గిరాల అన్నపూర్ణమ్మ మాట్లాడుతూ దీర్ఘకాలికంగా పనిచేస్తున్న ఆశా కార్యకర్తలకు కనీస వేతనం రూ.26 వేల ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్‌హెచ్‌ఎం స్కీం ఏర్పడి 20 ఏళ్లు పూర్తయినా వీరికి కనీస వేతనం ఇవ్వకపోవడం సరికాదన్నారు. అనారోగ్యంతో అనేక మంది ఆశాలు చనిపోయారని, ఈ నేపథ్యంలో వారికి గ్రూప్ ఇన్సూరెన్స్ చేయాలని డిమాండ్ చేశారు. ఏడేళ్లలో కేంద్ర ప్రభుత్వం ఆశాలకు కేవలం రూ.1000 మాత్రమే పెంచిందన్నారు. ఆశావర్కర్స్‌ను రెగ్యులర్ చేసి కమ్యూనిటీ వర్కర్లుగా గుర్తించాలని కోరారు. దేశమంతా ఒకే పని విధానం ఉండాలని, పెన్షన్ సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి మధుసూదన, కళ్యాణి, వాణి, జీవా, సునీత, గీత, సురేఖ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలకు 256 మంది గైర్హాజరు

నెల్లూరు(విద్య), మార్చి 21(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో జరుగుతున్న పదో తరగతి పరీక్షల్లో శుక్రవారం ఇంగ్లీష్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. జిల్లా వ్యాప్తంగా 174 కేంద్రాల్లో జనరల్ విద్యార్థులు 28,533 మంది, ప్రైవేట్ విద్యార్థులు 56 మంది కలిపి 28,589 మంది హాజరు కావాల్సి ఉండగా జనరల్ విద్యార్థులు 230, ప్రైవేట్ విద్యార్థులు 26 మందితో కలిపి 256 మంది గైర్హాజరు జనరల్ విద్యార్థులు 28,303, ప్రైవేట్ విద్యార్థులు 30 మంది కలిపి 28,333 మంది హాజరయ్యారు. జిల్లా అబ్జర్వర్ రవీంద్రనాథ్‌రెడ్డి 6, డీఈవో బాలాజీరావు 6, ఫ్లైయింగ్ స్క్వాడ్ 59 కేంద్రాలతో కలిపి 71 పరీక్ష కేంద్రాలను పరిశీలించారు.

అదనపులోడ్‌కు 50శాతం రాయితీ

మనుబోలు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): కేటగిరి-1 గృహ వినియోగదారులకు ప్రభుత్వం అదనపు లోడ్‌పై 50శాతం రాయితీని ప్రకటించినట్లు ట్రాన్స్‌కో ఏఈ అనిల్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కిలో వాట్‌కు రూ.1250, 2కిలో వాట్‌కు రూ.2450, 3కిలో వాట్‌కు రూ.3650, 4కిలో వాట్‌కు రూ.4850, 5కిలో వాట్‌కు రూ.6050లు కట్టాల్సి ఉంటుందన్నారు. మార్చి నుంచి జూన్ వరకు అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని, వినియోగదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.8494
వెండి కిలో ధర	రూ. 100,300
వెండి ఒక గ్రాము	రూ.103.30

న్యూస్ బాక్స్

ఉర్దూ పాఠశాలల తనిఖీ

వెంకటాచలం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సర్వేపల్లి, కసుమూరు గ్రామాల్లోని ఉర్దూ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను శుక్రవారం ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి షేక్‌ఖాజా మొహిద్దీన్ ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలిచ్చారు. ఆయన వెంట విద్యాధికారులు, సిబ్బంది ఉన్నారు.

మొరాయిస్తున్న కొడవలూరు రైల్వేగేటు

● వాహనదారుల అవస్థలు

కొడవలూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొడవలూరు రైల్వేగేటు రెండురోజులుగా మొరాయిస్తుంది. దీంతో అల్లూరు, కొడవలూరు, విడవలూరు మండలాల ప్రజలు తపాతోపు వద్ద ఉన్న అండర్ బ్రిడ్జి నుంచి వెళుతున్నారు. వరి కోతలు సీజన్ కావడంతో భారీగా ధాన్యం లారీలు ఎదురు వస్తున్నందున తపాతోపు వద్ద ట్రాఫిక్ జామ్ అవుతోంది. అంతేకాకుండా అండర్ బ్రిడ్జి దాటాలంటే ఒక్కో వాహనానికి 20నిమిషాలు పడుతోంది. అధికారులు స్పందించి త్వరితగతిన రైల్వే గేటు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థులకు మజ్జిగ పంపిణీ

వెంకటాచలం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): సర్వేపల్లిలోని కేఎస్ఎన్ జడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు శుక్రవారం జనసేన నాయకులు మజ్జిగ పంపిణీ చేశారు. నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్‌నాయుడు మాట్లాడారు. ప్రజా సమస్యలతోపాటు సేవా కార్యక్రమాల్లో పార్టీ ముందు ఉంటుందన్నారు. కార్యక్రమంలో జనసేన నేతలు పినిశెట్టి మల్లికార్జున్, సందూరి శ్రీహరి, మణి, ఏడుకొండలు తదితరులున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మనుబోలు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన నాసిన రవికుమార్ (42)రెండునెలలుగా చికిత్స పొందుతూ నెల్లూరులోని ఓ ఆసుపత్రిలో శుక్రవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మద్యానికి బానిసైన రవికుమార్ నిత్యం మందు కోసం డబ్బులు ఇవ్వాలని భార్యను వేధించేవాడు. ఈ క్రమంలో జనవరి 28న భార్య డబ్బులు ఇవ్వలేదని గొడవపడ్డాడు. ఆవేశంలో ఇంట్లోని పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

చలివేంద్రం ఏర్పాటు



పాల్గొన్న చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి

కోవూరు, మార్చి21 (ఆంధ్రజ్యోతి): స్థానిక తాలుకా ఆఫీసు కూడలిలో దుగ్గిశెట్టి కోటయ్య శెట్టి జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం టీడీపీ పార్లమెంటు కమిటీ ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి ప్రారంభించి మాట్లాడారు. రవాణా సౌకర్యాలు లేనిరోజుల్లో దుగ్గిశెట్టి కోటయ్య ఈ ప్రాంతంలో సత్రం నిర్మించారన్నారు. ప్రజాహిత కార్యక్రమాలు ఏర్పాటు చేయమని కుటుంబ సభ్యుల్ని కోరామన్నారు. కార్యక్రమంలో దుగ్గిశెట్టి కోటయ్య శెట్టి సత్రం ఫౌండర్ ట్రస్టు రామమూర్తి, సమాచార హక్కుసంఘం జిల్లా అధ్యక్షుడు విజయకుమార్, నాయకులు హరి, కలికి సత్యనారాయణరెడ్డి, గొర్రెపాటి నరసింహ, ఇందుపూరు మురళీకృష్ణారెడ్డి పాల్గొన్నారు. అనంతరం అన్నదానం చేశారు.

వృద్ధురాలిపై దాడి


● పోలీసులకు ఫిర్యాదు

మనుబోలు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరంపల్లి గ్రామంలో కొందరు దాడిచేసి తనను కులంపేరుతో దూషించారని గుండుపాక మీరమ్మ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం రాత్రి తనకున్న రెండుఎకరాల వరిపైరును కోత కోయించి వడ్లు ఇంటికి తరలిస్తుండగా ట్రాక్టర్ వడ్లను అదే గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు అడ్డుకుని ధాన్యంను తమ ఇంటికి తరలించాలన్నారు. ఈ విషయంపై ప్రశ్నిస్తే మీ మనవడు మహేష్ తమ వద్ద నుంచి రూ.లక్ష అప్పు తీసుకుని కట్టలేదని చెప్పారు. అందులో తనకేమి సంబంధం లేదని చెప్పడంతో కులంపేరుతో దూషిస్తూ దాడి చేసి ట్రాక్టర్ ధాన్యంను తీసు కెళ్లారు. విషయం తెలుసుకున్న సీపీఎం, కేవీపీఎస్ నాయకులు ఆమెను పరామర్శించారు. ఈ విషయంలో బాధితురాలికి న్యాయం చేయాలని పోలీసులను కోరారు.

నాగాయగుంట..తాగునీటి తంటా!

● పంట కాలువ నీరు ట్యాంకర్లతో సరఫరా
● లేకుంటే ఊటబావి నీరే దిక్కు
● ఏ ప్రభుత్వం వచ్చినా మా సమస్యలు తీరవంటున్న గ్రామస్థులు

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగాయగుంట పంచాయతీ ఆ పంచాయతీ పరిధిలో ఉండే మరో గ్రామం అనంతనారాయణపురం. ఈ గ్రామాల్లో సుమారు 3.500మంది జనాభా ఉన్నారు. గ్రామస్థులు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. గతేడాది వేసవిలో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి రూ.2లక్షలు సొంత నిధులతో ఈ రెండు గ్రామాలకు ట్యాంకర్లతో నీటిని సరఫరా చేశారు. గతంలో నిర్మిచిన ఓవర్ హెడ్‌ట్యాంకు, కాలనీల్లో పలు చోట్ల ఏర్పాటు చేసిన సిన్‌టెక్స్ ట్యాంకులు నీటి సౌకర్యం లేక నిరుపయోగంగా ఉన్నాయి.



నాగాయగుంట గ్రామం వ్యూ

రెండు బోర్లు వేసినా..

గత 4నెలల క్రితం స్థానిక నాయకులు అప్పు చేసి రెండు బోర్లు వేశారు. కానీ అక్కడి నుంచి ఖర్చు పెట్టి పైపులైన్లు వేసుకోలేపోతున్నారు. ఈ సమస్యతో ఈ రెండు గ్రామాలకు తాగునీరు సరఫరా కావడం లేదు. పంట కనిగిరి రిజర్వాయర్ పరిధిలోని పెద్దపుత్తేడు కాలువ నుంచి ఊట బావిలోకి నీరు సరఫరా అవుతోంది. ఈ నీరే రెండు గ్రామాల ప్రజలు గొంతు తడుపుతోంది. ప్రస్తుతం ఆ బావిలో ఊరే నీటినే రెండురోజులకోసారి ఒక్క ట్యాంకరుతో నీటిని తెచ్చి వంతులవారీగా వీధులకు సరఫరా చేస్తున్నారు. ఈ గ్రామాల్లో చిన్న, సన్నకారు రైతులు పంటల సాగుతో పాటు పాడి గేదేలు పెంచుకుంటున్నారు. వీటికి వర్షాకాలం తప్ప మిగిలిన కాలాల్లో నీటి కోసం పొలాలకు తీసుకెళ్లాల్సిన దుస్థితి ఉంది. ఇప్పటికైనా కోవూరు ఎమ్మెల్యే, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డి దంపతులు మా గ్రామాల్లో తాగునీటికి శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.



పెద్దపుత్తేడు పంట కాలువ నీటిని ట్యాంకర్‌తో సరఫరా

నాగాయగుంటకు వరకు పైప్‌లైన్ వేయాలి

బుచ్చి నగర పంచాయతీలో ప్రజల కోసం 2.ఒ పథకం కింద రూ.85కోట్లతో చేపడుతున్న తాగునీటి పథకం పైపులైను రామచంద్రాపురం వరకు ఏర్పాటు చేశారు. ఆ పైపులైను నాగాయగుంట వరకు సరఫరా చేస్తే తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దొరుకుతుంది. ఈ మేరకు పాలకులు చర్యలు తీసుకోవాలి.

కృష్ణయ్య, టీడీపీ నాయకుడు, నాగాయగుంట

ధాన్యాన్ని తక్కువ ధరకు అమ్ముకోవద్దు

● ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి
● కొనుగోలు ప్రక్రియ పరిశీలన

వెంకటాచలం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని విక్రయించుకునే విషయంలో రైతులు కొంచెం ఓపికతో వ్యవహరించాలని, ఏ ఒక్క రైతు కూడా తక్కువ ధరకు ధాన్యాన్ని అమ్ముకోవద్దని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సూచించారు. శుక్రవారం ఆయన గొలగమూడిలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించి మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా తొలికారు పంట బాగా పండిందన్నారు. రైతులు ప్రధానంగా కేఎన్ఎం, ఆర్ఎన్ఆర్, బీపీటీ రకాల పంటలు సాగు చేశారని తెలిపారు. ప్రతి కొనుగోలు కేంద్రాన్ని దగ్గరలోని రైసు మిల్లుకు ట్యాగ్ చేసేశారన్నారు. విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌ను రైతులు సంప్రదిస్తే ట్యాగ్ చేసిన రైసు మిల్లుకు ధాన్యం తోలేలా చర్యలు తీసుకుంటారన్నారు. ప్రభుత్వం కనీస మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేసి 24 గంటల్లోనే నగదును రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేస్తోందన్నారు. ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుని పుట్టికి రూ.19,720 చెల్లిస్తుంటే రైతులు దళారులకు రూ.17 వేలుకు అమ్ముకోవాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. దళారుల మాయలో పడకుండా ఉండాలన్నారు. ధాన్యం విక్రయం విషయంలో రైతుకు ఏ ఒక్క ఇబ్బంది వచ్చినా తన కార్యాలయంలో సంప్రదించవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కల్పన, మండల వ్యవసాయ అధికారి హరికరుణాకర్‌రెడ్డి, నేతలు రావూరి రాధాకృష్ణ మనాయుడు, చల్లా నాగార్జున్‌రెడ్డి, పార్థసారధి నా యుడు, రవినాయుడు, సత్తార్ సాహెబ్, దామోదర్, మనోహర్, బ్రహ్మయ్య తదితరులున్నారు.



ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

70 పుట్ల ధాన్యం తరలింపు

● పిడూరు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన తహసీల్దారు

మనుబోలు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పిడూరు ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రం నుంచి 70పుట్ల ధాన్యంను నెల్లూరు మిల్లులకు తరలించినట్లు తహసీల్దార్ సీహెచ్. సుబ్బయ్య తెలిపారు. శుక్రవారం ఆయన పిడూరు ధాన్యం కొనుగోలు కేంద్రంను పరిశీలించి ధాన్యం తరలింపు ప్రక్రియను పర్యవేక్షించారు. బీపీటీ ధాన్యం మార్కెట్‌లో ధర తక్కువగా ఉందని, కావున రైతులు ప్రభుత్వ కేంద్రాలకు ఇచ్చి మద్దతు ధర పొందాలని కోరారు. పిడూరే కాకుండా గురివిందపూడి, వెంకన్నపాళెం కేంద్రాల నుంచి శనివారం ధాన్యం కొనుగోలు చేయనున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ శివనాయక్, ఏవో జహీర్ తదితరులు పాల్గొన్నారు.



పిడూరులో ధాన్యం తరలింపును పరిశీలిస్తున్న తహసీల్దార్, ఏడీ

జాబ్‌కార్డులు ఇప్పించండి

● చవకచర్ల, తుమ్మగుంట మహిళలు

విడవలూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పనులకు జాబ్‌కార్డులు ఇవ్వకపోవడంతో జీవనోపాధిని కోల్పోతున్నామని చవకచర్ల,తుమ్మగుంట మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఉపాధిహామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు తమ వద్దకు వచ్చి ఆ పథకం గురించి వివరించిన దాఖలాలు లేవన్నారు. మా కాలనీల్లో సుమారు 70కుటుం బాలు అందులో మధ్యతరగతి, నిరుపేద మహిళలు అధికంగా ఉన్నట్లు చెప్పారు. మాకు జాబ్‌కార్డులు ఇవ్వాలని 2007నుంచి ఫీల్డ్ అసిస్టెంటును కోరుతున్నా వారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. ఈ విషయంపై ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చొరవ తీసుకుని జాబ్‌కార్డులు ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో మహిళలు సిహెచ్. లక్ష్మీ, ఎం.గౌతమి, అమ్మనమ్మ, మనోహర్‌రెడ్డి, నిర్మలమ్మ, ధనమ్మ, ప్రభ, నాగమ్మ, శీనయ్య తదితరులు పాల్గొన్నారు.



సమస్యను చెబుతున్న మహిళలు

కార్యదర్శులకు పని ఒత్తిడి తగ్గించండి

విడవలూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శులకు పనిభారం ఎక్కువైందని, వారు వివిధ మానసిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని ఆంధ్రప్రదేశ్ పంచాయతీ సెక్రటరీ ఫెడరేషన్ ఉద్యోగుల సంఘం నాయకులు, పంచాయతీ రాజ్ ఓఎస్‌డీ వెంకటక్రిష్ణను శుక్రవారం అమరావతిలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిదులతో మాట్లాడారు. కార్య దర్శులకు రెగ్యులర్ విధులు మంచినీటి సరఫరా, శానిటేషన్, వీధిలైట్లు, పన్ను వసూలు వంటి విధులను అప్పగించాలని కోరారు. ప్రభుత్వం వివిధశాఖేతర వి ధులను అప్పగించిందని వాపోయారు. పంచాయతీ కార్యదర్శుల ప్రమో షన్‌ల విషయంలో ఎక్కువ గ్రేడ్‌లు ఉండడం వలన అన్యాయం జరుగు తుందన్నారు. గ్రేడ్లు కుదించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో నెల్లూరు జిల్లా ఉద్యోగ సంఘం సభ్యులు వర్ల శంకర్, శ్రీనువాసులు, నరేంద్ర, మల్లికార్జున పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

సమస్యలు పరిష్కరించాలి

ముత్తుకూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): గ్రామాల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు గడ్డం అంకయ్య డిమాండ్ చేశారు. బ్రహ్మదేవం పంచాయతీ సచివాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం ప్రజాయాత్ర కార్యక్రమం నిర్వహించారు. మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం శ్రద్ధ చూపట్లేదన్నారు. అనంతరం కార్యదర్శికి పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు షేక్.మస్తానా, పెద్దహుడి వెంకయ్య, ఎస్‌కె.సలాం, మస్తానమ్మ, సుకన్య తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు అభినందన

బుచ్చిరెడ్డిపాళెం,మార్చి 21 (ఆంధ్రజ్యోతి): కరాటేతో శారీరక దృఢత్వంతో పాటు స్వీయ రక్షణ పొందవచ్చని బుచ్చి నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ మురళి అన్నారు. ఈ నెల 12న నెల్లూరు టౌన్ హాల్‌లోని స్కై మార్షల్ రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌లో అండర్-10, అండర్-12 విభాగాల్లో అసాధారణ ప్రతిభ చాటి గోల్డ్ మెడల్స్ సాధించిన ఓ ప్రైవేటు స్కూలు విద్యార్థులను, స్కై మార్షల్ ఆర్ట్స్ ఏపీ స్టేట్ సెక్రటరీ ఇబ్రహీంను చైర్‌పర్సన్ అభినందించారు. కార్యక్రమంలో కమిషనర్ బాలకృష్ణ, వైస్ చైర్మన్లు యరటపల్లి శివకుమార్‌రెడ్డి, పఠాన్ నస్రీన్ ఖాన్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల వార్షికోత్సవం



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న సీఐ సత్యనారాయణ

రాపూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కాలేజీ ప్రిన్సిపాల్ హనుమంతయ్య 2024-25లో విద్యార్థులు సాధించిన ప్రగతిని వివరించారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి భవిష్యత్తుపై దృష్టి సారించాల న్నారు. ఈసందర్భంగా క్రీడా పోటీలలో గెలుపొందిన వారికి సర్టిఫికెట్లు, బహుమతులు సీఐ సత్యనారాయణ చేతుల మీదుగా అందచేశారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకటరాజేష్, డిగ్రీ లెక్చరర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై అభినందనలు

రాపూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఎమ్మార్పీఎస్ జిల్లా అధికారి ప్రతినిధి గోవిందు రంగయ్య ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. అలాగే మాదిగ కులానికి వన్నె తెచ్చిన మంద కృష్ణ మాదిగకు అభినందనలు తెలిపారు. ఎస్సీ వర్గీకరణతో అందరికీ మేలు జరుగుతుందని గోవిందు రంగయ్య మీడియాకు తెలిపారు.

మండలానికో పారిశ్రామిక పార్క్

● ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

కోవూరు, మార్చి21 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గపరిధిలోని మండలకేంద్రాల్లో గ్రామీణ యువతకు ఉపాధే లక్ష్యంగా పారిశ్రామిక పార్కుల్ని ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తెలిపారు. నెల్లూరు నగరంలోని ఆమె స్వగృహంలో శుక్రవారం జిల్లా పరిశ్రమల శాఖ అధికారులు, మండల పరిధిలోని తహసీల్దార్లతో సమావేశం నిర్వహించారు. పరిశ్రమల ఏర్పాటుకు వీలుగా మండల కేంద్రాల్లో ప్రధాన రహదారికి సమీపంలో 10 నుంచి 100ఎకరాల స్థలాన్ని సేకరించాల్సిందిగా కోరారు. భూసేకరణకు వీలుగా ప్రతిపాదనలు సిద్ధం చేయాల్సిందిగా కోరారు. రాష్ట్ర ప్రభుత్వం చిన్న, మధ్య తరగతి పరిశ్రమల ఏర్పాటుపై దృష్టి పెట్టిందన్నారు. తహసీల్దార్లు వీలైనంత తొందరగా భూసేకరణకు ప్రయత్నించాలన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

మసీదులకు వాటర్ కూలర్లు

● బుచ్చిరెడ్డిపాళెం :దామరమడుగులో రెండు మసీద్‌లకు వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా 2వాటర్ కూలర్లను కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి బహూకరించారని శుక్రవారం దామరమడుగు టీడీపీ నాయకుడు మహేష్, జగదీష్ తెలిపారు. మండలంలోని ప్రతి మసీదుకు కూలర్‌న ఇచ్చినట్లు తెలిపారు.

● కోవూరు నియోజవర్గ పరిధిలోని 60మసీదులకు వీపీఆర్ ఫౌండేషన్ సంస్థ నిధులతో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి శుక్రవారం వాటర్‌కూలర్లను బహూక రించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రంజాన్ ఉపవాస దీక్ష పాటిస్తున్న వారికి చల్లటి తాగునీరు అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. కార్యక్రమంలో పెన్నా డెల్టా చైర్మన్ జెట్టి రాజగోపాలరెడ్డి, బుచ్చిరెడ్డిపాళెం చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, వైస్ చైర్మన్ వై.శివకుమార్‌రెడ్డి, నాయకులు బెజవాడ వంశీ కృష్ణారెడ్డి, మైనార్టీ నాయకులు ఇంతియాజ్, జమీర్, జహంగీర్, ఫిరోజ్,పర్వీన్, పఠాన్ నజీర్, పర్వీన్ పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

నిమ్మతోట కంచె దగ్ధం

● రూ.3లక్షల ఆస్తి నష్టం

పొదలకూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ పరిధిలోని లింగంపల్లికి చెందిన అనుమాల వెంకట్రామిరెడ్డికి చెందిన నిమ్మతోట కంచెకు శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తులు తగలబెట్టారు. మంటలు దట్టంగా వ్యాప్తి చెందడంతో కంచె దాదాపుగా దగ్ధం అయ్యింది. సమాచారం అందుకున్న పొదలకూరు అగ్నిమాపక సిబ్బంది వాహనంతో వచ్చి మంటలు నిమ్మ చెట్లకు రాకుండా అదుపు చేశారు. పొరపాటున ఎవరైనా సిగరెట్ తాగి పడేయడంతో ఈ ప్రమాదం జరిగిందా లేక ఎవరైనా ఉద్దేశపూర్వకంగా తగలబెట్టారా అనే విషయమై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని యజమాని తెలిపారు. ఈ అగ్నిప్రమాదంలో సుమారు రూ.3లక్షల వరకు నష్టం వాటిల్లిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

లైంగిక వేధింపులు, హత్యాయత్నం కేసులో ఐదేళ్ల జైలు శిక్ష

నెల్లూరు(లీగల్), మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఓ బాలికపై లైంగిక వేధింపు, హత్యాయత్నం చేశాడన్న కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్షతోపాటు రూ.1000 జరిమానా విధిస్తూ నెల్లూరు పోక్సో కోర్టు స్పెషల్ జడ్జి సిరిపిరెడ్డి సుమ శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు... వింజమూరు మండలం వెంకటాద్రిపాళెంకు చెందిన ఓ బాలిక 2013 మే 6వ తేదీన కాలకృత్యాలు తీర్చుకునేందుకు చిల్లచెట్ల మధ్యకు వెళ్లగా అదేగ్రామానికి చెందిన ఆర్.కృష్ణ ఆమెపై లైంగిక దాడికి పాల్పడేందుకు ప్రయత్నించగా అందుకు ఆమె వ్యతిరేకించడంతో ఆమెను లాక్కునిపోయి పక్కనే ఉన్న బావిలో తోసివేసి హత్యాయత్నానికి పాల్పడ్డాడని పోలీసులకు ఫిర్యాదు అందింది. ఈ మేరకు వింజమూరు పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విచారణలో అతనిపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డి.చంద్రశేఖర్ వాదించారు.

పెన్నా ప్యాకేజీలో ఎన్నెన్నో సిత్రాలు!

● ప్రీక్లోజ్ అయ్యాక పార్ట్ బిల్లుకు విజ్ఞప్తి
● ఆ తర్వాత అదే పేరుతో మళ్లీ ఫైనల్ బిల్లుకు క్యూసీసీ
● ఏడాది తర్వాత మళ్లీ కొట్టేసి రూ.4 కోట్లు పెంపు
● బిల్లు కోసం కోర్టుకెక్కిన కాంట్రాక్టర్
● విజిలెన్స్‌కు ఫిర్యాదు చేసిన రూరల్ ఎమ్మెల్యే

నెల్లూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : బయట వారెవరికీ టెక్నికల్ సబ్జెక్ట్ అర్థం కాదులే అన్న ధైర్యమో.. లేక మళ్లీ వచ్చేది వైసీపీ ప్రభుత్వమే కదా, మనల్ని అడిగేదెవరులే అన్న బరితెగింపో తెలియదు కానీ పెన్నా డెల్టా ఆధునికీకరణ పనుల ప్యాకేజీ-1 బిల్లుల్లో అనేక మాయలు చేశారు. ఒకసారి ఫైనల్ బిల్లుకు ఇచ్చిన క్వాలిటీ కంట్రోల్ సర్టిఫికెట్‌లో ఏడాది తర్వాత కొట్టివేసి రూ.4.12 కోట్లు మొత్తం పెంచడమే పెద్ద తప్పుగా ఇప్పటి వరకూ బయటపడింది. అయితే ప్రభుత్వం వర్కును ప్రీక్లోజ్ చేశాక పార్ట్ బిల్లు పేరుతో మరో రిక్విజిషన్ పంపి క్యూసీ సర్టిఫికెట్ పొందారు. దీని విలువ రూ.4.40 కోట్లుగా ఉంది. ప్రభుత్వం ప్రీక్లోజ్ చేస్తూ జీవో ఇచ్చిన ఐదు రోజులకే ఈ తంతు జరగడం గమనార్హం. అదే సమయంలో ప్రీక్లోజ్ అయిపోయి బిల్లులు రికార్డు జరిగిపోయాక తిరుపతి చీఫ్ ఇంజనీర్ రివైజ్ ఎస్టిమేషన్‌కు అనుమతి ఇచ్చినట్లు కూడా బిల్లుల్లో చూపిస్తూ మరికొంత మొత్తాన్ని పెంచారు. ఇటువంటి అనేక సిత్రాలు తాజాగా వెలుగులోకి వచ్చాయి.



రూ.14.67 కోట్లను రూ.18.79 కోట్లుగా దిద్దిన క్యూసీ సర్టిఫికెట్

ఎవరి కోసం చేశారు..?

ప్రీక్లోజ్ అంటే కాంట్రాక్టర్ ఇక తాను పని చేయలేనని ప్రభుత్వానికి లేఖ రాసి అనుమతి తెచ్చుకోవడం. ఒక్కసారి వర్కు ప్రీక్లోజ్‌కు ప్రతిపాదించాక ఇక ఆ తర్వాత ఒక్క రూపాయి పని కూడా చేసేందుకు వీల్లేదు. ప్రీక్లోజ్ సమయంలోనే ఆ వర్కు ఎంత వర కూ జరిగిందన్న పూర్తి వివరాలను ప్రభుత్వానికి అందజేస్తారు. ఆ తర్వాతనే ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది. 2020 జూలై 8వ తేదీన ప్యాకేజీ-1 వర్కును ప్రీక్లోజ్ చేస్తూ ప్రభుత్వం జీవో ఇచ్చింది. అయితే ఆ వెంటనే ఐదు రోజులకే అంటే జూలై 13న నెల్లూరు సెంట్రల్ డివిజన్ నుంచి క్వాలిటీ కంట్రోల్‌కు 48వ బిల్లుకు సర్టిఫికెట్ ఇవ్వాలం టూ రిక్విజిషన్ అందింది. అసలు ప్రీక్లోజ్ చేశాక పార్ట్ బిల్లుకు ఎందుకు రిక్విజిషన్ పంపారన్నది ఇక్కడ తేలాల్సిన విషయం. ఇది అటుంచితే సెంట్రల్ డివిజన్ నుంచి రిక్విజిషన్ అందిన మూడు రోజులకే అంటే జూలై 16నే 48వ బిల్లుకు రూ.4.40 కోట్లతో క్యూసీ సర్టిఫికెట్ జారీ అయ్యింది. అంటే రెండు రోజుల్లోనే క్యూసీ అధికారులు అన్ని కోట్ల విలువైన పనులను పరిశీలించి, ల్యాబ్ టెస్టులను పరీక్షించి సర్టిఫికెట్ ఇచ్చారన్నమాట..! ఇదంతా ఒక ఎత్తయితే మళ్లీ 2021 ఫిబ్రవరి 27న సెంట్రల్ డివిజన్ నుంచి 48వ బిల్లు, ఫైనల్ బిల్లుకు సర్టిఫికెట్ ఇవ్వాలంటూ క్యూసీకి రిక్విజిషన్ వెళ్లింది. దీనికి అదే ఏడాది మే 1న రూ.14.67 కోట్లకు క్యూసీ సర్టిఫికెట్ జారీ అయ్యింది. అంటే ముందుగా 48వ బిల్లు పేరుతో రూ.4.40 కోట్లకు క్యూసీ సర్టిఫికెట్ ఇష్యూ చేసి, మళ్లీ ఆరు నెలల తర్వాత 48వ బిల్లు, ఫైనల్ బిల్లు అంటూ రూ.14.67 కోట్లకు మరో సర్టిఫికెట్ ఇష్యూ చేశారు. దీని వెనుక మతలబు ఏంటన్నది ఇరిగేషన్ ఉన్నతాధికారులే తేల్చాలి. ఇక ఏడాది తర్వాత అంటే 2022 జూన్ 20వ తేదీన క్యూసీ సర్టిఫికెట్‌లో రూ.14.67 కోట్లను కొట్టేసి దానిని రూ.18.79 కోట్లుగా దిద్దారు. అయితే ఇన్ని అవకతవకలు జరిగాక చివరగా 2022 ఆగస్టు 11న ప్యాకేజీ-1 వర్కుకు తిరుపతి సీఈ రివైజ్డ్ ఎస్టిమేషన్‌కు అనుమతి ఇచ్చినట్లు రికార్డుల్లో చూపిస్తుండడం గమనార్హం. ఇవన్నీ ఎవరి కోసం చేశారన్న ప్రశ్న ఉత్పన్న మవుతోంది. అప్పట్లో వైసీపీ ప్రజాప్రతినిధిగా కీలక స్థానంలో ఉన్న వ్యక్తి కాంట్రాక్టర్ కావడంతో ఆయన ఒత్తిడితో ఇదంతా చేశారా..? లేక మరేదైనా ఆశించి చేశారా..? అన్నది తేలాల్సి ఉంది.

● **వారు కోర్టుకు.. వీరు విజిలెన్స్‌కు..!**

ప్రభుత్వం మారగానే ప్యాకేజీ-1 బిల్లును గతేడాది ఇరిగేషన్ అధికారులే భయపడి వెనక్కు తెప్పించారు. అయితే ఇప్పుడు సదరు వైసీపీ నేత, కాంట్రాక్టర్ ఈ బిల్లు కోసం కోర్టుకెళ్లినట్లు తెలుస్తోంది. ఇరిగేషన్ అధికారులు కూడా తమకేమీ తెలియదన్నట్లు వ్యవహరిస్తుండడం విమర్శలకు తావిస్తోంది. ఇంత పెద్ద ఎత్తున అవకతవకలు బయటపడితే ఇరిగేషన్ ఉన్నతాధికారులు మౌనం దాల్చడంపై కూడా అనేక అను మానాలు వ్యక్తమవుతున్నాయి. కనీసం ఏం జరిగిందో తెలుసుకునే ప్రయత్నం కూడా చేయడం లేదని ఆ శాఖ వర్గాలు చర్చించుకుంటున్నాయి. కాగా, పెన్నా డెల్టా ఆధునికీకరణ పనుల ప్యాకేజీ-1లో జరిగిన అక్రమాలపై రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి విజిలెన్స్‌కు ఫిర్యాదు చేశారు. పూర్తి విచారణ జరిపి ప్రజాధనాన్ని కాపాడాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై నెల్లూరు సెంట్రల్ డివిజన్ ఈఈ నాగరాజును వివరణ కోరగా.. తాము క్యూసీ సర్టిఫికెట్ జారీ చేశాక వర్క్‌స్లిప్ అప్రూవల్ అయ్యిందని, అందుకోసమే సర్టిఫికెట్‌లో కరెక్షన్స్ చేశామని చెప్పుకొచ్చారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	104
స్కిన్ చికెన్	192
స్కిన్‌లెస్	212
కోడిగుడ్ల ధర (100):	425

రంజాన్‌కు పటిష్ట ఏర్పాట్లు

నెల్లూరు(సాంస్కృతికం) మార్చి 21(ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఈద్గాల వద్ద ఈనెల 31న రంజాన్ పండుగ కోసం ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. బారాషహీద్ దర్గా ప్రాంగణంలోని ఈద్గా వద్ద వద్ద రంజాన్ ప్రార్థనలకు ఏర్పాట్లు చేస్తున్నారు. కొంతభాగం సెమీ పర్మినెంట్ షామియానా మిగిలిన భాగం షామియానాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. రొట్టెల పండుగ తర్వాత పారిశుద్య కార్యక్రమం చేపట్టకపోవడంతో టన్నుల కొద్ది చెత్తను తొలగిస్తున్నారు. మైదానం అంతా పిచ్చి చెట్లు, ప్లాస్టిక్ కవర్లు చెత్తాచెదారం ఉంది.



న్యూస్ బాక్స్

ఆస్తి పన్ను చెల్లించమంటే సచివాలయ అడ్మిన్‌పై దాడి

నెల్లూరురూరల్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఆస్తి పన్ను చెల్లించాలని అడిగినందుకు సచివాలయ అడ్మిన్‌పై దాడికి పాల్పడిన ఘటన నెల్లూరురూరల్లో జరిగింది. సీఐ గుంజి వేణు సమాచారం మేరకు.. యలమవారిదిన్నె ప్రాంతంలో నవీన్‌కు చెందిన ఇంటి ఆస్తి పన్ను చెల్లించాలని స్థానిక సచివాలయ అడ్మిన్ వెంకటేష్ సూచించాడు. తన ఇంటి పన్ను ఎక్కువగా వచ్చిందని చెప్త వివాదానికి దిగిన నవీన్ దాడికి పాల్పడినట్లు వెంకటేష్ తన ఫిర్యాదులో పేర్కొంటు గురువారం ఫిర్యాదు ఇచ్చాడని, ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు శుక్రవారం సీఐ తెలిపారు.

ప్రాణాంతక వ్యాధులపై జాగ్రత్తలు తీసుకోండి

నెల్లూరు(వైద్యం), మార్చి 21(ఆంధ్రజ్యోతి) : దోమల వల్ల వచ్చే ప్రాణాంతక వ్యాధులను నివారించేలా చర్యలు తీసుకోవాలని మలేరియా విభాగం అదనపు వైద్యాధికారి నాగార్జున వెల్లడించారు. శుక్రవారం డ్రైడే ఫ్రైడే సందర్భంగా కోటమిట్ట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందితో ఆయన మాట్లాడారు. అనంతరం పలు రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న చెత్తకుప్పలను పరిశీలించి వాటిని వెంటనే తొలగించాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రామారావు, తిరుపతయ్య, తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ జైలులో 26న బహిరంగ వేలం

నెల్లూరు(క్రైం), మార్చి 21(ఆంధ్రజ్యోతి): నెల్లూరు సెంట్రల్ జైల్లో ఉపయోగంలో లేని సివిల్ స్టోర్స్ సామగ్రిని ఈనెల 26వ తేదీన సెంట్రల్ జైలు వద్ద బహిరంగ వేలం వేయనున్నట్లు జైలు సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్టెయిన్లెస్ స్టీల్ పెరుగు కప్పులు 250, బౌల్స్ 9, మగ్గులు 120, 24 ఇంచెస్ సాంసంగ్ ఎల్ఈడీ టీవీలు 15కు వేలం నిర్వహిస్తామని పేర్కొన్నారు. వేలంలో పాల్గొనే వారు రూ.2వేలు చెల్లించాలని పేర్కొన్నారు. వేలం దక్కించుకున్న వారు వెంటనే నగదు మొత్తం చెల్లించి వస్తువులను తీసుకెళ్లాలని తెలిపారు. పూర్తి వివరాలకు సెంట్రల్ జైలు సూపరింటెండెంట్‌ను సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

బీజేఎంఎం ఆటోస్టాండ్ ప్రారంభం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మార్చి 21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బాలాజీనగర్ మండల పరిధిలో పీటీజీ పెట్రోల్ బంక్ సెంటర్‌లో శుక్రవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు శిపారెడ్డి వంశీధర్‌రెడ్డి బీజేఎంఎం ఆటోస్టాండ్‌ను ప్రారంభించి మాట్లాడారు. ఈ ఆటో స్టాండ్ ద్వారా ఆటో డ్రైవర్లకు మంచి సౌకర్యాలు కల్పించడంతో పాటు వారి జీవనోపాధికి మద్దతుగా బీజేపీ ఎప్పుడూ అండగా ఉంటోందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ బాలాజీనగర్ మండల అధ్యక్షుడు మింగా కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్రబోలు రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ బాలికలకు స్కాలర్‌షిప్‌ల మంజూరు

నెల్లూరు(విద్య), మార్చి 21(ఆంధ్రజ్యోతి): డీకే ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాల విద్యార్థినులకు రూ.8లక్షలకు పైగా మలబార్ గోల్డ్ స్కాలర్‌షిప్‌లు మంజూరయ్యాయని కళాశాల ప్రిన్సిపాల్, ఆర్ఐవో డాక్టర్ ఏ.శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి కళాశాలకు చెందిన 93 మంది విద్యార్థినులకు ఈ స్కాలర్‌షిప్‌లను అందచేస్తారన్నారు. మూడేళ్లగా మలబార్ చారిటబుల్‌ట్రస్ట్ 300 మంది విద్యార్థినులకు రూ.30లక్షలకు పైగా స్కాలర్‌షిప్‌లు అందించిందన్నారు. ఈనెల 22వ తేదీ కళాశాలలో స్కాలర్‌షిప్‌ల పంపిణీ చేస్తారని కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు.

సునీత విలియమ్స్ రాక విజ్ఞానశాస్త్రంలో ఓ అద్భుతం

నెల్లూరు(వైద్యం), మార్చి 21(ఆంధ్రజ్యోతి) : అంతరిక్షంలో చిక్కుకుపోయిన భారత సంతతికి చెందిన శాస్త్రవేత్త సునీత విలియమ్స్ భూమికి తిరిగిరావడం ఓ అద్భుతమని ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యుడు డాక్టర్ శ్యాం ప్రసాద్ శశాంక పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని వియాని హోంలో పీఎంపీ అసోసియేషన్ నిర్వహించిన సునీత విలియమ్స్ అభినందన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు చాక్లెట్లు, బిస్కెట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌పీ గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, వియాని హోం సిస్టర్స్ రమ, జయ, జిల్లా పీహెచ్‌పీ నాయకులు షేక్ సత్తార్, శాఖవరపు వేణుగోపాల్, గోరంట్ల శేషయ్య, దేవరకొండ శ్రీనివాసులు, రాము, తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు



నగరంలోని ఫత్తేఖాన్‌పేటలో తొలగిస్తున్న ఆక్రమణలు

నెల్లూరు(సాంస్కృతికం), మార్చి 21(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఫత్తేఖాన్‌పేటలో ఆక్రమణలు తొలగించారు. డ్రైనేజీ కాలువ పునఃనిర్మాణం కోసం నగర పాలక సంస్థ అధికారులు చర్యలు చేపట్టారు. బ్రిటీష్ ప్రభుత్వం హయాంలో నిర్మించిన డ్రైనేజీ కాలువలు కావడంతో వర్షాకాలంలో కాలువ పొంగి రోడ్లంతా డ్రైనేజీ నీరుతో నిండిపోయేది. దీంతో ప్రజలు అవస్థలకు గురయ్యేవారు. ఈ క్రమంలో నూతన డ్రైనేజీ కాలువ వెడల్పుగా నిర్మించేందుకు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా ఆక్రమణలు తొలగించారు. దీనికి ప్రజలు కూడా సహకారం అందిస్తున్నారు.



ఆక్రమణలు తొలగించి డ్రైనేజీ కాలువ నిర్మాణానికి తవ్వుతున్న గోతులు →

వాహనాల షెడ్డులో ఏం జరుగుతోంది?

- 16 మందికి ఆరుగురే హాజరు
- క్లీనింగ్ వాహనాల లెక్క ఎక్కడ?
- బయటకు వెళ్తున్న వెహికల్స్ వివరాలేవి?
- ఆరా తీసి విస్తుపోయిన కమిషనర్
- కార్యాలయంలో చర్చతో ఆలస్యంగా వెలుగులోకి...



వాహన షెడ్డులో ఆరా తీస్తున్న కమిషనర్ (ఫైల్)

నెల్లూరు(సిటీ), మార్చి 21(ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగరంలో నిత్యం చెత్తను డంపింగ్ యార్డుకు తరలించే వాహనాల షెడ్డులో ఏం జరుగుతోంది? ఇక్కడ అంతా రహస్యమే.. అక్కడ జరుగుతున్న గోల్‌మాల్‌పై గురువారం ఆకస్మిక తనిఖీ చేసిన ఎస్ఎంసీ కమిషనర్ సూర్యతేజ విస్తుపోయారు. శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన సమాచారం మేరకు.. కుక్కలగుంట వద్దనున్న కార్పొరేషన్‌కు చెందిన వాహన షెడ్డులోకి కమిషనర్ ఆకస్మికగా తనిఖీకి వెళ్లారు. అక్కడ వాస్తవంగా 16 మంది వరకు సిబ్బంది ఉండాలి. కానీ 6 మందే విధుల్లో ఉన్నారు. మిగిలిన వారెక్కడ...? అంటూ ఆయన డీఈఈ, ఏఈఈలను ప్రశ్నించారు. వారు నీళ్ల నమిలుతూ సిబ్బందికి ఫోన్ చేయగా మేము ఇంట్లో ఉన్నామంటూ బదులిచ్చారు. కంగుతిన్న కమిషనర్ వారిని విధుల నుంచి తప్పించాలని ఆదేశించారు. షెడ్డు నుంచి బయటకు వెళ్తున్న వాహనాలు లెక్క ఎక్కడని అడిగిన ఆయనకు రిజిష్టర్ ఇచ్చారు. అందులో చూడగా బయటకు వెళ్లిన వాహనాల లెక్క, తీసుకెళ్లిన వారి సంతకాలు లేవు. ఇదేమిటని నిలదీశారు. అలాగే చెత్తతో మురికిగా మారిన వాహనాలను క్లీన్ చేసిన వివరాలు ఎక్కడ రాస్తున్నారు..? అని ప్రశ్నించారు. ఆ రిజిష్టర్‌లో చూడగా క్లీన్ చేసిన వాహనాల వివరాలు కాకుండా వేరే నెంబర్లు ఉండటంతో ఆయన విస్తుపోయారు. దీంతో ఆగ్రహించిన కమిషనర్ అసలేం జరుగుతోంది ఇక్కడ...? అంటూ ఇంజనీరింగ్ అధికారులపై మండిపడ్డారు. ఈ ఘటన శుక్రవారం కార్పొరేషన్‌లో చర్చనీయాంశంగా మారింది.

మైమరిపించిన గాత్ర కచేరి



గాత్ర కచేరి చేస్తున్న అభిషేక్ రఘురాం, తదితరులు

నెల్లూరు(సాంస్కృతికం), మార్చి 21(ఆంధ్రజ్యోతి): నగరంలోని పుర మందిరంలో జరుగుతు న్న 60వ త్యాగరాజ స్మరణోత్సవాల్లో భాగంగా మూడవ రోజు శుక్రవారం రాత్రి త్యాగరాజ స్వా మి కృతులను చెన్నైకి చెందిన అభిషేక్ రఘురామ్ తన గాత్ర శ్రావ్యంతో శ్రోతలను మైమరిపించారు. ఉదయం త్యాగరాజ స్వామి, సీతారా మచంద్రస్వామి పరివార దేవతలకు విశేష పూజలు, అలంకారం వైభవంగా జరిగాయి. ద్రౌపదీ స్వయంవరం హరికథను సీహెచ్. భవానీబాయ్, అన్నమయ్య హరికథను వి.శ్రీరా మ్‌భట్టర్ భాగవతార్ గానం చేసి శ్రోతలను ఆకట్టుకున్నారు. సాయంత్రం స్థానిక కళాకారులు పంచరత్న ఘోష్టిని గానం చేశారు. కె.గాయత్రి త్యాగరాజస్వామి కీర్తనను వర్ణం ప్రారంభించి రక్ష పెట్టరే కృతిని భైరవి రాగములో రసరంజకంగా త్యాగరాజ కృతులను ఆలపించారు.

వెంకయ్యనాయుడు అభినందన

త్యాగరాజ స్వామి సమస్త మానవాళికి భక్తి మార్గాన్ని బోధించిన మహనీయుడు అని మాజీ భారత ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు తెలిపారు. శుక్రవారం ఆయన ఈ కార్యక్రమాలను అభినందిస్తూ భిక్షాటన పూర్వక శ్రీత్యాగరాజ స్మరణోత్సవ సభ కార్యవర్గంకు లేఖ పంపారు. త్యాగరాజస్వామి స్మరణోత్సవాలు సంగీత అభిమానులకు పండుగని అందులో పేర్కొన్నారు. అలాంటి కార్యక్రమాన్ని తిరువాయూర్ తర్వాత నెల్లూరులో 60 ఏళ్లగా భక్తిశ్రద్ధలతో నిర్వహించడం ఓ చారిత్రక విశేషమని తెలిపారు. శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తి, డాక్టర్ వైవీ శాస్త్రి స్థాపించిన భిక్షాటన పూర్వక శ్రీత్యాగరాజ స్మరణోత్సవ సభ, నెల్లూరు ఆధ్యాత్మిక మకుటంతో దేదీప్యమానంగా వెలుగొందుతుందని తెలిపారు. తాను యువకుడిగా ఉన్నప్పుడు అనేక పర్యాయాలు ఆ సంగీత వైభవాన్ని వీక్షించానని స్మరణకు తెచ్చుకున్నారు. సాంబమూర్తి మొదలు పెట్టిన పరంపరను 60 ఏళ్లగా ముందుకు తీసుకురావడం ఆనందదాయకమన్నారు. నాడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కార్యక్రమం నిర్వహణపై చూపిన చొరవ ఆయన తనయుడు చరణ్ కొనసాగించడం అభినందనీయమన్నారు.

నిషేధిత ప్లాస్టిక్ వాడొద్దు

నెల్లూరు(సిటీ), మార్చి 21(ఆంధ్రజ్యోతి): నిషేధించిన ప్లాస్టిక్ వినియోగం పూర్తిగా ఆపేయాలని ఎంహెచ్‌వో చైతన్య చిరువ్యాపారులకు సూచించారు. శుక్రవారం నగరంలోని డైకస్‌రోడ్డు, పొదలకూరురోడ్డు, కొత్తూరు తదితర ప్రాంతాల్లో వ్యాపారులకు పలు సూచనలు చేశారు. 120 మైక్రాన్లకంటే తక్కువ పరిమాణం కలిగిన సింగల్ యూజ్ ప్లాస్టిక్‌ని నెల్లూరులో నిషేధించినట్లు తెలిపారు. వ్యాపారులు తమ దుకాణాల్లోని చెత్తను రోడ్లుపై వేసినా, డస్ట్‌బిన్లు పెట్టుకోకపోయిన నోటీసులు ఇచ్చి, జరిమానాలు విధిస్తామని స్పష్టం చేశారు. కాగా కార్పొరేషన్‌లో జరిగిన సమావేశంలో ఏడీసీ నందన్ పాల్గొని భవన నిర్మాణ వ్యర్థాలను రోడ్లపై వెయ్యనివ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఎంఎస్ఎంఈ సర్వే పూర్తి చేయాలని, సెక్రటరీలకు సూచించారు.



చిరు వ్యాపారితో మాట్లాడుతున్న ఎంహెచ్‌వో చైతన్య

బంకుల తొలగింపునకు నోటీసులు

● రాజకీయ ఒత్తిడితో వెనక్కి..?



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట రోడ్డుకు ఇరువైపులా ఉన్న బంకులు

నెల్లూరు(హరనాథపురం), మార్చి 21(ఆంధ్రజ్యోతి): నగరంలోని కూరగాయల మార్కెట్ వద్ద ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట రోడ్డుకు ఇరువైపుల ఉన్న బంకులను తొలగిస్తామని కార్పొరేషన్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ 5 రోజుల క్రితం నోటీసులు జారీ చేశారు. ఈ రోడ్డుపై బంకులు ఎక్కువ సంఖ్యలో ఉండడంతో రాకపోకలకు ఇబ్బందికరంగా ఉంది. ఇక్కడ రిజిస్ట్రార్ కార్యాలయంతోపాటు హోమియో, ఆయుష్ వైద్యశాలలు, వ్యవసాయ శాఖ ఏడీ, సహకార శాఖ, బీఎస్ఎన్ఎల్ కార్యాలయాలు, కార్పొరేషన్ ఉన్నత పాఠశాల, తదితరాలు ఉన్నాయి. దీంతో నిత్యం జన, వాహన రాకపోకలు ఎక్కువగా ఉంటాయి. దీనిని గమనించిన అసిస్టెంట్ సిటీ ప్లానర్ పబ్లిక్ రోడ్డుపై ఆక్రమణలు ఉండకూ డదని, మూడు రోజుల్లోగా స్వచ్ఛందంగా బంకులు తొలగించుకోవాలని లేకపోతే తొలగిస్తామని బంకుల నిర్వాహకులకు నోటీసులు ఇచ్చారు. దీంతో బంకుల యజమానులు ఓ ఎమ్మెల్యేను ఆశ్రయించారు. దీంతో రాజకీయ ఒత్తిడితో ఆ బంకులు తొలగింపు విషయాన్ని అసిస్టెంట్ సిటీ ప్లానర్ ఉపసంహరించుకున్నట్లు సమాచారం.

విద్యుత్ బిల్లులు తగ్గించాలి

● సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా
● కరెంటు బిల్లుల ప్రతులు దహనం



విద్యుత్ భవన్ వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం శ్రేణులు

నెల్లూరు(వైద్యం), మార్చి 21(ఆంధ్రజ్యోతి): పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తే నెల్లూరు నగరంలోని విద్యుల్ భవన్ ఎదుట సీపీఎం నెల్లూరు రూరల్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా చేశారు. కరెంటు బిల్లులు దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు, కొండా ప్రసాద్‌లు మాట్లాడారు. ట్రూ అప్, ఇంధన సర్దుబాటు చార్జీలు, స్మార్ట్‌మీటర్లు రద్దు చెయ్యాలని డిమాండ్ చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో కరెంటు చార్జీలు పెరిగితే ఈ భారాలు దుర్మార్గమని టీడీపీ గగ్గోలు పెట్టిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కరెంటు చార్జీల భారాన్ని ప్రజలపై మోపిందన్నారు. గతంలో ఆదానీతో చేసుకున్న సెకీ ఒప్పందంలో రూ.1750 కోట్లు అవినీతి జరిగిందని ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఆ ఒప్పందాన్ని రద్దు చెయ్యాలని డిమాండ్ చేశారు. అనంతరం విద్యుత్‌శాఖ ఎస్ఈకి వినతిపత్రం అందించారు.

● పారిశుధ్య సమస్య, దోమల నివారణ, కుళాయిల్లో కలుషిత నీరు తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బాలాజీనగర్ సచివాలయం ఎదుట సీపీఎం నేతలు ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, ప్రసాద్, సూర్యనారాయణ, పెంచల నర్సయ్య, రఫీ అహ్మద్, మాలకొండయ్య, షాహినా బేగం, సుధీర్, పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

మే 20 నాటికి 303 పనుల ప్రారంభం

● నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి



పార్టీ శ్రేణులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరురూరల్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మే 20వ తేదీ నాటికి ఎట్టిపరిస్థితుల్లోనూ 303 ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు ప్రారంభించాలని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి స్పష్టం చేశారు. పనులు జరుగుతున్న ప్రాంతాల్లోని పార్టీ శ్రేణులతో శుక్రవారం తన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుకున్న లక్ష్యం చేరుకోవడంలో నాయకులు, కార్యకర్తలు పూర్తి బాధ్యతలు తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షిస్తూ పురోగతిలో వేగం పెరిగేందుకు దోహదపడాలని సూచించారు. ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ కార్యక్రమంలో పార్టీ నాయకత్వం బలంగా పని చేయాలన్నారు. ఎక్కడైన ఇబ్బందులు, లోపాలు తలెత్తితే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ నందిమండలం భానుశ్రీ, వివిధ ప్రాంతాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

● 23 నుంచి గడప గడపకు గిరిధర్‌రెడ్డి

స్థానిక సమస్యలు తెలుసుకుని, తక్షణ పరిష్కారమే అజెండాగా టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి నిర్వహించ తలపెట్టిన 'గడప గడప'కు కార్యక్రమం ఈ నెల 23 నుంచి మలి విడత మొదలై ఏప్రిల్ 23వ తేదీ జరుగుతుంది. 1వ డివిజన్ కోడూరుపాడులో మొదలై 2, 12 డివిజన్లలో గడప గడపను పలకరించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదలయింది.

సాగునీటి వసతి కల్పించండి

● కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి విడవలూరు ఎస్సీ రైతులు, మహిళల వినతి



ప్రశాంతిరెడ్డిని కలిసి మాట్లాడుతున్న విడవలూరు మండల ఎస్సీ రైతులు

నెల్లూరు(హరనాథపురం), మార్చి 21(ఆంధ్రజ్యోతి): గత తెలుగుదేశం ప్రభుత్వంలో తమకిచ్చిన భూములకు సాగు నీటి వసతి కల్పించాలని విడవలూరు మండలం ఊటుకూరు, కంచెర్లపాలెం ఎస్సీ రైతులు, మహిళలు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిని కోరారు. ఈ మేరకు శుక్రవారం నగరంలోని ఆమె నివాసానికి వచ్చి వినతిపత్రం అంద జేశారు. కంపచెట్లతో అడవిని తలపిస్తున్న తమ భూమిలో జంగిల్ క్లియరెన్స్ తో పాటు బోర్ల ద్వారా సాగునీటి వసతి కల్పిం చాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే ఆ భూ ములకు హద్దులు చూపించాలని తహసీల్దా రును ఆదేశించారు. వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా జంగిల్ క్లియరెన్స్ చేయిస్తామని హామీ ఇచ్చారు.

● బుచ్చిరెడ్డిపాళెం మండలం దామరమడుగు గ్రామం ఆర్ఆర్ నగర్, గుంటకట్ట ప్రాంతానికి చెందిన 100 మందికిపైగా ముస్లిం మహిళలు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిని నగరంలోని ఆమె నివాసంలో కలిశారు. మూడేళ్ల నుంచి నెలకొన్న రేషన్ సరు కుల సమస్యను పరిష్కరించినందుకు కృతజ్ఞత లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దామరమ డుగు టీడీపీ నాయకులు జగదీష్, జెట్టి రాజ గోపాల్‌రెడ్డి, బెజవాడ వంశీకృష్ణారెడ్డి, కేవీ శేషయ్య, మైనారిటీ నాయకులు రియాజ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు దేవదాయ శాఖ మంత్రి ఆనం రాక

నెల్లూరు(సాంస్కృతికం), మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి శనివారం ఉదయం తాడేపల్లి నుంచి బయలుదేరి మధ్యాహ్నం నెల్లూరుకు చేరుకుని స్థానిక కార్యక్రమాలలో పాల్గొంటారు. రాత్రి బస చేస్తారు. 23వ తేదీ ఉదయం 9గంటలకు నెల్లూరు నుంచి బయలుదేరి ఆత్మకూరు ఆర్అండ్‌బీ అతిథిగృహంకు చేరుకుంటారు. 10గంటలకు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో కలిసి ఎలక్ట్రిక్ ట్రై సైకిళ్ల పంపిణీ, సాయంత్రం 4గంటలకు ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాల పనితీరుపై సమీక్ష చేస్తారు. రాత్రికి నెల్లూరు చేరుకుని బస చేస్తారు. 24వతేదీ ఉదయం నెల్లూరు మూలాపేటలోని వేణుగోపాలస్వామి దేవాలయం బోర్డు మీటింగ్‌లో పాల్గొంటారు. సాయంత్రం నెల్లూరు నుంచి తాడేపల్లికి వెళతారు.

ఏపీకి నిధుల కేటాయింపు వివరించండి

● లోక్‌సభలో ప్రశ్నించిన ఎంపీ వేమిరెడ్డి

నెల్లూరు(హరనాథపురం), మార్చి 21(ఆంధ్రజ్యోతి): సక్షం అంగన్‌వాడీ, పోషణ్ అభియాన్ 2.0 కింద ఆంధ్రప్రదేశ్‌కు నిధుల కేటాయింపు వివరించాలని నెల్లూరు పార్లమెంటు సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం లోక్‌సభలో ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వాల నుంచి స్వీకరించిన ప్రతిపాదనల ఆధారంగా మిషన్ పోషణ్ 2.0 కింద ఆయా రాష్ట్రాలకు 2023-24లో రూ.705.68 కోట్లు, 2024-25లో ఫిబ్రవరి చివరికి రూ.521.79 కోట్లు కేటాయించామని సమాధానం ఇచ్చారు.

● మంత్రి ఫరూక్ సతీమణి షహనాజ్ మృతికి ఎంపీ సంతాపం

రాష్ట్ర న్యాయ, మైనారిటీ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎన్ఎండీ.ఫరూక్ సతీమణి షహనాజ్ మృతికి నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు దేవుడు మనోధైర్యం ఇవ్వాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు రెడ్‌క్రాస్ చేయూత



బాధితులకు టార్పాలిన్ పట్ట, నిత్యావసరాలు అందజేస్తున్న రెడ్‌క్రాస్ సిబ్బంది

నెల్లూరు(వైద్యం), మార్చి 21(ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరంలోని దనదయాళ్ నగరలో శుక్రవారం అగ్ని ప్రమాదానికి గురైన మానికల సంజీవమ్మ కుటుంబానికి ఇండియన్ రెడ్‌క్రాస్ చేయూతనందించింది. రెడ్‌క్రాస్ పాలక మండలి చైర్మన్ వాకాటి విజయకుమార్‌రెడ్డి సూచనల మేరకు రెడ్‌క్రాస్ విపత్తుల నిర్వాహణ విభాగం బాధితురాలిని కలిసి టార్పాలిన్ పట్ట, నిత్యావసరాలు, వంట సామగ్రి, దోమ తెరలు అందచేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ కవితా దినోత్సవం



నిర్వేదం నవల రచయిత సాగర్‌ను సన్మానిస్తున్న చిన్ని నారాయణరావు, కవులు, తదితరులు

నెల్లూరు(సాంస్కృతికం), మార్చి 21(ఆంధ్రజ్యోతి): చిన్ని నారాయణ రావు సాహితీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ కవితా దినోత్సవం శుక్రవారం స్థానిక టౌన్‌హాల్ రీడింగ్ రూమ్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో కవి సమ్మేళనం, సాగర్ శ్రీరామ కవచం నిర్వేదం నవలను ఆవిష్కరించారు. చిన్ని నారాయణ ఫౌండేషన్ తరఫున అనేక కార్యక్రమాలు భవిష్యత్తులో నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమానికి మెట్టు రామచంద్ర ప్రసాద్ అధ్యక్షత వహించారు. సభ నిర్వహణ గోవిందరాజు సుభద్ర దేవి నిర్వహించారు. ఆత్మీయ అతిథులు అవ్వారు శ్రీధర్‌బాబు, పాతూరి అన్నపూర్ణ, కవితా దినోత్సవంపై మాట్లాడారు. నవలా రచయిత శ్రీరామకవచనం సాగర్‌ను అతిథులు సన్మానించారు. కవి సమ్మేళనంలో 40 మంది కవులు పాల్గొన్నారు.

కండలేరు నీటిమట్టం 49.900 టీఎంసీలు

రాపూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఉన్న కండలేరు జలాశయం పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 68 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటి మట్టం 49.900 టీఎంసీలు ఉందని కండలేరు డ్యాం ఏఈ కట్ట తిరుమలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. సోమశిల, ఇతర కాలువల నుంచి ఇన్‌ఫ్లో ఆగిపోగా, అవుట్‌ఫ్లో 700 క్యూసెక్కులుగా ఉందని తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి 610 క్యూసెక్కులు, లో లెవల్ స్లూయిస్ ద్వారా 10 క్యూసెక్కులు, హై లెవల్ కెనాల్ ద్వారా 80 క్యూసెక్కులు చొప్పున మొత్తం 700 క్యూసెక్కులు నీరు అవుట్‌ఫ్లో అవుతుందని ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
తిరుపతి
జిల్లా వార్తలు
శనివారం 22 మార్చి 2025

తిరుమలలో చంద్రబాబు కుటుంబం



నుదుట తిరునామం.. తళతళ మెరిసే సరిగ పంచె, లాల్చీ.. మెడలో పట్టు కండువా.. సంప్రదాయ వస్త్రధారణతో తాతా మనవళ్లు ఇద్దరూ శుక్రవారం తిరుమలలో సందడి చేశారు. చిరునవ్వులతో భక్తులకు అన్నం వడ్డించారు. నారా దేవాన్ష్ 11వ పుట్టినరోజున ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న చంద్రబాబు కుటుంబం, అనంతరం వెంగమాంబ అన్నప్రసాద కేంద్రంలో భోజనాలు వడ్డించారు. దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా ఒక్కరోజు అన్నప్రసాద వితరణకు అయ్యే రూ.44 లక్షల విరాళాన్ని టీటీడీకి అందజేశారు. ఏటా ఈ సంప్రదాయాన్ని చంద్రబాబు కుటుంబం పాటిస్తోంది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

అన్నం వడ్డించి.. ఆప్యాయంగా పలకరించి..

దేవాన్ష్ పుట్టినరోజు సందడి



శ్రీవారి ఆలయంలో సీఎం చంద్రబాబు కుటుంబ సభ్యులతో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి

సీఎం చంద్రబాబుతో పాటూ ఆయన సతీమణి భువనేశ్వరి, కుమారుడు, మంత్రి లోకేశ్, కోడలు బ్రాహ్మణి, దేవాన్ష్ ఉదయం 8.30గంటలకు శ్రీవారి ఆలయంలోకి ప్రవేశించారు. సీఎం హోదాలో మహద్వారం నుంచి ఆలయంలోకి వెళ్లే అవకాశమున్నప్పటికీ చంద్రబాబు ఎప్పటిలానే వైకుంఠం క్యూకాంప్లెక్స్ ద్వారానే దర్శనానికి వెళ్లారు. ఉదయం 8.28 గంటలకు మహద్వారం వద్దకు చేరుకున్న సీఎంకు టీటీడీ అధికారులు, అర్చకులు మంగళవాయిద్యాలతో స్వాగతం పలికారు. దర్శనం తర్వాత రంగనాయక మండపంలో వేదాశీర్వచనం అందుకుని 9.19 గంటలకు ఆలయం వెలుపలకు వచ్చారు. దాదాపు 40 నిమిషాల పాటు సీఎం కుటుంబం ఆలయంలో గడిపింది.అంతకు అరగంట ముందే ఏర్పాట్ల పర్యవేక్షణకు టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి ఆలయంలోకి వెళ్లారు. సీఎం రాకకు ముందే టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు కూడా ఆలయంలోకి వెళ్లారు. మంత్రి అనగాని సత్యప్రసాద్, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి కూడా వైకుంఠం కాంప్లెక్స్ ద్వారా ముందే ఆలయంలోకి వెళ్లారు. సీఎం కుటుంబం ఆలయంలోకి వెళ్లిన తర్వాత తిరుపతి, చంద్రగిరి, చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, పులివర్తి నాని, గురజాల జగన్మోహన్, మురళీ మోహన్ లోపలికి వెళ్లారు. ఆ తర్వాత మాజీ కేంద్రమంత్రి పనబాక లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ,టీడీపీ నాయకులు నరసింహ యాదవ్, కోడూరు బాలసుబ్రహ్మణ్యం, ఊకా విజయకుమార్, జేబీ శ్రీనివాసులు, శ్రీధరవర్మ, అన్నా రామచంద్రయ్య, అనితా యాదవ్, హేమాంబరధర నాయుడు,బుల్లెట్ రమణ, కృష్ణయాదవ్ తదితరులు ఆలయంలోకి ప్రవేశించారు.

అన్నప్రసాదాలు వడ్డిస్తూ..

శ్రీవారి దర్శనం అనంతరం ఉదయం 9.25గంటల ప్రాంతంలో చంద్రబాబు కుటుంబం వెంగమాంబ అన్నప్రసాదానికి చేరుకుంది. తొలుత వేంకటేశ్వర స్వామి పటం వద్ద పూజలు నిర్వహించారు.ముఖ్యమంత్రిననే హోదాను పక్కనబెట్టి మనవడికి అన్నదానం ప్రాధాన్యాన్ని వివరిస్తూ, చంద్రబాబు అన్నదాన సత్రంలో భక్తుల విస్తర్లలో అన్నప్రసాదాలను వడ్డించారు. దేవాన్ష్, చంద్రబాబు, లోకేశ్, భువనేశ్వరి, బ్రాహ్మణిలు భక్తులకు బెల్లం పొంగలి, మసాలా వడలను అరిటాకుల్లో వడ్డించారు. ఈ సమయంలో భక్తులతో కలుపుగోలుగా మాట్లాడారు. ఎక్కడి నుంచి వచ్చారు, అన్నప్రసాదాలు ఎలా ఉన్నాయి, ఏవైనా సమస్యలున్నాయా అని అడుగుతూ సీఎం అన్నప్రసాదాలను వడ్డించారు. అన్నప్రసాదాలు చాలా రుచిగా ఉన్నాయంటూ భక్తులు సీఎంతో సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం సీఎం కూడా కుటుంబ సభ్యులతో కలిసి అరిటాకుల్లో వడ్డించిన అన్నప్రసాదాలను స్వీకరించారు.

సీఎం వెంట టీటీడీ బోర్డు

తిరుమల పర్యటనలో సీఎం కుటుంబం వెంట టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడు సహా పలువురు బోర్డు సభ్యులున్నారు. బోర్డు సభ్యులు సుచిత్ర ఎల్లా, శాంతారాం, భానుప్రకాష్‌రెడ్డి, నరేష్, పనబాక లక్ష్మి, నర్సిరెడ్డి ఈ క్యార్యక్రమంలో ఉన్నారు. ఆరణి మదన్, పులివర్తి వినీల్ అన్నదాన సత్రంలో సీఎం కుటుంబంతో పాటు ఉన్నారు.

గట్టి భద్రత - మాడవీధులు నిర్మానుష్యం

మరోవైపు సీఎం పర్యటనలో తిరుమలలో కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. శ్రీవారి ఆలయ ప్రాంతం, మాడవీధులు రెండు గంటల పాటు నిర్మానుష్యంగా మారాయి.ఎక్కడికక్కడ గేట్లు వేయడంతో ఒకప్రాంతం నుంచి మరొకప్రాంతానికి వెళ్లే భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సీఎం ఆలయంలోకి వెళ్లిన తర్వాత కూడా అరటిమానులు, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్‌లో బాంబ్ స్క్వాడ్ బృందాలు తనిఖీ చేశాయి. మీడియాను కూడా గొల్లమండపానికే పరిమితం చేశారు. కాగా అన్నదాన వితరణ అనంతరం అతిథిగృహానికి చేరుకున్న సీఎంను కలిసేందుకు తిరుపతి, తిరుమల టీడీపీ కార్యకర్తలు భారీగా అక్కడికి చేరుకున్నారు. భద్రతా కారణాలతో వీరిని పోలీసులు అడ్డుకోవడంతో బయటే ఉండిపోవాల్సి వచ్చింది. అయితే తిరుగు ప్రయాణంలో సీఎం చంద్రబాబు కార్యకర్తలను చూసి కాన్వాయ్ నుంచి కిందకు దిగి వినతిపత్రాలు అందుకున్నారు. పులువురిని ఆప్యాయంగా పలకరించారు. అందరికీ అభివాదం చేస్తూ తిరుమల నుంచి తిరుగు ప్రయాణమయ్యారు.



మూడు నెలలు గుడి మూసేయాలన్నారు

● తిరుమలలో నీటి ఎద్దడి రోజులను గుర్తుచేసిన సీఎం

'గతంలో తిరుమలలో నీళ్ల సమస్య తీవ్రంగా వచ్చింది. మూడు నెలల పాటు శ్రీవారి ఆలయాన్ని మూసివేయడం తప్ప మరో దారి లేదని అధికారులు నాతో చెప్పారు. నాకు చాలా కోపం వచ్చింది. 'ఆలయాన్ని మూసివేయడం ఏంటయ్యా, మీకేమైనా పిచ్చిపట్టిందా?' అని కోప్పడ్డాను. రోజుకు 600 నుంచి 800 ట్యాంకర్లను భక్తుల రాకపోకల మధ్య తిరుమలకు తీసుకొచ్చే పనులు చేయలేం అని అధికారులు నాతో అన్నారు. నేను అంగీకరించలేదు. కల్యాణిడ్యాం నుంచి తిరుమలకు నీళ్ల తీసుకువచ్చేలా పైప్‌లైన్ ఏర్పాటు చేయాలనీ, అదీ 90 నుంచి 95 రోజుల్లో జరగాలని ఆదేశించా. లేకుంటే అరెస్ట్ చేస్తానని కూడా చెప్పా. దేవుడి కోసం కాబట్టి అందరినీ పిలిచి.. 'ఉన్న డబ్బులు ఇవే. పూర్తి చేయండి అని కోరా. ఎల్‌అండ్‌టీ ముందుకొచ్చింది. అనుకున్న సమయానికి కళ్యాణి డ్యాం నుంచి తిరుమలకు పైప్ లైన్‌లు వేసింది. అంతే కళ్యాణి నీళ్ల తిరుమల కొండ మీదకి ఎక్కాయి.' అని ఒకనాటి రోజులను సీఎం చంద్రబాబు గుర్తు చేసుకున్నారు.తిరుపతి, తిరుమలలో నీటి సమస్యను పరిష్కరించేందుకు కండలేరు నీటి ప్రాజెక్ట్ సామర్థ్యాన్ని పెంచుతారా అని మీడియా ప్రతినిధుల ప్రశ్నకు బదులిస్తూ.. 'తిరుమలకు నీళ్ల తీసుకురావడం పెద్ద సమస్యేమీ కాదు. సోమశిల, కండలేరు, బాలాజీ రిజర్వాయర్ ఉంది. కల్యాణి డ్యాం నుంచి కూడా తిరుమలకు నీళ్లు తీసుకుంటున్నాం. మల్లిమడుగు కూడా వస్తే తిరుపతికి నీటి సమస్య ఉండదు' అన్నారు. అసలు చరిత్ర ఏంటో మీరు తెలుసుకోవాలి. యువతరానికి కూడా మనం తెలియజేయాలి. తిరుపతిలో నీళ్ల లేక నిత్యం సమస్యలు ఏర్పడుతున్న క్రమంలో తెలుగు గంగను నేనే తీసుకొచ్చా అని వివరించారు.

ఎమ్మెల్యే కారును ఢీకొన్న వ్యాన్

సీఎం కాన్వాయ్‌లోని ఓ వ్యాన్ తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కారును ఢీకొంది. సీఎం చంద్రబాబు తిరుగు ప్రయాణంలో పద్మావతి అతిథిగృహం వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. కాన్వాయ్‌తో సీఎం వాహనం ముందు వెళ్లిపోగా వెనుక వస్తున్న ఈవో కారు ఆగింది. వెనుకే వస్తున్న ఎమ్మెల్యే కారు వేగాన్ని అదుపుచేస్తూ బ్రేక్ వేయడంతో వెనుక ఉన్న వ్యాన్ వేగంగా వచ్చి ఢీకొంది. ఈ క్రమంలోనే ఎమ్మెల్యే కారు కూడా ఈవో కారును ఢీకొంది. ఇదే సమయంలో స్వల్పంగా పొగలు కూడా రావడంతో భద్రతాసిబ్బంది ఉలిక్కిపడ్డారు. వాహనం వద్దకు పరుగులపై చేరుకున్నారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కారు వెనుకభాగం స్వల్పంగా దెబ్బతింది. ఆ వెంటనే కారు అక్కడి నుంచి వెళ్లిపోయారు.



● ప్రముఖ ఆసుపత్రులచే సిద్ధమైన హెల్త్ స్టాల్స్
● ఉచితంగా వైద్యసేవలు, మందుల పంపిణీ

తిరుపతి ఇందిరా మైదానంలో నేడు, రేపు హెల్త్‌మీట్

ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ఆధ్వర్యంలో వైద్యజ్యోతి పేరిట నేడు, రేపు మెగా హెల్త్‌మీట్ జరగనుంది. తిరుపతి తుడా కార్యాలయం సమీపంలోని ఇందిరా మైదానంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉదయం పదిన్నర గంటలకు కలెక్టర్ వెంకటేశ్వర్ వైద్యజ్యోతి ఆరోగ్య శిబిరం ప్రారంభించనున్నారు. శని, ఆదివారాల్లో జరిగే హెల్త్ మీట్‌లో నగరం లోని పలు ప్రసిద్ధ ఆసుపత్రులు, హెల్త్ స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నాయి. ఆయా ఆసుపత్రుల్లో లభించే వైద్యసేవలు వివరిస్తారు. ప్రజలకు ఆరోగ్య అవగాహన కలిగిస్తారు. రెండు రోజుల పాటు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు జరిగే వైద్యజ్యోతిలో రోగులను పరీక్షించి, అవసరమైన ప్రాథమిక వైద్య పరీక్షలు ఉచితంగా చేస్తారు. అదేవిధంగా కొన్నిరకాల మందులను కూడా ఉచితంగా అందించనున్నారు.



హెల్త్‌మీట్‌లో ఉచిత వైద్య సేవలు : వెంకటరమణ గుండె, మెటర్నిటీ హాస్పిటల్ స్టాల్‌లో ఈసీజీతో పాటు గుండె సంబంధిత వైద్య పరీక్షలు, తగు సూచనలు ఇస్తారు. మనోహరి రామచంద్ర హాస్పిటల్, అంకుర హాస్పిటల్స్ వారు గర్భిణులు, తల్లి కావాలనుకునే మహిళలకు ఆరోగ్య సలహాలు ఉచితంగా ఇస్తారు. గర్భం దాల్చిన తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలు, గర్భస్థ శిశువుల ఆరోగ్య మెలకువలను వివరిస్తారు. ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్ వారు ఆర్థోపెడిక్ వ్యాధులపై అవగాహన కల్పిస్తారు. ఇంకా డీఎన్‌ఆర్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి, యష్ హాస్పిటల్స్, శ్రీసాయి సుధా మల్టీస్పెషాలిటీ హాస్పిటల్, డీబీఆర్ అండ్ ఎస్కే క్యాన్సర్ సెంటర్, మెడిగో హాస్పిటల్స్, సన్‌ప్రైమ్ మల్టి స్పెషాలిటీ హాస్పిటల్స్ వివిధ వ్యాధులకు సంబంధించి వైద్య పరీక్షలు చేయడంతో పాటూ, తగు సలహాలు, సూచనలు చేస్తారు. కాకర్ల డెంటల్ హాస్పిటల్, క్రిష్ణతేజ డెంటల్ హాస్పిటల్స్ వారు దంత సంబంధిత సమస్యలు, అధునాతన దంత వైద్యంపై అవగాహన కల్పించనున్నారు. ఈ కార్యక్రమానికి బసవ తారకం క్యాన్సర్ ఆస్పత్రి చైర్మన్, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ (ఎన్‌బీకే) ఫ్యాన్స్ అసోసియేషన్ నాయకులు పి.మనోహర్ రెడ్డి, కెపి చౌదరిలు ప్రధాన స్పాన్సర్‌లుగా వ్యవహరిస్తుండగా సీపీఆర్ కనస్ట్రక్షన్స్ వారు కో స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి, తిరుపతి

నగరవనంలో చిరుత



మంగళం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరం కపిలతీర్థంవద్ద గల నగరవనంలో శుక్రవారం చిరుత సంచరించింది. ఉదయం 11 గంటల సమయంలో వంతెనపై సేదతీరుతూ ఉండగా సందర్శకులు చూసి భయాందోళనకు గురయ్యారు. వీరి సమాచారంతో అటవీశాఖ అధికారులు అక్కడికి చేరుకుని చిరుతను గమనించారు. కొద్దిసేపటికి చిరుత అటవీప్రాంతంలోకి వెళ్లిపోయింది. నగరవనంలో చిరుత కదలికలను గుర్తించేందుకు ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేయనున్నట్లు అటవీశాఖ అధికారి రమేష్ తెలిపారు. చిరుత సంచారం నేపథ్యంలో నగరవనాన్ని తాత్కాలికంగా మూత వేస్తున్నామని చెప్పారు.



సుకుమారి, డీఎస్పీ, పీటీసీ - బాలిరెడ్డి, డీఎస్పీ, ఎర్రచందనం - శ్రీనివాస రెడ్డి, డీఎస్పీ, ఎర్రచందనం - రమణయ్య, ఫైర్ అధికారి - భాస్కర్ అలిపిరి ఏఎస్ఐ

పోలీస్ సేవలకు పతకాలు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న పోలీసు, ఇంటెలిజెన్సు, అగ్నిమాపక, ఎర్రచందనం టాస్క్‌ఫోర్సు అధికారులు, సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం వివిధ సేవా పతకాలు ప్రకటించింది. ఎస్పీ నుంచి కానిస్టేబుళ్ల వరకు ఉత్తమ సేవా, సేవా, కఠిన సేవా పతకాలు లభించాయి. ఏటా ఈ పతకాలను ప్రభుత్వం ప్రకటించడం ఆనవాయితీ. ఎంపికైన వారిని ఉన్నతాధికారులు అభినందించారు.

● కఠిన సేవా పతకం కింద తిరుపతి ఎర్రచందనం విభాగంలోని కానిస్టేబుల్ వీఎస్ సోమశేఖర్ ఎంపికయ్యారు.



శ్రీనివాస్, ఎస్పీ, ఎర్రచందనం - వెంకటరాముడు, అదనపు ఎస్పీ, ఇంటెలిజెన్సు - వెంకట్రావు, అదనపు ఎస్పీ అడ్మిన్, ఎస్పీ కార్యాలయం - వినోద్‌కుమార్, సీఐ, సైబర్ క్రైం

ఉత్తమ సేవా పతకాలు వీరికే

తిరుపతి పీటీసీ డీఎస్పీ కె.సుకుమారి, ఎర్రచందనం టాస్క్‌ఫోర్సు డీఎస్పీలు శ్రీనివాసరెడ్డి, బాలిరెడ్డి, జిల్లా అగ్నిమాపక శాఖ సహాయ సంచాలకుడు జె.రమణయ్య, ఎస్పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్‌గా మాణిక్యాలరావు, అలిపిరి ఏఎస్ఐ జి.భాస్కర్.

వీరికి సేవా పతకాలు

ఎర్రచందనం టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్, జిల్లా పోలీసు కార్యాలయంలో అడ్మిన్ ఏఎస్పీ వెంకట్రావు, ఇంటెలిజెన్సు ఏఎస్పీ వెంకటరాముడు, తిరుపతి సైబర్ క్రైం సీఐ వినోద్ కుమార్, వెంకటగిరి ఏపీఎస్పీలో ఆర్ఐ శ్రీనివాస రెడ్డి, ఆర్ఎస్ఐ పి.రాంబాబు, వెంకటగిరిలో ఆర్ఐ జాలయ్య, ట్రాఫిక్‌లో పనిచేస్తున్న మణిగండన్, వెస్ట్ పీఎస్‌లో ఏఎస్ఐ ఎల్.మునిరత్నం నాయుడు, తడ ఏఎస్ఐ శ్రీకుమార్ రెడ్డి, భాకరాపేట హెడ్ కానిస్టేబుల్ వెంకటసిద్దారెడ్డి, తిరుపతి రిజర్వు హెడ్ కానిస్టేబుల్ ఏడుకొండలు, ఎస్వీయూ పీఎస్ కానిస్టేబుల్ వెంకటరమణయ్య, రిజర్వు హెడ్ కానిస్టేబుళ్లు బ్రహ్మానాయక్, రమేష్‌బాబు, తిరుపతి వెస్ట్ నిర్మల, హెడ్ కానిస్టేబుల్ మల్లికార్జునరావు, రిజర్వు హెడ్ కానిస్టేబుల్ ప్రసన్న ఆంజనేయులు ఉన్నారు. అగ్నిమాపక శాఖ నుంచి తిరుపతి స్టేషన్ ఫైర్ అధికారి మస్తాన్, వెంకటగిరి వి.నారాయణ, ఎస్పీఎఫ్ విభాగం హెడ్ కానిస్టేబుల్ గోపాల్ నాయుడు, టీటీడీలో ఎస్ఐగా పనిచేస్తున్న నాగభూషణరావు, ఏఎస్ఐ రామచంద్రయ్య, దేముడు బాబు, హెడ్ కానిస్టేబుల్ నాగేశ్వరరావు, శ్రీకాళహస్తి ఆలయంలో హెడ్ కానిస్టేబుల్ డి.మురళి, కె.శేఖర్ రెడ్డి, బీవీఆర్ ప్రసాద్ ఎంపికయ్యారు.

కలెక్టరేట్‌కు బాంబు బెదిరింపు

● ఫేక్‌గా తేల్చిన పోలీసులు ● హైరానాపడ్డ ఉద్యోగులు

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్‌కు బాంబు బెదిరింపు వచ్చింది. హార్థిక్ పీటర్స్ అనే వ్యక్తి మెయిల్ ఐడీ నుంచి కలెక్టర్ వెంకటేశ్వర్ అధికార మెయిల్ ఐడీకి శుక్రవారం ఓ సందేశం వచ్చింది. కలెక్టరేట్‌లో బాంబు పెట్టినట్లు మెసేజ్ ఉండడంతో కలెక్టర్ ఎస్పీ హర్షవర్ధనరాజుకు సమాచారం ఇచ్చారు. సాయంత్రం 5.30 గంటలకు అడిషనల్ ఎస్పీ రవి మనోహరాచారి నేతృత్వంలో బాంబ్, డాగ్ స్క్వాడ్ బృందాలు కలెక్టరేట్‌కు చేరుకుని సెల్లార్ నుంచి ఏడవ అంతస్తు వరకు 2 గంటల పాటు తనిఖీలు చేశారు. బాంబు ఆనవాళ్లు దొరక్కపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. పోలీసుల తనిఖీలతో ఉద్యోగులు, అధికారులు కొంతసేపు హైరానాపడ్డారు. గతంలో పలు హోటళ్లకు సైతం ఇలాంటి బెదిరింపులు వచ్చిన విషయం విదితమే. వరుసగా ఫేక్ మెసేజ్ చేస్తున్న ఆగంతుకుడి వివరాల కోసం పోలీసులు ఆరా తీస్తున్నారు. తిరుచానూరు సీఐ సునీల్‌కుమార్, సిబ్బంది ఈ తనిఖీల్లో పాల్గొన్నారు.



కలెక్టరేట్ పరిసరాలను తనిఖీ చేస్తున్న డాగ్, బాంబ్ స్క్వాడ్

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నేషనల్‌గా స్విమ్స్!

● పరిశీలించాలంటూ సీఎంకు వినతి



తిరుమల, ఆంధ్రజ్యోతి: రాయలసీమకే తలమానికమైన స్విమ్స్ ఆస్పత్రిని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నేషనల్ ఇంపార్టెన్స్‌గా పరిగణించే అంశంపై పరిశీలించాలని టీటీడీ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి సీఎం చంద్రబాబును కోరారు. శ్రీవారి దర్శనం అనంతరం తిరుమలలోని పద్మావతి అతిథిగృహంలో సీఎంను కలిసిన ఆయన అందుకు సంబంధించిన ప్రాజెక్ట్ నివేదికను అందజేశారు. దీనిపై బోర్డులో తీర్మానం కూడా చేసి ప్రభుత్వానికి పంపామని తెలిపారు.

సాంకేతిక లోపంతో ఆగిన మెమూ రైలు

దొరవారిసత్రం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): చెన్నై నుంచి నెల్లూరు వెళ్తున్న మెమూ రైలు ఇంజన్‌లో ఏర్పడిన సాంకేతిక లోపంతో శుక్రవారం సాయంత్రం దొరవారి సత్రం మండలం కలగుంట సమీపంలో ఆగిపోయింది. దీంతో ఆ మార్గంలో చెన్నై నుంచి విజయవాడ వైపు వెళ్లే పలు రైళ్లను నిలిపివేశారు. రాత్రి 7గంటలకు ధన్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌కున్న మరో ఇంజిన్‌ను తీసుకెళ్లి ఆగిపోయిన మెమూ రైలును దొరవారిసత్రం రైల్వేస్టేషన్‌కు తీసుకెళ్లి లూప్‌లైన్‌లో ఉంచారు. తరువాత రాత్రి 7:30 గంటల తరువాత రైళ్ల రాకపోకలు యధావిధిగా కొనసాగాయి.



కలగుంట సమీపంలో ఆగిపోయిన మెమూ రైలు

సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 18 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.3.71 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 58,872

తలనీలాలు సమర్పించినవారు: 23,523





| పల్లెలకు నిరంతరం.. రక్షిత మంచినీళ్లు అందించడమే లక్ష్యం |

నీళ్లే జీవం. నీళ్లే అభివృద్ధికి మూలం. అలాంటి మంచినీటి ప్రాముఖ్యతపై దృష్టి కేంద్రీకరించడానికి, నీటి వనరుల నిర్వహణపై చర్చించడానికి.. ఏటా మార్చి 22న ప్రపంచ నీటి దినోత్సవం నిర్వహిస్తుంటారు.

- తిరుపతి(జీవకోన), ఆంధ్రజ్యోతి

తాగే నీళ్లు బాగుంటే.. చాలావరకు అనారోగ్య సమస్యలు దూరమైనట్లే. అందుకనే ప్రభుత్వం రక్షిత మంచి నీటి సరఫరాకు చర్యలు చేపట్టింది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికీ కొళాయి ద్వారా శుద్ధి నీటిని అందించే లక్ష్యంతో జల్‌జీవన్ మిషన్ తీసుకొచ్చింది. దీనికి ప్రస్తుత ప్రభుత్వం సమూల మార్పులు చేస్తోంది. కొళాయిల ద్వారా 365 రోజులూ తాగునీరు సరఫరా అయ్యేలా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. సమీప జలాశయాలు, నదుల నుంచి పైపులైన్ల ద్వారా నీటిని తరలించి వేసవిలోనూ ప్రజలకు నీటిని సరఫరా చేసేలా డిజైన్లను మార్పుతోంది. రాష్ట్రస్థాయి అంచనాల కమిటీ ఆమోదంతో వాటిని త్వరలో కేంద్రానికి పంపనుంది. ఇక, జిల్లా విషయానికొస్తే.. చంద్రగిరి, నగరి, సత్యవేడు, శ్రీకాళహస్తి, గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలకు సంబంధించి గ్రామీణ ప్రాంతాల్లో 3,67,762 ఇళ్లున్నాయి. ఇందులో 3,45,008 ఇళ్లకు నీటి కనెక్షన్లు ఇచ్చారు. ఇంకా 22,754 నీటి కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంది. గత ప్రభుత్వంలో ఇలా కొళాయి కనెక్షన్లు ఇచ్చారే కానీ పూర్తిస్థాయిలో నీటిని అందించలేదు. జలజీవన్ మిషన్ కింద గత ప్రభుత్వంలో రూ.107.73కోట్లు విడుదల కాగా, రూ.65.32కోట్లు ఖర్చు చేశారు. పూర్తిస్థాయిలో రూరల్ ప్రాంతాలకు నీటిని అందించాలన్న ప్రధాన ఉద్దేశ్యంతో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నీటి సరఫరా అందనని చోట నీరు అందేలా చర్యలు చేపడుతోంది. నీటి సరఫరా అందని పైపులైన్లకు సమీపంలో ఉన్న నీటి వనరుల ద్వారా నీటిని అందిస్తోంది. ఎర్రావారిపాలెం, చిన్నగొట్టిగల్లుతో పాటు 31 మండలాల్లో ఈ కనెక్షన్లు పెండింగ్‌లో ఉన్నాయి. ఇక్కడ తాత్కాలికంగా నీటి సరఫరా జరుగుతోంది. అయినప్పటికీ పూర్తిస్థాయిలో ప్రతిరోజు నీటిని అందించాలనే ఉద్దేశంతో రెండు కొత్త పథకాలకు రూపకల్పన చేస్తున్నారు. గండికోట రిజర్వాయర్, కండలేరు జలాశయాల ద్వారా నిరంతరం నీటిని అందించే ప్రక్రియకు డీపీఆర్‌ను సిద్ధం చేసి సంబంధితశాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు కూడా పంపారు. ఈ ప్రతిపాదనలకు ఆమోదం లభించగానే పనులను చేపట్టి జలజీవన్ మిషన్ ద్వారా పూర్తిస్థాయిలో నీటిని అందించనున్నారు. వేసవిలో ఇబ్బందులు ఏర్పడితే వాటికోసం కూడా కార్యాచరణ ప్రణాళిక తయారు చేసి ప్రభుత్వానికి 215.42లక్షలతో ప్రతిపాదనలు పంపారు.

పూర్తిస్థాయిలో నీటిని అందించాలన్నదే లక్ష్యం

గ్రామీణ ప్రాంతాలకు జలజీవన్ మిషన్ పథకం ద్వారా పూర్తిస్థాయిలో ఇంటింటికి తాగునీటిని అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న కనెక్షన్లకు సంబంధించి ఉన్నతాధికారులు డీపీఆర్ తయారు చేసి ప్రభుత్వానికి పంపారు. ఆమోదముద్ర పడిన వెంటనే గండికోట, కండలేరు జలాశయాల ద్వారా నిరంతరం నీటిని అందించే ప్రక్రియకు ప్రభుత్వం శ్రీకారం చుడుతుంది.

- ఆర్.భాస్కర్‌రెడ్డి, డీఈఈ, ఆర్‌డబ్ల్యూఎస్

ఆపరేషన్ గరుడ

● జిల్లాలో నాలుగు మెడికల్ షాపులపై అధికారుల దాడులు.. ఒకదానిపై కేసు నమోదు



తిరుపతిలోని మందుల దుకాణంలో తనిఖీ చేస్తున్న విజిలెన్సు అధికారులు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 21(ఆంధ్రజ్యోతి): 'ఆపరేషన్ గరుడ' కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని నాలుగు మెడికల్ షాపులపై శుక్రవారం అధికారులు దాడులు నిర్వహించారు. తిరుపతిలో విజిలెన్సు సీఐలు నిరంజన్ నాయుడు, చంద్రశేఖర్ నాయక్ ఆధ్వర్యంలో పోలీసులు, విజిలెన్సు, ఈగల్, డ్రగ్ కంట్రోల్ బృందాలు దాడులు జరిపాయి. తిరుపతి నగరం ప్రకాశం రోడ్డులోని గురుజ్యోతి మెడికల్ షాపులో మత్తుకోసం వాడే 15 రకాల నార్కోటిక్ డ్రగ్స్ మందులను డాక్టర్ల అనుమతి లేకుండా విక్రయిస్తున్నట్లు తనిఖీల్లో బయటపడింది. సేల్ బిల్ వాయిస్‌లు సీజ్ చేసినట్లు సీఐ నిరంజన్ చెప్పారు. ఆ దుకాణంపై కేసు నమోదు చేస్తున్నట్లు విజిలెన్సు ఎస్పీ కరీముల్లా షరీఫ్ తెలిపారు. అలాగే దొడ్డాపురం వీధిలోని హోల్‌సేల్, రిటైల్ సాయి మార్కెటింగ్, అక్కడే ఉన్న సాయి మార్కెటింగ్ మెడికల్స్ అండ్ ఫ్యాన్సీ స్టోరు, రెడ్డి, రెడ్డి కాలనీలోని ఎస్వీ అపోలో ఫార్మసీ మందుల దుకాణాలపై దాడులు చేశారు. ఇక్కడా ఫార్మాసిస్టులు లేకుండా మందులు విక్రయించడం, కొన్ని నార్కోటిక్ మందులను డాక్టర్ల ప్రిస్కిప్షన్ లేకుండా విక్రయిస్తున్నట్లు తనిఖీల్లో బయటపడింది. ఈ దాడులు నిరంతరం కొనసాగిస్తామని విజిలెన్సు ఎస్పీ కరీముల్లా షరీఫ్ చెప్పారు. ఎక్కడైనా నకిలీ మందులు, యువత, మహిళలు, రోగులు, ప్రజలకు మత్తు కలిగించే మందులు అనుమతి లేకుండా స్టాకు ఉంచినా, విక్రయించినా, డాక్టర్ల అనుమతి లేకుండా అక్రమంగా దాచి ఉంచిన మందులు విక్రయాలు జరిపినా తనిఖీలు చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అవసరమైతే మందుల దుకాణాల లైసెన్సులు రద్దు చేయడానికి ప్రభుత్వానికి సిఫార్సు చేస్తామన్నారు.

ఇకపై గంట ముందే పరీక్షా కేంద్రంలోకి అనుమతి

● ఎండ నుంచి ఉపశమనంకోసం నిర్ణయం



చంద్రగిరిలోని ఓ పరీక్షా కేంద్రం బయట ఎండలో వేచిఉన్న పదో తరగతి విద్యార్థులు

తిరుపతి(విద్య), మార్చి 21(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులను ఇకపై గంట ముందే కేంద్రాల్లోకి అనుమతించనున్నారు. ఇప్పటి వరకు అరగంట ముందే అనుమతించేవారు. ఎండల నేపథ్యంలో ఉదయం 8.30 గంటల నుంచే అనుమతించేలా నిర్ణయం తీసుకున్నారు. రోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పదోతగతి పరీక్షలు జరుగుతున్నాయి. విద్యార్థులు ముందుగానే ఆయా కేంద్రాల వద్దకు చేరుకుంటున్నారు. వీరిని అరగంట ముందుగా.. అంటే 9 గంటలకు ఆయా కేంద్రాల్లోకి అనుమతిస్తున్నారు. ముందుగానే వచ్చిన విద్యార్థులు అప్పటి వరకు బయటే ఉంటున్నారు. ఇప్పుడు ఉదయాన్నే ఎండ తీవ్రంగా ఉంటోంది. దీంతో విద్యార్థులు ఎండకు ఇబ్బంది పడుతూ ఉండటాన్ని గమనించిన డీఈవో కేవీఎన్ కుమార్.. గంట ముదుగానే పరీక్ష కేంద్రంలోకి అనుమతించేందుకు నిర్ణయించారు. ఆమేరకు విద్యాశాఖాధికారులకు మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. ప్రశాంతంగా పరీక్షలు రాయాల్సిన విద్యార్థులు ఎండ బారినపడకుండా ఉండేందుకు ఇలా వెసులుబాటు కల్పించామని ఆయన ఆంధ్రజ్యోతికి తెలిపారు.

సత్యవేడులో టెన్త్ విద్యార్థి డీబార్

● ఇన్విజిలేటర్ సస్పెన్షన్

తిరుపతి(విద్య), మార్చి 21(ఆంధ్రజ్యోతి): సత్యవేడులో కాపీయింగ్‌కు పాల్పడుతున్న విద్యార్థిని అధికారులు డీబార్ చేశారు. ఇన్విజిలేటర్ ఎస్.వెంకటేశ్వరరావును సస్పెండ్ చేశారు. శుక్రవారం ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు చేపట్టింది. అనుమానంతో ఓ విద్యార్థిని తనిఖీ చేయగా చిట్టీలు ఉండటతో డిబార్ చేశారు. ఇన్విజిలేటర్‌ను సస్పెండ్ చేశారు. ఈ ఘటన మినహా జిల్లాలో పరీక్షలు ప్రశాంతంగా సాగాయని డీఈవో తెలిపారు.

26,617 మంది హాజరు: జిల్లాలో శుక్రవారం జరిగిన ఆంగ్ల భాషా పరీక్షకు జిల్లావ్యాప్తంగా 26,617 మంది విద్యార్థులు హాజరయ్యారని డీఈవో కుమార్ వెల్లడించారు. రెగ్యులర్ విద్యార్థులు 26,840, ప్రైవేటు విద్యార్థులు 57 మంది పరీక్షలకు హాజరవ్వాల్సి ఉండగా రెగ్యులర్ విద్యార్థులు 252 మంది, ప్రైవేటు విద్యార్థులు 28 మంది గైర్హాజరయ్యారు. ఓపెన్ స్కూల్ విద్యార్థులు 966 మందికిగాను 133 మంది గైర్హాజరయ్యారు.

ఉచితం మాటున ఇసుక అక్రమ రవాణా

బరితెగిస్తున్న మాఫియా

మంగళంపాడు పొలాల్లో గుట్టలు గుట్టలుగా నిల్వలు





మంగళంపాడు పొలాల వద్ద ఇసుక నిల్వలు - ఇసుక అక్రమ రవాణాకు పొలాల్లో ఏర్పరచిన దారి

సూళ్లూరుపేట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో ఇసుక మాఫియా రెచ్చిపోతోంది. ఉచితం మాటున రెండు వారాల నుంచి కాళంగి నదిలో ఇసుక తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. ఇసుక తవ్వేస్తున్నారు. ఇందుకోసం మంగళంపాడు పొలాల్లో దారి ఏర్పరచుకొని దొరవారిసత్రం మండలం ఉచ్చూరు సమీపంలోని గుమ్మడితాగేలి వద్ద కాళంగి నదిలో ఇసుకు తవ్వి నిత్యం ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. రాత్రివేళల్లో పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలించి డంపింగ్ చేసుకొంటున్నారు. అక్కడ నుంచి సమీపంలోని పరిశ్రమలకు, రియల్ ఎస్టేట్ వెంచర్లకు సరఫరా చేసి జేబులు నింపుకొంటున్నారు. వారం రోజుల కిత్రం మంగళంపాడులో కొందరు రైతులు తమ పొలాల మీదుగా ఇసుకను తరలించొద్దని అడ్డు పడ్డారు. పోలీసులకు, ఆర్డీవో కార్యాలయంలో సైతం ఫిర్యాదు చేశారు. దీనిపై తీవ్ర వివాదం నెలకొంది. ఈ నేపథ్యంలో మూడు రోజుల కిత్రం అర్ధరాత్రి పూట ఇసుక మాఫియా నాయకులు ఓ రైతు ఇంటికి వెళ్లి దుర్భాషలాడి దాడిచేసేందుకు ప్రయత్నించారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా నామమాత్రపు కేసులు కట్టి చేతులు దులుపుకొన్నారనే విమర్శలున్నాయి. ఇసుక అక్రమ రవాణాతో పొలాలు దెబ్బతిన్నదంతో రైతులు అభ్యంతరం చెప్పిన అధికారులకు అక్రమార్కులకు వంతపాడుతూ సర్దుకుపోండి అంటూ నచ్చచెప్పడం గమనార్హం.

ఐదేళ్ల వైసీపీ పాలనలో ఇష్టానుసారం సాగిన ఇసుక తవ్వకాలు ప్రభుత్వం మారడంతో ఆగినట్లే కనిపించాయి. అయితే వైసీపీ హయాంలోని ఇసుక మాఫియాలో కొందరు అధికార పార్టీ నాయకులతో సంబంధాలు పెట్టుకొని అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. కాళంగి నదిలో రాత్రింబవళ్లు తేడా లేకుండా

కేజే కృష్ణమూర్తి కన్నుమూత

● టీటీడీ తరిగొండ వెంగమాంబ ప్రాజెక్టు వ్యవస్థాపక డైరెక్టర్‌గా విశేష సేవలు

● టీటీడీ మహా భారత ప్రాజెక్టుకూ విశిష్ట కృషి

● ఎస్వీయూ ఓఆర్ఐ డైరెక్టర్‌గానూ బాధ్యతల నిర్వహణ



కేజే కృష్ణమూర్తి (ఫైల్ ఫొటో)

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ ప్రాజెక్టు వ్యవస్థాపక డైరెక్టర్ ప్రొఫెసర్ కేజే కృష్ణమూర్తి (90) కన్నుమూశారు. కర్నూలు జిల్లా నందికొట్కూరు మండలం సుంకేసుల ఈయన స్వగ్రామం. ఎస్వీ ఓరియెంటల్ కాలేజీలో విద్వాన్ చదువుకోవడానికి తిరుపతికి వచ్చారు. ఎస్వీయూ తెలుగు విభాగంలో ఎంఏ తెలుగు కోర్సును ప్రైవేటుగా పూర్తి చేశారు. ఓరియెంటల్ కాలేజీలో అధ్యాపకుడిగా పని చేశారు. నంద్యాలలోని ఓ హైస్కూల్లో పదేళ్లు తెలుగు పండితుడిగా పని చేశారు. తరిగొండ వెంగమాంబ సాహిత్యంపై ప్రొఫెసర్ జీరెడ్డి చెన్నారెడ్డి పర్యవేక్షణలో ఎస్వీయూ తెలుగు విభాగంలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఎస్వీయూ ప్రాచ్య పరిశోధనా సంస్థ (ఓఆర్ఐ) విభాగంలో అధ్యాపకుడిగా చేరారు. ఓఆర్ఐ డైరెక్టర్‌గానూ వ్యవహరించారు. 1996 లో పదవీ విరమణ పొందారు. 1996-2000 మధ్య కాలంలో టీటీడీ మహా భారత ప్రాజెక్టు కో-ఆర్డినేటర్‌గా వ్యవహరించారు. 2004లో టీటీడీ ఏర్పాటు చేసిన మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్‌గా సేవలందించారు. తరిగొండ వెంగమాంబ రాసిన అనేక రచనలను పరిష్కరించారు. వీటిలో ముఖ్యంగా, వేంకటాచల మహాత్మ్యం, ద్విపద భాగవతం, యక్షగానాలు వంటివి ఆయన ద్వారా వెలుగులోకి వచ్చాయి. కేజే కృష్ణమూర్తి సతీమణి నాగసుదర్శనమ్మ 2004లో మృతి చెందారు. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. పెద్ద కుమారుడు శ్రీధర్ ఎస్వీ ఎస్ కాలేజీలో ఫిజిక్స్ అధ్యాపకుడిగా, పార్థసారథి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఉద్యోగం చేస్తున్నారు. ఈయన సోదరుడు జూలకంటి బాలసుబ్రమణ్యం సప్తగిరి పత్రిక సంపాదకుడిగా పని చేశారు. కపిలతీర్థం రోడ్డులోని రామచంద్ర నగర్‌లో నివాసమున్న కేజే కృష్ణమూర్తి, ఆరు నెలలుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ, శుక్రవారం రాత్రి 7 గంటల సమయంలో కన్నుమూశారు. శనివారం ఉదయం 11 గంటలకు హరిశ్చంద్ర శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మృతికి పలువురు సంతాపం తెలిపారు.





విమానాశ్రయంలో సీఎంకు వీడ్కోలు పలుకుతున్న డీఐజీ, కలెక్టర్, ఎస్పీ

సీఎంకు సాదర వీడ్కోలు

రేణిగుంట, మార్చి 21, (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుకు ప్రజా ప్రతినిధులు, టీడీపీ నాయకులు, అధికారులు సాదర వీడ్కోలు పలికారు. శుక్రవారం మనవడు దేవాన్ష్ జన్మదినం సందర్భంగా కుటుంబ సమేతంగా శ్రీవారిని దర్శించుకున్న అనంతరం తిరుమల నుంచి తిరుపతి విమానాశ్రయం చేరుకున్న ముఖ్యమంత్రికి తిరుపతి, శ్రీకాళహస్తి, చంద్రగిరి, నగరి, సత్యవేడు ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, బొజ్జల సుధీర్ రెడ్డి, భానుప్రకాష్, పులివర్తి నాని, కోనేటి ఆదిమూలం, డిప్యూటీ మేయర్ ఆర్‌సి మునికృష్ణ, యాదవ్ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, టీటీడీ ఈవో శ్యామల రావు, డీఐజీ షిమోషీ బాజ్‌పాయి, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్ రాజు, జేసీ శుభం బన్సల్, తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య తదితరులు వీడ్కోలు పలికారు.

తిరుమలలో ఆగిన ఆఫ్‌లైన్ అద్దె చెల్లింపులు



ఆఫ్‌లైన్ ద్వారా కట్టించుకోవడం లేదని బిల్లు చూపిస్తున్న స్థానికుడు

తిరుమల, మార్చి21(ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఆఫ్‌లైన్ ద్వారా జరిగే అద్దె చెల్లింపులు ఆగిపోయాయి. టీటీడీకి చెందిన నివాసగృహాలు, కార్యాలయాలు, దుకాణాలు, హాకర్ లైసెన్సుల అద్దెతో పాటు కరెంటు, నీటి బిల్లులను తిరుమలలోని షాపింగ్ కాంప్లెక్స్‌లో ఉన్న యూనియన్ బ్యాంక్ ద్వారా ఆఫ్‌లైన్‌లో చెల్లిస్తుంటారు. దుకాణాల అద్దె ద్వారా రోజుకు సుమారు రూ.40 లక్షలు, విద్యుత్ బిల్లుల ద్వారా రూ.20 వేల నుంచి రూ.30 వేలు (చివరి తేదీ అయితే రూ.లక్ష) వరకు వసూలు అవుతుంటుంది. ఇక నివాసగృహాలు, కార్యాలయాలు, మఠాల నీటి బిల్లులు నెలకు దాదాపు రూ.20 లక్షల వరకు చెల్లిస్తుంటారు. ఆన్‌లైన్‌లోనే చెల్లించాలనే నిబంధనతో ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా ఈ కౌంటర్‌లో ఉన్న సిస్టమ్‌కు గురువారం నుంచి యాక్సెస్‌ను కట్ చేశారు. దీంతో కౌంటర్ వద్దకు బిల్లులు చెల్లించేందుకు వెళ్లిన వారికి ఆఫ్‌లైన్ ద్వారా కట్టించుకోవడం లేదని సిబ్బంది చెప్పి పంపేస్తున్నారు. ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు తెలియని అనేక మంది ఆగచాట్లు పడుతున్నారు. కొందరు బిల్లుల కంటే అధికంగా చెల్లించి ఇతరుల వద్ద బిల్లులు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. తిరుమలలో వ్యాపారాలు చేసేవారిలో చాలా మంది చదువుకోని వారే ఉండటంతో ఆన్‌లైన్‌లో బిల్లులు కట్టేలేక ఇబ్బంది పడుతున్నారు. మరి కొందరు తమ బిల్లులు కట్టించుకోవాలని కౌంటర్ చుట్టూ తిరుగుతున్నారు.

పని ఒత్తిడి తగ్గించండి

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పంచాయతీ కార్యదర్శులకు పని ఒత్తిడి తగ్గించాలని జిల్లా గ్రామ పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకులు కోరారు. శుక్రవారం వారు కలెక్టరేట్‌లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దేవేంద్రరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సర్వేలు, పథకాల అమలులో పంచాయతీ కార్యదర్శులు కీలకపాత్ర పోషిస్తున్నారని చెప్పారు. సెలవు, పండుగ రోజుల్లోనూ సర్వేలు చేయాల్సి వస్తోందని వాపోయారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఉపశమనం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా గ్రామ పంచాయతీ కార్యదర్శుల సంఘం సభ్యులు జి.శ్రీనివాసులు, గిరిధర్ రెడ్డి, మాధవి, రాజేష్, నాగవేణి, బాబునాయుడు, దుష్యంత్‌రెడ్డి, మధు, బాలాజీ పాల్గొన్నారు.



స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దేవేంద్రరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న పంచాయతీ కార్యదర్శులు

పర్యావరణ పరిరక్షణలో అడవులే కీలకం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ శంకర్ శర్మ

సూళ్లూరుపేట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ, జీవుల మనుగడలో అడవులు ఎంతో కీలకమని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎల్‌బీ శంకర్ శర్మ అన్నారు. గురువారం వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వృక్ష, జంతుశాస్త్ర శాఖల ఆధ్వర్యంలో ప్రపంచ అటవీ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో అడవులు ఎంతో కీలకమని, వాటిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అడవులు లేకపోతే కాలుష్యం పెరగడమే కాకుండా వర్షపాతం తగ్గిపోతుందన్నారు. అనంతరం విద్యార్థులకు అడవుల పరిరక్షణ అంశంపై విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు విక్టోరియా రాణి, శ్రీనివాస్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామ్స్ రాజా తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన పోలేరమ్మ ఆర్చి నిర్మాణం

దారిలేక పట్టణవాసుల ఇబ్బందులు



ఆర్చి పక్కన ఇరుకు దారిలో వెళ్తున్న వాహనదారులు

వెంకటగిరి టౌన్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని క్రాస్‌రోడ్డులో చేపట్టిన పోలేరమ్మ ఆర్చి నిర్మాణం పనులు నత్తనడకన సాగుతుండడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతేడాది డిసెంబరు 14న ఆర్చి నిర్మాణానికి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ శంకుస్థాపన చేశారు. పనులు చేపట్టిన కాంట్రాక్టర్ మూడు నెలల్లో నిర్మాణం పూర్తి చేస్తామని చెప్పారు. 50 రోజుల క్రితం ఆర్చి శ్లాబ్ నిర్మించారు. అప్పటి నుంచి ఎటువంటి పనులు జరగలేదు. పైగా దారిలో వాహనాలు, పాదచారులు వెళ్లకుండా ఇసుక అడ్డంగా పోశారు. దీంతో దారిలేక ప్రజలు నానాపాట్లు పడుతున్నారు. వెంటనే పనులు ప్రారంభించి త్వరగా పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు.

ఎన్ఎంయూ ఆధ్వర్యంలో ధర్నా



డిపో వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఎన్ఎంయూ నాయకులు

గూడూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ డిపో వద్ద నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ధర్నా శుక్రవారం నాలుగోరోజు కొనసాగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గూడూరు డిపో మేనేజర్ ఉద్యోగుల పట్ల వ్యవహరిస్తున్న నిర్లక్ష్యపు వైఖరి మార్చుకోవాలన్నారు. డిపోలో సర్వీసుల సంఖ్యను తగ్గించే ప్రక్రియను మానుకుని, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అలాగే రెస్ట్‌రూం ఏర్పాటు చేయాలని, గూడూరు నుంచి తిరుమల, బెంగళూరుకు బస్సులను నడపాలని కోరారు. కార్యక్రమంలో అహ్మద్, శ్రీనివాసులు, కృష్ణ, గోపాల్, మస్తాన్, ఉమామహేశ్వరి, పార్వతి, శ్రీకళ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలను పెంపొందించేందుకు చర్యలు



బ్రోచర్లను విడుదల చేస్తున్న పాఠశాల సిబ్బంది

గూడూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించేందుకు చర్యలు చేపట్టినట్లు గాయత్రి పాఠశాల కరస్పాండెంట్ శివకుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం పాఠశాలలో హైదరాబాదుకు చెందిన ఈ - అభ్యాస్ అకాడమీ ఆధ్వర్యంలో ఒలంపియాడ్ బోధనకు సంబంధించిన బ్రోచర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు ఐఐటీ, నీట్‌లో శిక్షణ అందజేసేలా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సాయిరాంకృష్ణ, శ్రీహరి, రఫీ, సుప్రజ, రజని, రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని ఆత్మహత్యాయత్నంపై విచారణ జరపాలి

సూళ్లూరుపేట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట అంబేడ్కర్ బాలికల గురుకులంలో విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటనపై విచారణ జరపాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి తేరే సూర్య ఒక ప్రకటనలో కోరారు. సూళ్లూరుపేట గురుకులంలో తరచూ ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని, దీనివల్ల విద్యార్థుల తల్లిదండ్రులు భయపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద పీఏసీఎస్, వ్యవసాయశాఖ అధికారులు

చిల్లకూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చిల్లకూరులోని పీఏసీఎస్ కార్యాలయం వద్ద పీఏసీఎస్, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఏవో భవానీ తెలిపారు. రైతులు దళారుల చేతుల్లో మోసపోకుండా కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం అమ్ముకోవాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈవో రాజనేని రామయ్య నాయుడు, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, మల్లికార్జున్, శివశంకర్, కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

శీతల యాగం

వెంకటగిరి టౌన్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): స్థానిక బంగారుపేట బీసీ కాలనీలోని విష్ణుదుర్గ పరమేశ్వరి శక్తిపీఠంలో స్వామి వివేకానంద యువసైన్యం వ్యవస్థాపకుడు వీపీ ప్రకృతికుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం శీతల యాగం నిర్వహించారు. ప్రజలు ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని, రైతులు పాడి పంటలతో సుభిక్షింగా ఉండాలని శీతల యాగం చేయించామని ప్రకృతికుమార్ చెప్పారు.

హడలెత్తిస్తున్న హైవే

- వరుస ప్రమాదాలతో బెంబేలు
- 50 రోజుల్లో 10 మంది మృతి

పెళ్లకూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): నూతనంగా నిర్మించిన ఆరు వరుసల 71వ జాతీయ రహదారి ప్రయాణికులను బెంబేలెత్తిస్తోంది. వాహనాల అతివేగం కారణంగా తరచూ ఏదో ఒక చోట ప్రమాదం సంభవిస్తోంది. ఇప్పటికే పది మంది మృత్యువాత పడగా ఎంతో మంది క్షతగాత్రులయ్యారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన తిరుమల, తిరుపతి పుణ్య క్షేత్రాలతో పాటు శ్రీకాళహస్తి, కాణిపాకం, కాంచీపురం, తిరుత్తణి, తిరువళ్లూరు, శ్రీపురం, తిరువణ్ణామలై లాంటి ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రాలకు వెళ్లే మార్గం రెండు లేన్‌లుగా ఉండేది. వాహనాల రద్దీ పెరగడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకునేవి. దీంతో నాయుడుపేట నుంచి రేణిగుంట వరకు 57 కిలో మీటర్ల రహదారిని రూ.1931 కోట్ల వ్యయంతో సిక్స్ లేన్‌గా మార్చారు. నిర్మాణ పనులు దాదాపు పూర్తవడంతో అనధికారికంగా వాహనాలు రాకపోకలు సాగుతున్నాయి. అయితే రహదారికి ఇరువైపులా రక్షణ డివైడర్ల నిర్మాణం అసంపూర్తిగా ఉంది. సర్వీస్ రోడ్డు కూడా కొన్నిచోట్ల పూర్తి కాలేదు. రోడ్డు భద్రతా ప్రమాణాలు తెలిపే సూచిక బోర్డులూ ఏర్పాటు చేయలేదు. అదేవిధంగా వేగ నిర్ధారణ కెమెరాలు అమర్చినా అవి పూర్తిస్థాయిలో పనిచేయకపోవడంతో వాహన చోదకులు అతి వేగంగా వెళుతున్నారు. దీనికి తోడు నాయుడుపేట నుంచి పెళ్లకూరు, తొట్టంబేడు, శ్రీకాళహస్తి, ఏర్పేడు, రేణిగుంట వరకు జాతీయ రహదారికి సమీపంలోని గ్రామాల ప్రజలు రోడ్డుపైకి చేరాలంటే రాంగ్ రూట్లో వెళ్లాల్సిన పరిస్థితి. ఈ క్రమంలో అకస్మాత్తుగా మనిషో.. పశువో అడ్డొస్తే వాహనదారులు వేగాన్ని నియంత్రించలేక ప్రమాదాలకు గురవుతున్నారు. అలాగే అతివేగం, మద్యం తాగి, విశ్రాంతి లేకుండా వాహనాలు నడపడం, నిర్లక్ష్యం వంటి కారణాల వల్ల ప్రమాదాలు గణనీయంగా పెరుగుతున్నాయి. ఎక్కువగా ఆగివున్న వాహనాలను వెనుక నుంచి ఢీకొనడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. సిక్స్ లేన్‌గా నిర్మాణం పూర్తయి జాతీయ రహదారిపై వాహనాలు రాకపోకలు ప్రారంభమైన తరువాత పెళ్లకూరు మండలంలో గడిచిన 50 రోజుల్లో జరిగిన ప్రమాదాల్లో పది మంది మృతి చెందగా, 25 మంది గాయపడ్డారు.



దొడ్లవారిమిట్ట వద్ద జరిగిన ప్రమాదంలో కారులోనే మృతి చెందిన హైదరాబాద్‌కు చెందిన మాధవకృష్ణ, సరితా సుమంగళి(ఫైల్‌ఫొటో)

ప్రమాదాల నివారణకు చర్యలు

జాతీయ రహదారిపై ప్రమాదాలను నివారించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అతివేగం, డ్రైవర్లకు విశ్రాంతి లేకుండా దూరప్రయాణం, నిద్రమత్తు, నిర్లక్ష్యం తదితర కారణాలతో ప్రమాదాలు జరుగున్నాయి. వీటన్నింటిపై అవగాహన కల్పిస్తున్నాం. వాహనదారులు నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా గమ్యాన్ని చేరుకోవాలి.

\- నాగరాజు, ఎస్ఐ

- ఫిబ్రవరి 7న టెంకాయతోపు వద్ద కారు ఢీకొనడంతో రోడ్డు దాటుతున్న రావులపాడుకు చెందిన మందం వెంకటరత్నం మృతి.
- ఫిబ్రవరి 15న హైదరాబాద్‌కు చెందిన గన్ను మాధవకృష్ణ, పోకల సరితా సుమంగళి దైవ దర్శనానికి వచ్చి కారులో తిరిగి వెళ్తూ దొడ్లవారి మిట్ట వద్ద రోడ్డు పక్కన ఆగివున్న లారీని ఢీకొని దుర్మరణం.
- ఫిబ్రవరి 22న నాయుడుపేట మండలం మాలయకోటకు చెందిన షేక్ ఖలీల్‌బాషా రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా దొడ్లవారిమిట్ట వద్ద వాహనం ఢీకొని మృతి.
- ఫిబ్రవరి 28న చవటకండ్రిగ వద్ద లారీని ట్రాలీ ఢీకొని బోల్తా పడిన ఘటనలో రామయ్య మృతి.
- ఫిబ్రవరి 28న చవటకండ్రిగ వద్ద అక్కగారిపేటకు చెందిన ఇలుపూరు నందగోపాల్ బైక్‌పై వెళుతుండగా వాహనం ఢీకొనడంతో మృతి.
- మార్చి 7న రేణిగుంట సమీపంలో గాజులమండ్యం వద్ద జరిగిన ప్రమాదంలో భీమవరం గ్రామానికి చెందిన కట్ల రమణయ్య, దామతోటి తిరుపాల్ మృత్యువాత పడ్డారు.
- మార్చి 8న తాళ్వాయిపాడు వంతెన వద్ద కారు డివైడర్‌ను ఢీకొనడంతో బెంగళూరుకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సతీష్‌కుమార్ మృతి.
- మార్చి 14న తమిళనాడు రాష్ట్రం హోసూరుకు చెందిన ప్రదీప్ అప్పునూ బైక్‌పై అతివేగంగా వెళ్తూ పెన్నేపల్లి వద్ద ఆగివున్న కంటైనర్‌ను ఢీకొని దుర్మరణం చెందాడు.

పులికాట్ తీరప్రాంత సమస్యలను పరిష్కరించండి



తడ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పులికాట్ సరస్సు తీరప్రాంత గ్రామాల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను కోరారు. శుక్రవారం అమరావతిలోని సచివాలయంలో డిప్యూటీ సీఎంను ఎమ్మెల్యే కలిసి పులికాట్ తీరప్రాంత గ్రామాల సమస్యలను వివరించారు. పులికాట్ సరస్సు తీరప్రాంతం వన్యప్రాణి విభాగం సంరక్షణలో ఉందని, దీనివల్ల వేనాడు, పేర్నాడు, కొరిడి గ్రామాల్లో ఆంక్షలు అమల్లో ఉన్నాయన్నారు. దీంతో మౌలిక సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వేనాడు, పేర్నాడు రోడ్డుకు నిర్మాణానికి అవసరమైన అటవీ అనుమతులతో పాటు నిధులు కేటాయించాలని ఆమె కోరారు. అలాగే తీరప్రాంత గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకునేందుకు నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే కోరారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని డిప్యూటీ సీఎం హామీ ఇచ్చారు.

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు వినతి పత్రం ఇస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ

అనారోగ్యంతో ఆర్ఐ మృతి

చిట్టమూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): చిట్టమూరు తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్స్‌పెక్టర్‌గా పనిస్తున్న శ్రావణ్ కుమార్ శుక్రవారం మృతి చెందాడు. వారం రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయనను నెల్లూరులోని ఓ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. శ్రావణ్ కుమార్ కు భార్య, కుమార్తె ఉన్నారు. తహసీల్దార్ శతీష్ కుమార్, డీటీ విజయలక్ష్మి, రీసర్వే డీటీ నిరంజన్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది, వీఆర్వోలు శ్రావణ్ కుమార్ మృతదేహానికి నివాళులర్పించారు. అంత్యక్రియలకు ప్రభుత్వం తరపున రూ.25వేల అందజేశారు.

గ్రామీణ నీటి పథకాల పరిశీలన

తడ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ నీటి పథకాలను జడ్పీ సీఈవో విద్యారామ పరిశీలించారు. శుక్రవారం తడకు వచ్చిన ఆమె మాంబట్టులో నిర్మించిన సీపీడబ్ల్యూ పథకానికి సంబంధించి భవన నిర్మాణం, నీటి సరఫరా వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కొలవి రఘురెడ్డి, ఎంపీడీవో విజయకుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రకాష్, సర్పంచు రమణయ్య, టీడీపీ నేత వేనాటి రాజారెడ్డి, కాంట్రాక్టర్ శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

3న ఎన్‌బీకేఆర్‌లో సాంకేతిక సదస్సు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డైరెక్టర్, విభాగాధిపతులు

కోట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏప్రిల్ 3వ తేదీన ఇన్స్పిరాన్ 2025 సాంకేతిక సదస్సు సదస్సు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డితో పాటు పలు విభాగాధిపతులు శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ సురేష్‌రెడ్డి, ప్రోగ్రామ్ కన్వీనర్ డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, కోఆర్డినేటర్లు డాక్టర్ శంకరయ్య, పార్థసారధిలు ఉన్నారు.

బైక్ బోల్తా: ఒకరికి గాయాలు

కోట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణ పరిధిలోని క్రాస్‌రోడ్డు సమీపంలో శుక్రవారం బైక్ బోల్తా కొట్టిన ఘటనలో శ్రీకాంత్ అనే చిరువ్యాపారికి గాయాలయ్యాయి.

భూపయ్య కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

నాయుడుపేట టౌన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మున్సిపాలిటీలోని 18వ వార్డు భూపయ్య కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు అన్నారు. శుక్రవారం భూపయ్య కాలనీలో స్థానిక నాయకులతో కలసి పర్యటించారు. అక్కడ మురుగునీటి పారుదల సౌకర్యం లేకపోవడంతో దుర్గంధం వెదజల్లడంతో పాటు దోమలు ఉన్నట్లు గుర్తించారు. తక్షణమే మున్సిపాలిటీ అధికారులకు తెలియజేసి అక్కడ బ్లీచింగ్ చల్లారు. కార్యక్రమంలో శివకవి ముకుంద, మునిరాజ, వీరయ్య, అంకయ్య, శీనయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల ఆహారంతో ఆరోగ్యం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 21 (ఆంధ్రజ్యోతి): చిరుధాన్యాలతో కూడిన ఆహార ఉత్పత్తులతో ఆరోగ్యంతో పాటు ఆదాయం కలుగుతుందని తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన (ఆర్ఏఆర్ఎస్) శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.కలీముల్లా పేర్కొన్నారు. కొన్ని రోజులుగా ఆర్ఏఆర్ఎస్‌లో దళిత మహిళలకు చిరుధాన్యాలతో ఆహార ఉత్పత్తుల తయారీపై నిర్వహించిన వర్క్‌షాప్ శుక్రవారం ముగిసింది. డాక్టర్ కలీముల్లా మాట్లాడుతూ చిరుధాన్యాల్లో ఎన్నో పోషక విలువలు ఉన్నాయన్నారు. వీటితో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. దీన్ని మహిళలు ఒక ఆదాయ వనరుగా భావించి ఆహార ఉత్పత్తుల తయారీ చేయవచ్చన్నారు. ఆర్ఏఆర్ఎస్ ఏడీ డాక్టర్ సుమతి మాట్లాడుతూ చిరుధాన్యాలను ఆహారంగా తీసుకుంటే బీపీ, షుగర్ దరిచేరవన్నారు. శరీరంలో అధిక కొవ్వును అరికట్టవచ్చన్నారు. వర్క్‌షాప్‌లో పాల్గొన్న మహిళలకు కిట్, సర్టిఫికేట్‌తో పాటు కొర్ర రవ్వ, రాగిమాల్ట్, జొన్న, రాగితో తయారు చేసిన ఆహార పదార్థాలను అందజేశారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఎనిమిది మందికి జరిమానా

తిరుపతి(నేరవిభాగం), మార్చి 21 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో మద్యం తాగి వాహనాలు నడిపిన ఎనిమిది మందిపై ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి, శుక్రవారం కోర్టు ఎదుట హాజరు పరిచారు. విచారించిన న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ ఒక్కొక్కరికీ రూ.10వేలు చొప్పున రూ.80వేలు అపరాధం విధించారు.

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించండి

గూడూరు, మార్చి 21: ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కేంద్రాల్లో రైతులు ధాన్యాన్ని విక్రయించి గిట్టుబాటు ధర పొందాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. రాష్ట్ర పభుత్వం ధాన్యం కొనుగోలు ప్రక్రియను సులభతరం చేసిందన్నారు. దళారుల మాటల నమ్మి తక్కువ ధాన్యాన్ని అమ్ముకోవాల్సిన అవసరం లేదన్నారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోపే నగదు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందన్నారు.

నేడు రైతు సదస్సు

సూళ్లూరుపేట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చెంగాళమ్మ సబ్‌స్టేషన్, మండల పరిధిలోని దేగవారికండ్రిగ సబ్‌స్టేషన్‌లో శనివారం రైతు సదస్సు నిర్వహించనున్నట్లు ఏఈ పూర్ణిమ తెలిపారు. రైతులు, విద్యుత్ వినియోగదారులు ఏవైన సమస్యలుంటే సదస్సులో అధికారుల దృష్టికి తీసుకురావచ్చన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత



చెకు అందజేస్తున్న వేనాటి సతీష్ రెడ్డి, పెరుమాల్, జనార్దనరెడ్డి, మునిరాజా తదితరులు

సూళ్లూరుపేట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం మినమలమూడి గ్రామానికి చెందిన బండి నవదీప్ అనారోగ్యంతో బాధపడుతుండడంతో సీఎం సహాయనిధి నుంచి రూ.6,2,445 మంజూరయ్యాయి. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డి చేతుల మీదుగా చెక్కు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చిట్టేటి పెరుమాల్, వేనాటి జనార్ధనరెడ్డి, నాపా మునిరాజా, పాపారెడ్డి రవీంద్రరెడ్డి, బండి కృష్ణయ్య, రవినాయుడు, పామంజి వెంకటరమణ పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందికి ఫిజియోథెరపీపై శిక్షణ తరగతులు

తడ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): సచివాలయ సిబ్బందికి ఫిజియోథెరపీపై శిక్షణ తరగతులు జరిగాయి. శుక్రవారం ఎంపీడీవో సమావేశ మందిరంలో ఎంపీపీ కొలవి రఘురెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో హైదరాబాదు నిజామస్ ఆస్పత్రి ఫిజియోథెరపిస్టులు పాల్గొని శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయకుమార్, ఫిజియో థెరపిస్టులు రమేష్, సంతోష్‌కుమార్, సచివాలయ కార్యదర్శులు గాబ్రియల్, మస్తాన్, శ్రీనివాసులు, పద్మ పాల్గొన్నారు.

29న మండల సమావేశం

వెంకటగిరి టౌన్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 29న ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కోటేశ్వరరావు శుక్రవారం తెలిపారు.

కోర్టు ప్రాంగణంలో నాగుపాము



పట్టుబడిన నాగుపాము

కోట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): కోటలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో శుక్రవారం నాగుపాము కలకలం సృష్టించింది. కోర్టులో సిబ్బంది విధుల్లో నిమగ్నమై ఉండగా నాగుపాము బుసలు కొడుతూ లోపలికి రావడంతో ఒక్కసారిగా హడలిపోయారు. పట్టణానికి చెందిన పాములు పట్టే వ్యక్తిని తీసుకు రావడంతో అతను చాకచక్యంగా పామును పటుకుని చిట్టేడు ప్రాంతంలో వదిలేశాడు.

చెట్టుపై నుంచి పడి కల్లుగీత కార్మికుడికి గాయాలు

కోట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తిన్నెలపూడిలో తాటిచెట్టు నుంచి పడి కల్లుగీత కార్మికుడు కొమారి రమణయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. తిన్నెలపూడికి చెందిన రమణయ్య గౌడ్ శుక్రవారం సాయంత్రం తాటిచెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడిపోయాడు. తీవ్రంగా గాయపడిన ఆయనను కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం నెల్లూరుకు తీసుకెళ్లారు.

నేటినుంచి విద్యుత్ వినియోగదారుల సమావేశాలు

నాయుడుపేట టౌన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట డివిజన్ పరిధిలోని సబ్‌స్టేషన్లలో ఈనెల 22నుంచి 25వ తేదీ వరకు విద్యుత్ వినియోగదారుల సమావేశాలు నిర్వహించనున్నట్లు డీఈ వరప్రసాద్‌రెడ్డి తెలిపారు. మొదటి రోజు శనివారం ఉదయం 10నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నాయుడుపేట మండలంలోని జువ్వలపాళెం, అన్నమేడు, కలిపేడు, ఓజిలి మండలంలోని ఆరిమేనిపాడు, వజ్జావారిపాళెం, పెళ్లకూరు మండలంలోని చెంబేడు సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ వినియోగదారుల సమావేశం నిర్వహిస్తామన్నారు. ఆయా సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల రైతులు పాల్గొని వారి సమస్యలను తెలియజేయవచ్చన్నారు.

మున్సిపాలిటీ దుకాణాల అద్దె వసూళ్లలో బిల్ కలెక్టర్ చేతివాటం

నాయుడుపేట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మున్సిపాలిటీకి చెందిన నేదురుమల్లి జనార్దనరెడ్డి షాపింగ్ కాంప్లెక్స్ దుకాణాల బాడుగ వసూళ్ల చేసిన బిల్ కలెక్టర్ చేతివాటం చూపారని శుక్రవారం కమిషనర్ ఫజులుల్లాకు ఫిర్యాదు అందింది. ఎన్‌జేఆర్ షాపింగ్ కాంప్లెక్స్‌లో 28 షాపింగ్ దుకాణాలు ఉన్నాయి. వాటి నెలసరి వసూళ్లకు ఓ బిల్ కలెక్టర్‌ను నియమించారు. షాపు నెంబరు 17 సంబంధించి రూ.60వేలు, షాపు నెంబరు 24 సంబంధించి రూ.36వేలు బిల్ కలెక్టర్‌కు చెల్లించినప్పటికీ మున్సిపాలిటీకి జమకాలేదని బాధితులు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.

రైతుల నుంచి అభ్యంతరాల స్వీకరణ



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు జయజయరావు

కోట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): చెన్నై - బెంగళూరు కోస్టల్ కారిడార్ భూముల పరిహారానికి సంబంధించి మండల పరిధిలోని కొత్తపట్నంలో తహసీల్దారు జయజయరావు అధ్యక్షతన శుక్రవారం గ్రామసభ జరిగింది. ఈ నెల 6నుంచి 19వ తేదీ వరకు కొత్తపట్నంలోని కోస్టల్ కారిడార్‌కు సేకరించే భూములపై అభ్యంతరాలను సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీన స్వీకరించారు. కొత్తపట్నం పంచాయతీలో 347.97 ఎకరాలకు ఒక్కొక్క ఎకరానికి రూ.8 లక్షల పరిహారం చెల్లించేందుకు అర్హులైన రైతుల జాబితాను ప్రచురించారు. ఇందులో 243.77 ఎకరాలకు అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. దీంతో శుక్రవారం కోట తహసీల్దారు జయజయరావు, వాకాడు తహసీల్దారు రామయ్య, వడమాలపేట డిప్యూటీ తహసీల్దారు సునీల్ రైతుల నుంచి అభ్యంతరాలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను రైతులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో సర్వేయర్ గోపీరెడ్డి, వీఆర్వోలు శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, బ్రహ్మయ్య తదితరులు ఉన్నారు.

గ్రంథాలయానికి శాశ్వత భవనం నిర్మించండి



గ్రంథాలయ అద్దె భవనం

బాలాయపల్లి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన బాలాయపల్లిల్లో గ్రంథాలయానికి శాశ్వత భవనం లేకపోవడంతో పాఠకులు అసౌకర్యానికి గురౌతున్నారు. ప్రస్తుతం అద్దె భవనంలో గ్రంథాలయం ఉంది. గత టీడీపీ ప్రభుత్వం హయాంలో శాశ్వత భవన నిర్మాణానికి రూ.2లక్షలు మంజూరయ్యాయి. నిర్మాణ వ్యయం కంటే నిధులు మంజూరు తక్కువగా ఉండడంతో పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. ప్రస్తుతం ఉన్న అద్దె భవనంలో సౌకర్యాలు లేకపోవడంతో పాఠకులు ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా భవనం చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో పాములు సంచరిస్తున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవచూపి గ్రంథాలయానికి శాశ్వత భవనం నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని పాఠకులు కోరుతున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

గూడూరు, మార్చి 21: ఆటోడ్రైవర్లు రహదారి నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు చేపడుతామని పట్టణ సీఐ శేఖర్‌బాబు అన్నారు. శుక్రవారం స్థానిక టవర్‌క్లాక్ సెంటర్ వద్ద ఆటోడ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోడ్రైవర్ల తప్పనిసరిగా రహదారి నియమాలను పాటించాలన్నారు. వేగంగా, మద్యం తాగి వాహనాలు నడిపినా, పరిమితికి మించి ప్రయాణికులను తరలించినా చర్యలు చేపడుతామన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా వాహనాలను పార్కింగ్ చేయాలని, తప్పనిసరిగా ధ్రువీకరణపత్రాలు కలిగి ఉండాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సిబ్బంది, ఆటోడ్రైవర్లు పాల్గొన్నారు.



ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న సీఐ శేఖర్‌బాబు